

జోడు రమేష్ కుమార్
చీఫ్ బ్యూరో
+91 99592 92159

KADILIMCHE VAARTHA Telugu daily

# కదిలించే వార్త
తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

సంపుటి : 05 సంచిక : 363 పేజిలు : 08, వెల రూ. 5రూ/ సోమవారం - 09 - జున్ - 2025

Ananthapuramu. Vijayawada. Tirupati. Visakhapatnam. tadepalligudem. Guntur. Kurnool. Nellore. Srikakulam. Rajamahendravaram. Kadapa. Ongole. Chittoor. Hyderabad. mahabubnagar. Warangal. Khammam. Nalgonda. Nizamaba


## మహిళల వ్యక్తిత్వంపై దాడిని
# ఉపేక్షించేది లేదు

- అమరావతి మహిళలపై వికృత వ్యాఖలను ఖండించిన సీఎం చంద్రబాబు
- మీడియాలో మన తల్లులు, చెల్లెళ్లపై వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమన్న సీఎం
- రాజకీయ, మీడియా ముసుగులో స్త్రీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వారిపై అత్యంత కఠిన చర్యలు
- ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి అని, స్త్రీమూర్తులను ఆరాధించే సమాజం మనది
- 'రాజధాని గురించి, ఆ ప్రాంత మహిళల వ్యక్తిత్వాలను అవమానించేలా వేశ్యలు అంటూ చేసిన వ్యాఖ్యలను ఉపేక్షించే ప్రసక్తే లేదు



మహిళల వ్యక్తిత్వంపై దాడిని ఉపేక్షించేది లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాజకీయ, మీడియా ముసుగులో స్త్రీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వారిపై అత్యంత కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాజధాని ప్రాంత మహిళలపై వికృత వ్యాఖలను ఆయన ఖండించారు. ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి అని, స్త్రీమూర్తులను ఆరాధించే సమాజం మనదని తెలిపారు. ఇది మన సంప్రదాయం మన భారతీయ జీవన విధానమని చంద్రబాబు వెల్లడించారు.ముఖ్యంగా మన తెలుగు ప్రజల విషయానికి వస్తే ఆడబిడ్డను, అమ్మను ఎంతో ఆదరణతో చూస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాంటి ఏపీలో రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా ఏకంగా మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరమని తెలిపారు. వాళ్లు ఎప్పుడూ అనుసరించే ఈ విష సంస్కృతిపై తిరుగుబాటుగా గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినా వారి వైఖరిలో మార్పు రాలేదనేది సుస్పష్టమని వ్యాఖ్యానించారు.'రాజధాని గురించి, ఆ ప్రాంత మహిళల వ్యక్తిత్వాలను అవమానించేలా వేశ్యలు అంటూ చేసిన దారుణ వ్యాఖ్యలను ఉపేక్షించే ప్రసక్తే లేదు. రాజకీయ, మీడియా ముసుగులో జరుగుతున్న ఇటువంటి వికృత పోకడలను తీవ్రంగా ఖండిస్తున్నా. తన సొంత

## మాకు సంబంధంలేదని తప్పించుకోలేరు



ఒక టెలివిజన్ ఛానెల్ల్లో అమరావతి మహిళలపై వ్యాఖ్యలు
ఖండించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
జర్నలిస్టు ముసుగులో వ్యాఖ్యలు చేశారంటూ ఆగ్రహం
ఆ వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృత కుట్ర దాగి ఉందని ఆరోపణ
మహిళలను, బౌద్ధ వారసత్వాన్ని అవమానించడం దారుణమన్న జనసేనాని

## ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు విడుదల

8 ఫలితాలు విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్

8 ఇంజినీరింగ్‌లో 71.65 శాతం,అగ్రి, ఫార్మసీ విభాగాల్లో 89.8 శాతం అర్హత సాధించారు, రెండు విభాగాల్లో కలిపి 75.67శాతం ఉత్తీర్ణత




# దేశంలో కొవిడ్ కేసులు సంఖ్య @6,000

- కేరళలోనే అత్యధికం!
- దేశవ్యాప్తంగా 6,133 కొవిడ్ యాక్టివ్ కేసులు ఉన్నట్లు
- కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడి
- గత 48 గంటల్లోనే 769 కొత్త కేసులు నమోదు
- దేశవ్యాప్తంగా 65 మంది మరణించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడి
- ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 81, తెలంగాణలో 10 కొవిడ్ కేసులు నమోదు



దేశంలో కరోనా కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 6000 మార్కును దాటింది. గత 48 గంటల్లోనే 769 కొత్త కేసులు నమోదయ్యాయి. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 65 మంది మరణించినట్లు ఆదివారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.ఆరోగ్య శాఖ విడదల చేసిన తాజా డేటా ప్రకారం, కేరళలోనే అత్యధికంగా కొవిడ్ కేసులు నమోదవుతున్నాయి. ఆ తర్వాత గుజరాత్?, బంగాల్, ఢిల్లీలో కేసులు ఎక్కవగా ఉన్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యాక్టివ్? కొవిడ్ కేసుల సంఖ్య 6,133లకు చేరింది. గత 24 గంటల్లోనే కొవిడ్? కారణంగా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ సూచించింది. ప్రస్తుతం కేరళలో అత్యధికంగా 1950, గుజరాత్ 822, బంగాల్? 693, ఢిల్లీ 686, మహారాష్ట్ర 595 కేసులు నమోదయ్యాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో 81, తెలంగాణలో 10 కొవిడ్ కేసులు నమోదయ్యాయి.కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలోనే అన్ని రాష్ట్రాల్లో వైద్య సౌకర్యాల తనిఖీ కోసం మాక్? డ్రిల్? - మిగతా 2 లో

# పాస్ వర్డ్‌లు ఇక వద్దు యూజర్లకు గూగుల్ అలర్ట్!




జీమెయిల్ భద్రతకు పాత పద్ధతులకు స్వస్తి చెప్పాలన్న గూగుల్
పాస్‌వర్డ్‌లు, టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ బదులు పాస్‌కీలు, సోషల్ సైన్-ఇన్‌లు ఉత్తమం
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో పెరుగుతున్న సైబర్ దాడుల నేపథ్యంలో ఈ మార్పు
పాస్‌కీలు ఫిషింగ్ దాడులను సమర్థంగా అడ్డుకుంటాయని గూగుల్ వెల్లడి
ఇన్‌స్టాగ్రామ్ అధినేత ఆడమ్ మోసెరీకి కూడా ఫిషింగ్ అనుభవం

## నేడు కాళేశ్వరం విచారణకు హరీశ్

- కాళేశ్వరం కమిషన్ ముందు 114 వ్యక్తిగా
- మాజీ మంత్రి హరీశ్ రావు హాజరుకానున్నారు
- కమిషన్ ముందు ఆయన చెప్పే సమాధానాలు కీలకంగా మారనున్నాయి




## తెలంగాణ రాజ్ భవన్‌లో మంత్రుల ప్రమాణ స్వీకారం

8 తెలంగాణ క్యాబినెట్ లో మరో ముగ్గురు నేతలకు చోటు

8 కొత్తగా ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు మంత్రులుగా ప్రమాణ స్వీకారం

8 కొత్త మంత్రులతో పాటు శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రునాయకన్‌ను కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక



తెలంగాణ క్యాబినెట్ లో మరో ముగ్గురు నేతలకు చోటు దక్కింది. కొత్తగా ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్ భవన్‌లో నూతన మంత్రులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ - మిగతా 2 లో

## నా స్కూల్ బీజేపీ, కాలేజ్ టీడీపీలో,
# ఉద్యోగం రాహుల్ గాంధీ వద్ద

- సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్య
- హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ 'ఆటో బయోగ్రఫీ' పుస్తకావిష్కరణ
- 'ప్రజలకథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- దత్తాత్రేయ, కిషన్‌రెడ్డితో నాకు సన్నిహిత సంబంధాలున్నాయని వెల్లడి
- దత్తాత్రేయ, గౌలిగూడ గల్లి నుంచి హరియాణా గవర్నర్ వరకు ఎదిగారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు



పదవి ఉన్నా లేకున్నా బండారు దత్తాత్రేయపై ఉన్న గౌరవం ఏ మాత్రం తగ్గదని, పార్టీలకు అతీతంగా అందరూ ఆయన్ను గౌరవిస్తారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్?లోని శిల్పకళావేదికలో జరిగిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆటో బయోగ్రఫీ 'ప్రజలకథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. రాజకీయాల్లో ఎన్నో ఒడిదొడుకులు చూసినప్పటికీ దత్తాత్రేయ ఎప్పుడూ వెనకడుగు వేయలేదన్నారు.గౌలిగూడ టు గవర్నర్ వరకు : గౌలిగూడ గల్లి నుంచి హరియాణా గవర్నర్ వరకు ఎదిగారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. - మిగతా 2 లో

## మొదటిపేజీ తరువాయి

# పాస్ వర్డ్ లు ఇక వద్దు... యూజర్లకు గూగుల్ అలర్ట్!

ఆన్‌లైన్ భద్రత విషయంలో పాతకాలపు పద్ధతులకు స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైందని టెక్ దిగ్గజం గూగుల్ గట్టిగా చెబుతోంది. ముఖ్యంగా, మనమందరం రోజూ వాడే జీమెయిల్ వంటి కీలక ఖాతాల రక్షణకు పాస్‌వర్డ్‌లు, టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2%ఖీూ%) వంటి వాటికి బదులుగా పాస్‌కీలు, 'సైన్ ఇన్ విత్ గూగుల్' వంటి సోషల్ సైన్-ఇన్‌లను వినియోగించడం అత్యంత ఉత్తమమని గూగుల్ తాజాగా స్పష్టం చేసింది.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తృతితో సైబర్ నేరగాళ్లు మరింత రెచ్చిపోతున్నారని, దీని ఫలితంగా 61 శాతం మంది ఈమెయిల్ యూజర్లు ఏదో ఒక రూపంలో దాడులకు గురవుతున్నారని గూగుల్ ఆందోళన వ్యక్తం చేసింది. "పాస్‌వర్డ్‌లను గుర్తుంచుకోవడం, వాటిని సురక్షితంగా నిర్వహించడం చాలా కష్టమైన పని" అని కంపెనీ పేర్కొంది. దీనివల్ల అవి సులభంగా ఫిషింగ్ దాడులకు లక్ష్యమవుతాయని, తరచూ జరిగే డేటా ఉల్లంఘనల ద్వారా బయటకు పొక్కుతాయని హెచ్చరించింది. అందుకే, "మీ ఖాతాను ఆటోమేటిక్‌గా సురక్షితంగా ఉంచే, మోసాల నుండి మిమ్మల్ని కాపాడే ఆధునిక సాధనాలను ఉపయోగించడం చాలా ముఖ్యం" అని గూగుల్ నొక్కి చెప్పింది.

**పాస్‌కీలతో పటిష్ట భద్రత**

పాస్‌కీలు అనేవి మన స్మార్ట్‌ఫోన్ వంటి విశ్వసనీయ పరికరాల ద్వారా బయోమెట్రిక్ (వేలిముద్ర, ముఖ గుర్తింపు) లేదా పిన్/ప్యాటర్న్ లాక్ విధానాలతో పాస్‌వర్డ్‌ల అవసరం లేకుండా లాగిన్ అయ్యే వ్యవస్థ. ఇవి ఫిషింగ్ దాడులను అత్యంత సమర్థవంతంగా అడ్డుకోగలవని గూగుల్ భరోసా ఇస్తోంది. అంటే, ఇకపై క్లిష్టమైన పాస్‌వర్డ్‌లను గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం గానీ, వాటిని దొంగిలిస్తారన్న భయం గానీ ఉండదు. యువతరం ఇప్పటికే పాస్‌కీలు, సోషల్ సైన్-ఇన్‌ల వైపు మొగ్గుచూపుతుండగా, పాత తరం వారు ఇంకా సంప్రదాయ పద్ధతులనే అనుసరిస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, మే 1న ప్రపంచ పాస్‌వర్డ్ దినోత్సవం సందర్భంగా కూడా, "మీరు మీ పాస్‌వర్డ్‌ను గుర్తుంచుకోవడానికి లేదా రీసెట్ చేయడానికి బదులు పాస్‌కీతో సురక్షితంగా సైన్ ఇన్ చేయవచ్చు" అని గూగుల్ తన అధికారిక ఎక్స్ (గతంలో ట్విట్టర్) ఖాతాలో ఉద్ఘాటించింది.ఇటీవలే ఇన్‌స్టాగ్రామ్ అధినేత ఆడమ్ మోసెరీ సైతం తాను ఒక సరికొత్త ఫిషింగ్ దాడి నుంచి తృటిలో తప్పించుకున్నట్లు వెల్లడించడం గూగుల్ హెచ్చరికలకు బలం చేకూరుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో, యూజర్లు తమ ఆన్‌లైన్ ఖాతాల భద్రతపై మరింత అప్రమత్తంగా ఉంటూ, పాస్‌కీల వంటి నూతన సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# తెలంగాణ రాజ్ భవన్‌లో మంత్రుల ప్రమాణ స్వీకారం



ప్రమాణం చేయించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం చేసిన వారిలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఉన్నారు. తాజా విస్తరణలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకున్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మాత్రమే అవకాశం కల్పించింది. కాగా, ఈసారి మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలకు చోటు దక్కుతుందని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతానికి ఎస్సీ, బీసీలకు మాత్రమే అవకాశం ఇవ్వాలని అధిష్టానం సూచించినట్లు తెలిసింది. కొత్త మంత్రులతో పాటు శాసనసభ డిప్యూటీ స్పీకర్ గా రామచంద్రునాయకన్ ను కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది.

# నేడు కాళేశ్వరం విచారణకు హరీశ్



కాళేశ్వరం కమిషన్ విచారణలో భాగంగా ఆ నాటి నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు విచారణకు హాజరుకానున్నారు. కమిషన్ కార్యాలయం బీఆర్‌కేఆర్ భవన్‌లో జరిగే విచారణకు హాజరవుతారు. కాళేశ్వరం కమిషన్ జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ విచారణలో భాగంగా ప్రాజెక్టు బ్యారేజీలో నిర్ణయించడంలో కీలక వ్యక్తిగా హరీశ్‌రావు నీటిపారుదల శాఖను నిర్వహించారు. కమిషన్ ముందు ఆయన చెప్పే సమాధానాలు కీలకంగా మారనున్నాయి. హరీశ్ రావు కూడా సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించానని చెపుతారా లేక, అన్నింటికి క్యాబినెట్, నిపుణుల కమిటీ ఆమోదం ఉందని చెబుతారా అనేది ఆసక్తి నెలకొంది. కాళేశ్వరం కమిషన్ ముందు 114 వ్యక్తిగా మాజీ మంత్రి హరీశ్ రావు హాజరుకానున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందీళ్ల బ్యారేజీలను అక్కడ నిర్మించాలని నిర్ణయించింది ఏవరు.. అక్కడే ఎందుకు నిర్మించారు.క్యాబినెట్ ఆమోదం ఉందా తదితర అంశాలను ప్రశ్నలు అడిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరో వైపు హరీశ్ రావు విచారణకు తన అనుచరులతో కలిసి భారీ కాన్వాయ్?తో రానున్నట్లుగా పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికే మాజీ మంత్రి ఈటల రాజేందర్? విచారణ పూర్తి అయింది. ఈనెల 11న కేసీఆర్ విచారణకు హాజరుకావాలని కమిషన్ నోటీసులు జారీ చేసింది.

# మహిళల వ్యక్తిత్వంపై దాడిని ఉపేక్షించేది లేదు

## మొదటిపేజీ తరువాయి



ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం మరింత విచారకరం. రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టు దాటి మహిళల మనోభావాలను గాయపరచిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని' చంద్రబాబు స్పష్టం చేశారు.గత విధ్వంస ప్రభుత్వంపై రాజధాని మహిళల పోరాటాన్ని మనసులో పెట్టుకుని ఆ ప్రాంత స్త్రీలపై ఉద్దేశ్యపూర్వకంగా, నీచాతినీచంగా చేసిన ఈ వ్యాఖ్యలు మొత్తం మహిళా సమాజాన్నే అవమానించడమని చంద్రబాబు వెల్లడించారు. స్త్రీలను గౌరవించి వారి ఆత్మగౌరవానికి అండగా నిలిచే కూటమి ప్రభుత్వం ఈ నీచ సంస్కృతికి చెక్ పెట్టే బాధ్యత తీసుకుంటుందని ఎక్స్ వేదికగా చంద్రబాబు ట్వీట్ చేశారు.మహిళలను అవమానించారు : రాజధాని మహిళలపై కృష్ణంరాజు వ్యాఖ్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఖండించారు. ఈ వ్యాఖ్యలతో మహిళలను అవమానించారని చెప్పారు. అమరావతిలో విలసిల్లిన బౌద్ధాన్నీ అవహేళన చేశారన్నారు. అక్కడి ప్రాంత చారిత్రక, ఆధ్యాత్మిక సంపదను విస్మరించవద్దని చెప్పారు. రాజధానికి భూములు ఇచ్చిన వారిలో 32 శాతం ఎస్సీ, ఎస్టీలు 14 శాతం బీసీలు ఉన్నారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు."అమరావతిపై కుట్రలు చేసేవారిపై కఠిన చర్యలు తప్పవు. విశ్లేషకుడి ముసుగులో చేసిన వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృతమైన కుట్ర ఉంది. ఇలాంటి కుట్రలను ప్రజలు, అధికార యంత్రాంగం లోతుగా విశ్లేషించాలి. రాజధానిని, అక్కడి మహిళలను అవమానించేందుకు కుటిల యత్నం." అమరావతి మహిళల్ని కించపరిచేలా చేసిన వ్యాఖ్యలు చేయడాన్ని మహిళా మంత్రులు ఖండించారు. రాజధాని అమరావతి అంటే వేల మంది రైతుల త్యాగమని మంత్రి అనిత పేర్కొన్నారు. అక్కడి రైతులు 1,630 రోజులు ఆందోళనలు చేశారని గుర్తుచేశారు. ఇందులో 270 మంది చనిపోయారని చెప్పారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం పేరుతో తిరుపతికి పాదయాత్ర చేశారని తెలిపారు. గత ప్రభుత్వం రైతుల పాదయాత్ర సమయంలో అడ్డంకులు సృష్టించిందని విమర్శించారు. అమరావతిని వేశ్యల రాజధాని అని హీనంగా మాట్లాడుతున్నారని అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు.మంత్రి సంధ్యారాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ సాలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆమె కంప్లైంట్ ఇచ్చారు. ప్రజారాజధాని అమరావతి మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# మాకు సంబంధంలేదని తప్పించుకోలేదు

## మొదటిపేజీ తరువాయి



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై ఒక టెలివిజన్ ఛానెల్‌లో విశ్లేషకుడి ముసుగులో ఒక వ్యక్తి చేసిన తీవ్ర వ్యాఖ్యల వెనుక వ్యవస్థీకృత కుట్ర ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు అమరావతి ప్రాంత మహిళలను, ఈ నేల చారిత్రక, ఆధ్యాత్మిక, బౌద్ధ వారసత్వాన్ని అవమానించేలా ఉన్నాయని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు."ఆ మాటలను ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్యలుగా చూడవద్దు. ఆ ఛానెల్ కూడా... ఆ వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు, అవి సదరు వ్యక్తి అభిప్రాయం, మాకు మహిళలంటే ఎంతో గౌరవం అంటూ తప్పించుకోలేదు. వాటిని ప్రసారం చేయడమే కాదు... చర్చ సందర్భంలో కనీసం ఖండించి, తప్పుబట్టలేదు. అంటే ఆ చర్చ వెనుక... నీచ భాషతో రాజధాని ప్రాంతాన్ని, అక్కడ నివసిస్తున్న మహిళలను, ఈ ప్రాంత చారిత్రక నేపథ్యాన్ని, విలసిల్లిన బౌద్ధాన్నీ అవమానించి అవహేళన చేయాలనే కుటిల యత్నం దాగి ఉందనే విషయాన్ని అందరూ గుర్తించాలి" అని స్పష్టం చేశారు.అమరావతిపై నీచ ప్రచారానికి దిగిన వ్యక్తులకు, ముఠాలకు కనీసం ఆ ప్రాంత చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక విశేషాలు కూడా తెలియవు అనిపిస్తోంది. మౌర్యులు, ఇక్ష్వాక రాజుల శాసనాలు లభ్యమయ్యాయి. కాకతీయులు ఈ ప్రాంతంలో శాసనాలు వేయించారు. బౌద్ధం విలసిల్లిన నేల అని చైనా యాత్రికుడు హ్యూయన్ త్సాంగ్ రచనలు చెబుతున్నాయి. ఆచార్య నాగార్జునుడు నడయాడిన ప్రాంతమిది. మహాయాన బౌద్ధం ముఖ్య సంప్రదాయంగా ఆ ధర్మం విస్తరించింది. ఆ సంప్రదాయంతోపాటు ఇతర సంప్రదాయాలూ ఇక్కడ ఆదరణ పొందాయి. కాబట్టే ఈ ప్రాంతాన్ని బౌద్ధులు పవిత్రంగా భావిస్తారు. నాటి అమరావతి శిల్పకళారీతి.. బౌద్ధం విస్తరించిన శ్రీలంక, ఆగ్నేయాసియా దేశాల్లో అదరణ పొందింది. ఇంతటి చారిత్రక నేపథ్యం కలిగిన ఈ ప్రాంతంపై నీచ వ్యాఖ్యలు చేసే వ్యక్తులు- ఆ ధర్మాలను విశ్వసించేవారి గురించి ఎప్పుడైనా ఆలోచించారా?రాజధానిపై గత పాలకుడు, ఆయన సహచరులు కుత్సితమైన వ్యాఖ్యలు చేస్తూ అమరావతి ప్రతిష్ఠను దిగజార్చాలని చూశారు. రాజధానిని శ్మశానంతో పోల్చారు. కుల ముద్ర వేశారు. భూములు ఇచ్చిన రైతులు దీక్షలు చేస్తే తమ రాజకీయ బలంతో అణచివేసే ప్రయత్నం చేసి కేసులుపెట్టి వేధించారు. రాజధాని కోసం భూములు ఇచ్చినవారిలో 32 శాతం ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల రైతులు ఉన్నారు. తాము భూములు ఇచ్చాము, రాజధాని ఇక్కడే ఉండాలని దీక్షలు చేసిన సదరు సామాజిక వర్గంవారిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించి ఇక్కట్ల పాల్జేసింది గత ప్రభుత్వం. 14 శాతం బీసీ రైతులు, 20 శాతం రెడ్డి సామాజిక వర్గం, 18 శాతం కమ్మ, 9 శాతం కాపు, 3 శాతం ముస్లిం రైతులు భూములు ఇచ్చారు.టీవీ ఛానెల్ ద్వారా రాజధాని ప్రాంత మహిళలపై నీచ వ్యాఖ్యలు చేయించారు. అంటే అక్కడ ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర సామాజిక వర్గాల మహిళలందరినీ అవమానించడమే కదా? అమరావతి ప్రాంత చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతను అవహేళన చేయడమే కదా?ఈ ప్రాంతంపై కక్షపూరితంగా, ప్రజా రాజధానిగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతంపై చెడు ముద్ర వేయడమే ఆ ముఠా దురుద్దేశంగా కనిపిస్తోంది. ఈ విధంగా కుట్రలు చేసి దుష్ప్రచారం చేసిన వ్యక్తులపైనా, వారి వెనుక ఉన్నవారిపైనా రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. నీచ వ్యాఖ్యలు చేసినవారిపై చట్ట ప్రకారం చర్యలకు పోలీసులు ముందుకు వెళతారు" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు విడుదల

## మొదటిపేజీ తరువాయి



ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. మొత్తం రెండు విభాగాల్లో కలిపి 75.67శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వివరించారు. ఇంజినీరింగ్‌లో 71.65 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. అగ్రి, ఫార్మసీ విభాగాల్లో 89.8 శాతం అర్హత సాధించినట్లు తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులందరికీ లోకేశ్ అభినందనలు తెలియజేశారు.ఇందుకు సంబంధించిన వివరాలను జేఎన్టీయూ-కాకినాడ వీసీ ఆచార్య సీఎస్ఆర్‌కే ప్రసాద్ వెల్లడించారు. ఈ పరీక్షల్లో 75.67శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు సీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా, హైదరాబాద్‌లో మొత్తంగా 145 కేంద్రాలలో నిర్వహించిన ఈ ఎగ్జామ్?కు 3,62,448మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. 3,40,300 మంది దీనికి హాజరైనట్లు పేర్కొన్నారు. వీరిలో 2,57,509మంది (75.67 శాతం ఉత్తీర్ణత) అర్హత సాధించారని సీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు.మే 19 నుంచి 20వరకు అగ్రికల్చర్, ఫార్మా విభాగానికి నాలుగు సెషన్లలో పరీక్ష నిర్వహించామని సీఎస్ఆర్‌కే ప్రసాద్ చెప్పారు. ఇందుకు 75,460మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. వీరిలో 67,761మంది (89.80శాతం) ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అలాగే, మే 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ విభాగానికి 10 సెషన్లలో జరిగిన పరీక్షకు 2,64,840మంది విద్యార్థులు హాజరు కాగా వీరిలో 1,89,748మంది (71.65శాతం) అర్హత సాధించినట్లు ఆయన వివరించారు.చేసుకోవచ్చని సీఎస్ఆర్?కే ప్రసాద్ పేర్కొన్నారు. పరీక్షలు నిర్వహించిన స్వల్ప వ్యవధిలోనే ఫలితాలు విడుదల చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# దేశంలో కొవిడ్ కేసులు సంఖ్య 6,000

## మొదటిపేజీ తరువాయి



నిర్వహించాలని అన్ని రాష్ట్రాలకు సూచించినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. అంతేకాకుండా ఆక్సిజన్?, ఐసోలేషన్? వార్డులు, వెంటిలేటర్లు, అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించింది.ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై అంచనా వేసేందుకు జూన్? 2,3 తేదీల్లో హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సునీతా శర్మ అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కొవిడ్? కేసులు పెరుగుతున్న కారణంగా పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని చర్యలను తీసుకుంటున్నమని డైరెక్టర్? జనరల్? ఆఫ్? హెల్త్? సర్వీసెస్ డాక్టర్? సునీత శర్మ పేర్కొన్నారు. విపత్తు నిర్వహణ సెల్, అత్యవసర నిర్వహణ ప్రతిస్పందన సెల్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ , ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ , ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ , దిల్లోలోని కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రులు, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆ సమయంలో పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని చర్యలను తీసుకుంటున్నమని వారు పేర్కొన్నారు.

# స్కూల్ బీజేపీ, కాలేజీ టీడీపీలో, ఉద్యోగం రాహుల్ గాంధీ వద్ద

## మొదటిపేజీ తరువాయి



సాధారణ ప్రజలతో ఆయనకు మంచి అనుబంధం ఉందని అన్నారు. పేదలు చేసుకునే చిన్న చిన్న వేడుకల్లో ఆయన భాగం అయ్యేవారని గుర్తుచేశారు. దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి కుటుంబాలతో తనకు చాలా సన్నిహిత సంబంధాలున్నాయని వివరించారు. 'నా స్కూల్ చదువు బీజేపీలో, కాలేజీ చదువు టీడీపీలో ఉద్యోగం రాహుల్ గాంధీ వద్ద చేస్తున్నా అని ఇటీవల ప్రధానికి చెప్పాను' అని రేవంత్ వివరించారు. తనకు ఉన్న సన్నిహిత సంబంధాలను ఎప్పుడు దాచుకోలేదన్నారు. మంత్రివర్గ విస్తరణ ఉన్నప్పటికీ ఆ కార్యక్రమం అవ్వగానే దత్తాత్రేయ కోసం ఇక్కడికి వచ్చాననన్నారు. ఆయన అజాత శత్రువు అని కొనియాడారు.మా నిర్ణయాల్లో వారి స్ఫూర్తి ఉంది : జాతీయ రాజకీయాల్లో వాజ్‌పేయికి ఉన్న గౌరవం రాష్ట్రస్థాయిలో దత్తాత్రేయకు ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమం తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి అని అభివర్ణించారు. ఆయన శైలి, విధానాల నుంచి కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వారు నేర్చుకోవాలని సూచించారు. జంటనగరాల్లో కష్టం వస్తే ప్రజలకు గుర్తుకు వచ్చే నాయకులు పీజేఆర్, దత్తాత్రేయ అని రేవంత్ రెడ్డి అన్నారు. తిరుపతి దర్శనాలు, రైల్వే రిజర్వేషన్ కోసం తమకు సిఫార్సు లేఖలు ఇచ్చేవారన్నారు. తమ నిర్ణయాల్లో వారి స్ఫూర్తి ఉంటుందని అన్నారు.మంత్రివర్గ సమావేశం ఇక్కడే పెట్టుకోవచ్చు : పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పలు రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, తెలంగాణ మంత్రులు పాల్గొన్నారు. దీంతో కార్యక్రమానికి హాజరైన అతిథులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛలోక్తి విసిరారు. ఈ వేదిక గవర్నర్‌ల పరేడ్‌లా ఉందన్నారు. కాంగ్రెస్‌లో ఉన్న మంత్రివర్గం మొత్తం ఈ వేదికపైనే ఉందని, తాను మంత్రివర్గ సమావేశం ఇక్కడే పెట్టుకోవచ్చని సీఎం సరదాగా వ్యాఖ్యానించారు.

# ఇళ్ల స్థలాలు సాగుభూములు సాధన కోసం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న జరుగు ధర్నాలు జయప్రదం చేయండి..

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం...

కేంద్రంలో రాష్ట్రంలో పాలకులు మారుతున్న వ్యవసాయ కూలీల బ్రతుకులు మారడం లేదని




కడప **(కదిలించే వార్త) జూన్ 08:** 78 సంవత్సరాల భారతావనిలో ఇంకా వ్యవసాయ కూలీ మాకు ఇంటి స్థలం కావాలి సాగు భూములు ఇవ్వాలని అడగటం బాధాకరమని అందుకే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 10న కడప జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో వినతి పత్రాలు అందజేసే కార్యక్రమం నిర్వహించాలని ఉపాధి కూలీల సమస్యల కోసం ఉద్యమించాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. ఆదివారం సిపిఐ కార్యాలయం హెచ్ మేన్ భవనం నందు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేశారని అందుకే అటు కేంద్ర బడ్జెట్ లో గాని రాష్ట్ర బడ్జెట్లో గాని సరైన నిధులు కేటాయింపులు జరగడంలేదని పేరుకేమో వికసిత భారత్ అని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ దేశంలో పేదరికం ఆకలి దరిద్రం నిరుద్యోగం తగ్గింది లేదని పైపెచ్చు రైతులు ముస్లిం మైనార్టీల పైన దాడులు చేయడమే గాక వారికి వ్యతిరేకమైన చట్టాలను తీసుకొస్తున్నారని తినే తిండి పైన కట్టుకునే బట్ట పైన ఆన్సర్ విజిస్తున్నారని కులం పేరుతో మతం పేరుతో రాజకీయాలు చేస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని ఇంతటి అప్రజా స్వామిక విధానాలను మునిపెన్నడూ చూడలేదని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతో గొప్పగా చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు 1 కూడా అమలు కావడం లేదని గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలాలు ఇచ్చి మేమే ఇండ్ల నిర్మాణం చేస్తామని చెబుతున్న ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని అదేవిధంగా నేటికీ తల్లికి వందనం డబ్బులు వేయలేదని తక్షణమే వారి అకౌంట్లో డబ్బులు జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉచిత బస్సు ప్రయాణం మూడు సిలిండర్లు ఇవ్వాలని ఆయన కోరారు. జిల్లాలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నప్పటికీ అనేక అవకతవకలు అక్రమాలు జరుగుతున్నాయని వందల కోట్ల రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి ప్రతి వ్యవసాయ కూలీకి చేసిన పనికి తగ్గట్టు కూలి రేట్లు పెంచాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.సుబ్రహ్మణ్యం జిల్లా నాయకులు బ్రహ్మం, పొంగూరు నాగరాజు, కృష్ణ,శ్రీను, తిరుపాల్ పాల్గొన్నారు.

# వెబ్ కౌన్సిలింగ్ వద్దు మ్యానువల్ ముద్దు....

## ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక




కడప **(కదిలించే వార్త) జూన్ 08:** కడప జిల్లా వెబ్ కౌన్సిలింగ్ వద్దు మ్యానువల్ కౌన్సిలింగ్ ముద్దు అనే నినాదంతో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో డీఈవో ముట్టడి కార్యక్రమం చేయడం జరిగింది. మ్యాన్యువల్ కౌన్సిలింగ్ జరపాలని ఏకైక నినాదంతో కడప జిల్లాలోని నలుమూలల నుంచి దాదాపు 2000 మంది ఉపాధ్యాయులు ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఆదివారం సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మోపురి వెంకట శివారెడ్డి మాట్లాడుతూ గతంలో ఉపాధ్యాయ సంఘాలు ధర్నాకు పిలుపు ఇచ్చినప్పుడు కమిషనర్ ఎస్ జి టి ల కౌన్సిలింగ్ మాన్యువల్ గా జరుగుతాయని హామీ ఇచ్చి కానీ ఇప్పుడు మాట తప్పి మరల ఎస్జిటి లందరినీ ఆన్లైన్ ద్వారా కౌన్సిలింగ్ లలో వెబ్ ఆప్షన్ ఇచ్చుకోవాలని ఇవ్వడం చాలా దారుణమైన విషయమని తెలియపరిచారు అలాగే గతంలో ఇచ్చిన ఉపాధ్యాయులకు ఏ హామీని నెరవేర్చకుండా తన అనుకున్న విధంగానే పంతాన్ని నెగ్గించుకోవడం కమిషనర్ మొండి వైఖరికి నిదర్శనమన్నారు. తర్వాత ఇలియాస్ భాష మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అనేక పొరపాట్లు జరిగాయని దీని ద్వారా ఎస్జిటీలు అధిక సంఖ్యలో



ఉండటం వల్ల చాలా మంది ఉపాధ్యాయులకు వెబ్ పైన అవగాహన లేకపోవడం వలన వారు చాలా ఇబ్బందులకి గురవుతున్నారు. కాబట్టి కౌన్సిలింగ్ను మ్యానువల్ విధానంలోనే జరపాలి అలా కాని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని కమిషనర్ ని సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భముగా వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడారు వారందరి ఏకైక నినాదం ఏమిటంటే ఎస్జీటీల కౌన్సిలింగ్ మాన్యువల్ విధానంలోనే జరపాలి. అలా కాని పక్షంలో ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధం అని ప్రభుత్వానికి అల్టిమేట్ జారీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్రెడ్డి సంగమేశ్వర్ రెడ్డి, సురేష్ బాబు,గుజ్జల తిరుపాల్,బండి విశ్వనాథరెడ్డి,లక్ష్మి రాజా, పాలేం మహేష్, శ్యాంసుందర్ రెడ్డి, ఖాదర్ బాషా, చెన్నయ్య,కొండారెడ్డి,బత్తిని నాగేశ్వరరావు, రామాంజనేయులు, ప్రవీణ్ కిరణ్, శివశంకర్ రెడ్డి,సజ్జల రమణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఏబి రామకృష్ణరాజు, వివిధ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై ఆరు నెలలుగా అత్యాచారానికి పాల్పడిన 14 మందిని కఠినంగా శిక్షించాలి

బహుజన్ సమాజ్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప డిమాండ్




కడప **(కదిలించే వార్త) జూన్ 08:** శ్రీ సత్య సాయి జిల్లా రామగిరి మండలం ఏడు గుర్రాలపల్లెలో దళిత మహిళను మొదట ఒక పోకిరి వెధవ అత్యాచారం చేసి వాటిని మొబైల్ లో రికార్డ్ చేసి ఆ వీడియోని చూపిస్తూ వాడు వాడి మిత్రులు 14 మంది దాదాపు ఆరు నెలల నుండి అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. ఈ అత్యాచారంలో పాల్గొన్న 14 మంది పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప జిల్లా ఇన్చార్జి డివిఎస్ జయరాం ఉపాధ్యక్షులు బాలచంద్ర జిల్లా మహిళా అధ్యక్షురాలు బేబీ కడప నగరంలోని జిల్లా బీఎస్పి కార్యాలయం నందు విలేకరుల సమావేశం లో వారు డిమాండ్ చేశారు. అత్యంత దుర్మార్గంగా కూటమి ప్రభుత్వం రోజు మహిళలను ఉద్ధరిస్తున్నట్టు కాపాడుతున్నట్టు ఫోజులు కొట్టడం తప్ప మహిళలకు రక్షణ కల్పించడంలో మహిళలను లైంగిక దాడుల నుండి, అత్యాచారాల నుండి కాపాడడంలో ఘోరంగా వైఫల్యం చెందుతున్నారని ఆరోపించారు. అత్యాచారానికి పాల్పడిన నిందితులను అందరిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అత్యాచారానికి పాల్పడిన వారిపట్ల ఆ నియోజకవర్గం శాసనసభ్యులు, తెలుగుదేశం నాయకులు పోలీసులపై ఒత్తిడి చేసి అత్యాచార ఘటనలో పాల్గొన్న యువకులని కాపాడాలనుకోవడం సిగ్గుచేటని ఆరోపించారు. ఇలాంటి కీచకులను కాపాడితే తెలుగుదేశానికి జనసేన పార్టీకి బిజెపి కూటమి ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పవలసి వస్తుందని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం మహిళలకు గట్టి భద్రత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రోజు ఏదో ఒకచోట రాష్ట్రంలో దేశంలో ఇలాంటి కీచకులకు మహిళలు బలవుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గొప్ప గొప్ప మాటలు తప్ప చేతల్లో మీరు చేసేది శూన్యమని ఆరోపించారు. ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే నిందితులందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అలాగే అత్యాచారానికి గురైన దళిత మైనర్ బాలికను ప్రభుత్వం పూర్తిగా బాధ్యత తీసుకొని మంచి విద్యాసంస్థలో చేర్పించి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే ఆ కుటుంబము అధికార పార్టీ నాయకుల భయంతో ఇల్లు వదిలి తలదాచుకునే దుర్భర పరిస్థితి ఏర్పడిందని అలాంటి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి ధైర్యం చెప్పి నిందితులను శిక్షించి, బాధిత కుటుంబాన్ని సంపూర్ణంగా అన్ని విధాలుగా ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బంది పడకుండా కాపాడాలని కోరారు. నిందితులను కాపాడడంలో ఏమాత్రం రాజీ పడిన బహుజన సమాజ్ పార్టీగా చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

# గుర్తుతెలియని వృద్ధుడు ఉరి వేసుకొని ఆత్మహత్య



ఆత్మకూర్ /(కదిలించే వార్త) జూన్ 08: జాతీయ రహదారి సమీపంలో గల వేప చెట్టుకు గుర్తు తెలియని వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గుడే పాడు గ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం ఆత్మకూరు సిఐ సంతోష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మండలం గూడెంపాడు గ్రామ సమీపంలో గల వేప చెట్టుకు 70 నుంచి 80 సంవత్సరాల వయసు గల వృద్ధుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు గ్రామస్తులు తెలిపారని సిఐ తెలిపారు. మృతిని శరీరంపై నీలిరంగు తెల్ల గీతల షర్టు, ఆకుపచ్చ రంగు గల గీత లుంగీ ఉంది. పసుపు రంగు నైలాన్ తాడుతో ఉరివేసుకున్నాడని తెలిపారు. మృతిని ఎడమ కన్ను బొమ్మ దగ్గర పులిపిరి ఉంది. వృద్ధుని మృతి పై కేసు నమోదు చేసుకొని దార్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతిని గుర్తుపట్టిన బంధువులు ఎవరైనా ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ కు రావాలన్నారు సమాచారం కొరకు సెల్ నంబర్స్ 8712685225,8712685252 లకు కాల్ చేయమని సిఐ తెలిపారు.

# వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యేలు వై వెంకట్రామిరెడ్డి అనంత వెంకట్రామిరెడ్డి.



పామిడి **(కదిలించే వార్త) జూన్ 08:** పామిడి పట్టణంలోని కొండూరు రోడ్డులో గల కోగటం, ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించి వివాహ వేడుకల్లో గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై. వెంకట్రాంరెడ్డి, మరియు అనంతపురం మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డిపాల్గొని ఐదవ వార్డ్ వైసిపి ఇన్చార్జ్ పార్వతీశ్వర్ రెడ్డి కుమారుడైన టి. కిషోర్ రెడ్డి, దీప్తిలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి కూతురు వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతిరెడ్డి, వైసీపీ జిల్లాకార్యదర్శి పెమ్మక. చెన్నకేశవరెడ్డి,ఎంపీపీ మురళీమోహన్ రెడ్డి, జడ్పిటిసి శోభ మధుసూదన్ రెడ్డి,కన్వీనర్లు ఈశ్వర్ రెడ్డి నారాయణరెడ్డి సుధీర్ రెడ్డి మండలంలోని ఎంపీటీసీలు సర్పంచులు తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

# జర్మనిలో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం




వేంపల్లె **(కదిలించే వార్త) జూన్ 08:** ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ లో చదివిన పూర్వపు విద్యార్థి భోగం. హరీష్ కుమార్ వరల్డ్ ఓపెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈనెల 11వ తేదీన జర్మనీలోని కెమ్నిట్జ్ లో జరిగే వరల్డ్ ఓపెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన భోగం. హరీష్ కుమార్ 83 కిలోల ఓపెన్ విభాగంలో పాల్గొనున్నారు. దీంతో భారతదేశం అంతట పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు హరీష్ కుమార్ నుండి అద్భుత ప్రదర్శన కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పోటీలలో పాల్గొన్ని మంచి ప్రతిభను సాధించి మాతృభూమికి అవార్డులతో తిరిగి రావాలని కోరుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న హరీష్ కుమార్ ను ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, పవర్ లిఫ్టింగ్ కోచ్ బాల గోవిందు తివారీ హర్షం వ్యక్తం చేశారు.

# తిమ్మంపేట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

## ఒకరు మృతి – 20 మంది కూలీలకు గాయాలు



గార్లదిన్నె **(కదిలించే వార్త) జూన్ 08:** ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది సింగనమల నియోజకవర్గం లోని గార్లదిన్నె మండలం తిమ్మంపేట వద్ద 44వ జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. దాదాపు 20 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సింగనమల నియోజకవర్గం కల్లూరు, ఎగువపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 20 మంది కూలీలు ఆత్మకూరు మండలం సిద్ధిలాపురం గ్రామానికి చిని కాయలు కోయడానికి వెళ్లారు. రోజంతా చీనీ కాయలు కోసి అలసిపోయిన కూలీలు ఐచర్ వాహనంలో చల్లటి గాలికి సేద తీరుతున్నారు. 44వ జాతీయ రహదారిపై గార్లదిన్నె మండలం తిమ్మంపే ట వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ.. ఐచర్ వాహనాన్ని ఒక్కసారి ఢీకొంది. ఈ ప్రమాదంలో మంగమ్మ అనే మహిళ అక్కడికక్కడే మృతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పుల్లమ్మ అనే మహిళ కూడా మృతి చెందింది మిగతా 20 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వేగంగా వచ్చిన లారీ ఐదర్ వాహనాన్ని ఢీకొనడంతో కూలీలంతా చెల్లాచెదురుగా పడిపోయారు. అపస్మారక స్థితిలో పడిపోయారు. వీరిలో నలగరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను హుటా హుటిన అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తల్లి లీలావతి పరామర్శించారు. అక్కడి వైద్యులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి గార్లదిన్నె పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# తప్ప తాగి సచివాలయం అధికారుల పే మహేంద్ర అనే యువకుడు రాళ్ల దాడి



గార్లదిన్నె **(కదిలించే వార్త) జూన్ 08:** గార్లదిన్నె మండలం కల్లూరు ఆర్ఎస్ కు చెందిన మహేంద్రా అనే యువకుడు మద్యం మత్తులో పాత కల్లూరు గ్రామంలో గల సచివాలయం నెంబర్ 3 పంచాయతీ సెక్రెటరీ దీపక్ పైన రాళ్ల దాడికి ఏయత్నించాగ గ్రామస్తులు అరవగా అక్కడ నుంచి వెళ్ళిపోయాడు మధ్యాహ్నం భోజనం చేస్తుండగా దాదాపు 2:00 గంటల సమయంలో సచివాలయం దగ్గరికి మహేంద్ర అనే యువకుడు మద్యం మత్తులో వెళ్ళగా రెండు నిమిషాలు కూర్చోండి భోజనం చేస్తున్నాం అని వారు చెప్పగా నా పని చేయరా అంటూ నేనంటే ఏమనుకున్నారు అని దుర్భాషలాడుతూ సచివాలయం సిబ్బంది పే రాళ్ల దాడికి దిగాడు. సచివాలయం సిబ్బందిని దుర్భాషలాడుతూ గొడవ చేశాడు. అక్కడ ఉన్న సచివాలయం సిబ్బంది గార్లదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి కేసును దర్యాప్తు చేపట్టారు.

# నటీనటుల కోసం ఆడిషన్స్ శ్రావణ్ కుమార్ నేతృత్వంలో ఆడిషన్స్




పులివెందుల **(కదిలించే వార్త) జూన్ 08:** శ్రీ నటరాజ లక్ష్మీనరసింహ మూవీస్ ఆధ్వర్యంలో నిర్మించబోవు విద్య దీపం పేరుతో రానున్న మూవీ చిత్రానికి నటీనటుల కోసం శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పులివెందులలోని గవర్నమెంట్ ఉమెన్స్ జూనియర్ కాలేజీలో ఆదివారం ఆడిషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పలువురు నటీనటులు వారి యొక్క ప్రావీణ్యతను చూపిస్తూ ఆడిషన్స్ లో పాల్గొన్నారు. ఆడిషన్స్ లో సెలెక్ట్ అయిన వారిని త్వరలో ఈ నెలలో నిర్మించబోవు మూవీలో అవకాశాలు ఉంటాయని తెలియజేస్తూ పత్రిక ముఖ్యంగా వారు మాట్లాడుతూ విద్యా దీపం " పేరుతో సినిమా నిర్మించనున్నామని శ్రవణ్ కుమార్ ఎస్.కె కథ మరియు రచయిత, దర్శకత్వ బాధ్యతలు నిర్వ హిస్తున్నారు. ఇందులో ముత్తుమల లోకేష్ హీరో( సఖి హీరో) మరియు సావిత్రి కృష్ణ హీరోయిన్(సినిమా పిచ్చోడు) పల్లవి హీరయిన్ మరియు శ్రీను శ్రీపతి, రాఘవేంద్ర, మురళి, చంద్రమోహన్ రెడ్డి, పులివెందుల హరి,రాము, పఠాన్, భాష,ప్రధాన పాత్రలోనటించనున్నారు,మిగతా పాత్ర లకోసం ఆడిషన్స్ పులివెందులలోని గవర్నమెంట్ ఉమెన్స్ జూనియర్ కాలేజ్ జరుగుతున్న నేపథ్యంలో పలువురు నటీనటులు హాజరయ్యి ఆడిషన్స్ లో పాల్గొన్న వారిని సెలెక్ట్ చేసి సినిమాలోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆడిషన్స్ గ్రాండ్ సక్సెస్ చేసిన ప్రతీ ఒకరికి ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో నటరాజ లక్ష్మీనరసింహ మూవీస్ టీం తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం...

షైనింగ్ స్టార్స్ "నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్



పుట్టపర్తి, **(కదిలించే వార్త) జూన్ 08:** టెన్త్, ఇంటర్ విద్యార్థులను అన్నివిధాలుగా ప్రోత్సహించ డమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం కొత్తచెరువు ధర్మవరం రోడ్డు వైపునున్న మైలేపల్లి శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో సోమవారం ఉదయం జరుగనున్న షైనింగ్ స్టార్స్ కార్యక్రమం సందర్భంగా ముందస్తు ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. సభా వేదిక, సిట్టింగ్ ఇతరత్రా ఏర్పాట్లను పరిశీలించి అవార్డు ప్రధానంపనులకుసంబంధించిన విషయాలను అధికారుల ద్వారాఅడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులను విద్యార్థులను మరింతగా ప్రోత్సహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని ఇందులో భాగంగా 2024 – 25 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా ఉత్తమ ప్రతిభ పటవాలు కనబరిచిన విద్యార్థులకు సోమవారం ఉదయం జిల్లాలోనిమంత్రులు,ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలు, ఎంపీ తదితర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా విద్యార్థులకు అవార్డుఅందించిఅభినందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలమరియు ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అవార్డుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో 10 వ తరగతి, ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులు సాధించిన వారిని 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం ద్వారా సన్మానించి,పురస్కారం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 83. 33 శాతం అంతకు మించి మార్కులు సాధించిన వారిలో మండలం నుండి 6 మంది ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. 187 మంది పదో తరగతివిద్యార్థినివిద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని, అదేవిధంగా జిల్లాలోనిప్రభుత్వ కళాశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన 38 మంది విద్యార్థిని,విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్ రూ.20 వేల రూపాయలను చెక్ రూపంలో అందజేసి అభినందించడం జరుగుతుందన్నారు. రేపటి రోజున సోమవారం ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు పాల్గొంటున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్ణప్ప, ఏపీసి దేవరాజ్ , ఏడి లాజర్, శ్రీనివాసులు, ఎంఈఓ జాన్ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 14వ తేదీన అనంతపురంలో రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమం నిర్వహణ

యోగా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్

శిల్పారామంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, డిఆర్వో ఏ.మాలోల, జిల్లా అధికారులు, తదితరులు..



అనంతపురం,**(కదిలించే వార్త) జూన్ 08:** అనంతపురం నగర శివారులోని శిల్పారామంలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, వారి కుటుంబ సభ్యులు, డిఆర్వో ఏ.మాలోల, జిల్లా అధికారులు పాల్గొనగా, వారి చేత యోగా మాస్టర్లు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా మాసంలో భాగంగా జిల్లాలో ఉన్న నాలుగు ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన శిల్పారామంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిల్పారామంలోని ముఖ్యమైన మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తనతో పాటు గ్రామస్థాయి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారన్నారు. మళ్లీ తాడిపత్రిలోని శ్రీ చింతల వెంకటరమణ స్వామి ఆలయంలో యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. ఈనెల 14వ తేదీన రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమం అనంతపురంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. సోమవారం యోగా మెగా ర్యాలీ జిల్లా కేంద్రంలో, మండల కేంద్రాల్లో, గ్రామస్థాయిలో కూడా జరగబోతోందన్నారు. యోగా ప్రాముఖ్యత గురించి అందరికి తెలియజేయడంలో కృషి చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలకు అందరూ కూడా స్పందిస్తున్నారన్నారు. యోగా ఆరోగ్యానికి మంచిదవుతుందని, యోగా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, జిల్లా టూరిజం అధికారి జయ కుమార్ బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిఐపిఆర్ఓ పి.గురుస్వామిశెట్టి, డిఎల్డిఓ లలితాబాయి, తహసీల్దార్ హరికుమార్, ఆయుష్ అధికారులు డా.భాస్కర్, డా.లాల్యా నాయక్, యోగా గురువు కృష్ణవేణి, వివేకానంద యోగ సెంటర్ గురువు వై.ఆంజనేయులు, యోగ సెంటర్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.



# ఈనెల 9వతేదీన గ్రామ మరియు వార్డు సచివాలయాల పరిధిలో యోగా ర్యాలీ నిర్వహణ

యోగా గురించి అవగాహన పెంచేందుకు సోమవారం

ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగా ర్యాలీల నిర్వహణ

జిల్లాలోని ప్రతి గ్రామస్థాయిలో, వార్డు స్థాయిలో, హాబిటేషన్ల స్థాయిలో,

అన్ని నివాస ప్రాంతాలలో ర్యాలీలు విజయవంతంగా నిర్వహించాలి

జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలందరూ

పాల్గొనేలా అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్



అనంతపురం, **(కదిలించే వార్త) జూన్ 08:** జూన్ 21న జరిగే యోగాంధ్ర కార్యక్రమం మరియు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 9వతేదీన గ్రామ మరియు వార్డు సచివాలయాల పరిధిలో యోగా గురించి అవగాహన పెంచేందుకు యోగా ర్యాలీలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు సోమవారం అన్ని గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలలో ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారన్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగాపై ర్యాలీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామస్థాయిలో, వార్డు స్థాయిలో, హాబిటేషన్ల స్థాయిలో, అన్ని నివాస ప్రాంతాలలో ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సచివాలయ స్థాయిలో సచివాలయ ఉద్యోగులు ఆ సచివాలయం పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు యోగా గురించి అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీలను నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ యోగాని ప్రాక్టీస్ చేయాలని వారికి తెలియజేయడం జరుగుతుందన్నారు. – యోగా ర్యాలీలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. – ఈ యోగా ర్యాలీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఒకచోట, జాయింట్ కలెక్టర్ గ్రామీణ ప్రాంతంలో ఒకచోట పాల్గొనడం జరుగుతుందని పేర్కొన్నారు. – గ్రామ మరియు వార్డు స్థాయి నుండి పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మేయర్, మునిసిపల్ చైర్‌పర్సన్‌ల వరకు అందరు ప్రజాప్రతినిధులు పాల్గొని యోగా ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# ఆర్డీటీ కోసం మాతో కలిసిరండి..!

## ఈనెల 9వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్



అనంతపురం, **(కదిలించే వార్త) జూన్ 08:** ఈనెల 9వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని సూచించారు.

## మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

### నిజ నిర్ధారణ కమిటీ డిమాండ్



అనంతపురం అర్బన్,**(కదిలించే వార్త) జూన్ 08:** దళిత మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నిజ నిర్ధారణ కమిటీ నాయకులు సాకే హరి,కుల్లాయప్ప,సురేష్,పసులూరి ఓబులేసు,బికేఎస్ ఆనంద్,కదిరిప్ప,సుగామంచి శ్రీనివాసులు, నరేష్,హరినాథ్ రెడ్డిలు డిమాండ్ చేశారు.డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు మైనర్ బాలికపై జరిగిన దారుణ దుశ్చర్య ఖండిస్తూ మోకాళ్ళ మీద కూర్చొని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా దళిత గిరిజనుల మహిళలు బాలికలపై జరుగుతున్న అత్యాచార సంఘటనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.అలాగే రామగిరి మండలం ఏడుగుర్రాల పల్లిలో దళిత మైనర్ బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.తండ్రి చనిపోయి తల్లికి మతిస్థిమితం లేక అనాధగా బతుకుతున్న బాలికపై కామందులు కర్కశంగా ప్రవర్తించారని మండిపడ్డారు.దళిత మహిళ హెూం శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఎస్సీ,ఎస్టీల మహిళలకు బాలికలకు భద్రత కరువైందన్నారు.రెడ్ బుక్ రాజ్యాంగమంటే దళితులపై గ్యాంగ్ రేప్ లు హత్యలు,దాడులు,దౌర్జన్యాలు చేయడమేనా అంటూ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అత్యాచారానికి గురైన కుటుంబానికి అన్ని రకాల న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటూ పోరాడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ,వన్నూరు స్వామి,దావీదు,ఎర్రి స్వామి,రాకెట్ల సూర్య నారాయణ,రామ్మోహన్ తదితరలు పాల్గొన్నారు.

## మిస్సయిన ఐదుగురు చిన్నారులను గంట వ్యవధిలో అప్పగించిన అనంతపురం రూరల్ పోలీసులు



అనంతపురం, **(కదిలించే వార్త) జూన్ 08:** స్థానిక బసవ తారకం కాలనీకి చెందిన లక్ష్మీదేవి తన 9 సంవత్సరాల కూతురు లాస్య కన్పించడం లేదని అనంతపురం రూరల్ పోలీసు స్టేషన్ లో ఈరోజు మధ్యహ్నం ఫిర్యాదు చేసింది. సి.ఐ శేఖర్ వెంటనే స్పందించారు. తన ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. సదరు చిన్నారి కోసం వెదికేందుకు మొదలు పెట్టిన పోలీసులకు మరో నలుగురుమధు,ప్రభు, సుధీర్ , కుట్టీ లు మిస్సయినట్లు గుర్తించారు. వీరందరి కోసం గాలింపు చర్యలు చేపట్టి గంట వ్యవధిలో వెతికి పట్టుకున్నారు. ఈ ఐదుగురు చిన్నారులను వారి తల్లిదండ్రులకు సి.ఐ అప్పగించారు.

## రామోజీరావు జీవితం ఒక స్ఫూర్తిదాయకం

మీడియా రంగాన్ని మలుపు తిప్పిన మహెూన్నత వ్యక్తి ఆయన

పత్రికా రంగానికి ఆయన మరణం తీరని లోటు..ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం అర్బన్, **(కదిలించే వార్త) జూన్ 08:** ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు జీవితం ఒక స్ఫూర్తిదాయకమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. రామోజీరావు మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన వ్యక్తి రామోజీరావు అన్నారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఆయన అంచలంచెలుగా ఎదిగి ఒక సామ్రాజ్యాన్ని సృష్టించారన్నారు. వేలాదిమందికి ఉపాధి కల్పించడమే కాకుండా సమాజంలో అత్యంత బాధ్యతాయుతమైన పత్రికా రంగాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారని అన్నారు. బ్లాక్ అండ్ వైట్ పేపర్ కాలం నుంచి ప్రతి పేజీ కలర్ వచ్చేలా చేశారన్నారు. వివిధ భాషల్లో కూడా ఛానల్లను తీసుకొచ్చారన్నారు. అన్నదాత వంటి సంచికల ద్వారా రైతాంగానికి ఒక దిక్సూచిగా మార్చారన్నారు. దేశంలోనే అత్యద్భుతమైన రామోజీ ఫిలిం సిటీని స్థాపించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారన్నారు. సమాజంలో చెడుపై పోరాడుతూ జీవితమంతా విలువలతో బ్రతికారన్నారు. ఆయన ఎప్పటికీ పత్రికా, వ్యాపార రంగానికి స్ఫూర్తిదాయకంగా ఉంటారని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు.

## హిందీ ప్రచారసభ హైదరాబాద్ 90వ వార్షికోత్సవ కార్యక్రమమును జయప్రదం చేయండి పిలుపునిచ్చిన హిందీ ప్రచారసభ జనరల్ సెక్రటరీ ఎస్. గైబువల్లి, అధ్యక్షుడు ప్రొ?చంద్రదేవ్




హైదరాబాద్,**(కదిలించే వార్త) జూన్ 08:** హిందీ ప్రచారసభ హైదరాబాద్ నకు 90 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా 90వ వార్షికోత్సవ సంపాదకురాలు డా? సుష్మా దేవి, తెలంగాణ హిందీ ప్రచారసభ అధ్యక్షుడు కె. రామచందర్, సెక్రటరీ రాజు, మిలంద్ ప్రకాశన్ అధినేత విభా భారతి, ఆఫీస్ సెక్రటరీ కె. వెంకటేశ్వర్, రిజిస్టార్ నామోవ్ వాగ్మాడె, శివలింగం గౌడ్, మాయపాండే తదితరులు పాల్గొన్నారు. సభను జూన్ 10వ తేదీన మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నాంపల్లిలోని హిందీ ప్రచారసభ హైదరాబాద్ సభాగృహం నందు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, విశిష్ట అతిథులుగా రవాణా మరియు బి.సి. సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐ.టి.ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్స్, ఇండస్ట్రీస్ కామర్స్ మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, డైరక్టర్ సెంట్రల్ హిందీ డైరక్టరేట్, కేంద్రీయ హిందీ సంస్థాన్ ఆగ్రా సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రొ? సునీల్ బాబు రావ్ కులకర్ణి హాజరవుతారని అతిథుల ద్వార హిందీ భాషకు విశేష కృషి చేసిన వారికి విశిష్ట హిందీ సేవా ప్రతిభా పురస్కార్ అవార్డులతో, పాఠశాల స్థాయి, కాలేజీ స్థాయిలలో హిందీ భాషకు సంబంధించి వివిధ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన వారికి ప్రశంసా పత్రం, మెడల్, బహుమతి ప్రదానం చేయబడునని కావున హిందీ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ప్రచారకులు, కేంద్ర వ్యవస్థాపకులు మరియు హిందీ భాషాభిమానులు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని హిందీ ప్రచారసభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి, అధ్యక్షుడు ప్రొ?ఎం చంద్రదేవ్ పిలుపునిచ్చారు. పత్రికా సమావేశంలో హిందీ ప్రచారసభ హైదరాబాద్ పరీక్షా సంచాలకులు ప్రొ? సురేష్ పురీ, కోశాధికారి గిరిధర్ రావు, స్పెషల్ ఆఫీసర్ శృతికాంత్ భారతి, వివరణ్ పత్రికా సహాయకులు.

టీడీపీ ప్రజాప్రతినిధులకు అనంత సూచన

మాపై విమర్శలు మాని.. ఆర్డీటీ కష్టాలు తీర్చండి

రాజకీయాలకు అతీతంగా ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర

వైసీపీ ప్రభుత్వంలో ఆర్డీటీకి ఎలాంటి కష్టం రాలేదు..!

ఏడాదిగానే ఎఫ్సీఆర్ఏ రెన్యూవల్

కాక ఆర్డీటీ సేవలకు అంతరాయం

సమస్య పరిష్కారం అయ్యే వరకు వెనుకాడేది లేదు

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ

తలారి రంగయ్య చేస్తున్న పాదయాత్రకు సంఘీభావం







కళ్యాణదుర్గం,**(కదిలించే వార్త) జూన్ 08:** అమ్మ పెట్టదు.. అడుక్కు తిననివ్వదు అన్నట్లు తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల తీరు ఉందని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ కోసం విమర్శలు చేయడం మాని రాజకీయాలకు అతీతంగా కలిసిరావాలని కోరారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన 'ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర' ఆదివారం శెట్టూరు మండలంలో కొనసాగింది. బచ్చేహళ్లి నుంచి ప్రారంభమై లక్ష్మంపల్లి వద్ద ముగిసింది. పెద్ద ఎత్తున రైతులు ట్రాక్టర్లతో తరలివచ్చి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ ఇక్కడి పేదల జీవితాలతో ముడిపడి ఉన్న సంస్థ అని తెలిపారు. తలారి రంగయ్య చేస్తున్న పాదయాత్ర రాజకీయ లబ్ధి కోసం కాదని స్పష్టం చేశారు. ఈ పాదయాత్రకు అన్ని రాజకీయ పక్షాలు కలిసిరావాలని కోరారు. ఆర్డీటీ సంస్థ ఇబ్బందుల్లో ఉంటే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మాటలకే పరిమితం అవుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ హయాం నుంచే ఆర్డీటీకి ఇబ్బందులు ప్రారంభం అయ్యారని తమపై విమర్శలు చేయడంపై అనంత వెంకటరామిరెడ్డి ధీటుగా బదులిచ్చారు. వైసీపీ హయాంలో ఆర్డీటీకి ఎఫ్సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రెన్యూవల్ విషయంలో ఎన్నడూ ఇబ్బంది కలగలేదని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సమస్య జఠిలమైందన్నారు. ఆర్డీటీ సంస్థ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో అనేక గ్రామాల్లో సేవలు అందిస్తోందని చెప్పారు. 55 ఏళ్లుగా వెనుకబడిన అనంతపురం జిల్లాలో ఆర్డీటీ సేవలు మరువలేనివన్నారు. నిస్వార్థంగా సేవలు అందిస్తున్న ఆర్డీటీకి విదేశీ సంస్థల నుంచి విరాళాలే కీలకమని తెలిపారు. ఎఫ్సీఆర్ఏ రెన్యూవల్‌కు ఆటంకాలు కలగడం వల్ల ఎంతో మంది పేదలకు నష్టం కలుగుతోందన్నారు. ఇప్పటికే ఆర్డీటీ సెట్ నిలిచిపోవడంతో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను చేరువ చేసే కార్యక్రమం నిలిచిపోయిందని తెలిపారు. ఇతర సేవలపై కూడా ప్రభావం పడుతోందని.. రెండు నెలలుగా ఆర్డీటీ కోసం ఆందోళనలు జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మాటలకే పరిమితం అవుతున్నారని విమర్శించారు. ఆర్డీటీ సంస్థ తన సేవలను మొదటగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ప్రారంభించిందని, అందుకే మాజీ ఎంపీ రంగయ్య జూన్ 4వ తేదీన ఈ నియోకజవర్గంలో ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర ప్రారంభించారని స్పష్టం చేశారు. మొదట్లో అధికార పార్టీ నేతలు ఆటంకాలు కలిగించినా ప్రజల మద్దతుతో ఈరోజు నిరాటంకంగా పాదయాత్ర కొనసాగుతోందని చెప్పారు. ఓడిపోయిన పార్టీ ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం ఆర్డీటీని వాడుకుంటోందని అధికార పార్టీ నేతలు తమపై విమర్శలు చేయడం తగదన్నారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాపక్షంగా ఉంటామని స్పష్టం చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు ఉన్నా ఆర్డీటీకి ఎఫ్సీఆర్ఏ రెన్యూవల్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడ్డారు. టీడీపీ ప్రజాప్రతినిధులు, బీజేపీకి చెందిన మంత్రి ఉమ్మడి జిల్లాలో ఉన్నారని.. ఆర్డీటీ సమస్యను చంద్రబాబు, లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పడానికే వాళ్లు పరిమితం అవుతున్నారన్నారు. ఆర్డీటీకి రెన్యూవల్ సమస్య ప్రారంభం అయ్యాక రెండు సార్లు కేంద్ర హెూం మంత్రిని చంద్రబాబు కలిశారని, ప్రధానిని కూడా ఒకసారి కలిశారన్నారు. నారా లోకేష్ కుటుంబ సమేతంగా ప్రధానిని కలిశారని గుర్తు చేశారు. ఇటీవల అమరావతి పనుల పునఃప్రారంభం సమయంలో కూడా రాష్ట్రానికి ప్రధాని వచ్చారని తెలిపారు. ఈ సమయాల్లో అసలు ఆర్డీటీ సమస్యను ఎందుకు చెప్పలేకపోయారని ప్రశ్నించారు. తమపై రాజకీయ విమర్శలు మాని కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఇదే తరుణంలో రాజకీయాలకు అతీతంగా పాదయాత్రలో అందరూ పాల్గొనవచ్చని సూచించారు. జిల్లా ప్రజలకు పోరాటం కొత్త కాదని, ఆర్డీటీ సమస్య పరిష్కారం అయ్యే వరకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు.

## సాక్షి కార్యాలయాన్ని తాకిన తెలుగు మహిళల నిరసన జ్వాల

అమరావతి మహిళలపై వ్యాఖ్యల

మీద సాక్షి ఆఫీస్ వద్ద ఆందోళన

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశాలతో

నిరసన చేపట్టిన తెలుగు మహిళలు

సాక్షి ఆఫీస్ ఎదుట పేపర్లు దహనం చేసిన తెలుగు మహిళలు

కార్యాలయంకి ఉన్న సాక్షి అక్షరాలను తొలగించే ప్రయత్నం

అడ్డుకున్న పోలీసులు.. తెలుగు మహిళల అరెస్ట్

కొమ్మినేని, జర్నలిస్ట్ కృష్ణంరాజు క్షమాపణలు చెప్పాలి..

వారిపై చర్యలు తీసుకోవాలన్న తెలుగు మహిళలు











అనంతపురం అర్బన్, **(కదిలించే వార్త) జూన్ 08:** అమరావతి వేశ్యల రాజధాని అంటూ సాక్షి ఛానల్ డిబేట్లో చేసిన వ్యాఖ్యల మీద అనంతపురంలో తెలుగు మహిళలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి యాజమాని అయిన భారతి రెడ్డితోపాటు ఇలాంటి వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, జర్నలిస్ట్ కృష్ణంరాజులు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి సూచనల మేరకు అర్బన్ నియోజకవర్గానికి చెందిన తెలుగు మహిళలు ఇవాళ సాక్షి కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. సాక్షి ప్రతులను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయానికి ఉన్న సాక్షి అక్షరాలను తొలగించేందుకు ప్రయత్నించారు. ఇంతలో పోలీసులు కలుగజేసుకొని వారిని అడ్డుకున్నారు. తెలుగు మహిళల్ని అక్కడి నుంచి అరెస్టు చేసి నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వప్న, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్వినిలు మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన తల్లుల గురించి ఇంత నీచంగా మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాక్షి ఛానల్ యజమాని భారతి రెడ్డి కూడా ఒక మహిళేనని ఆమెకు కూడా ఇద్దరు బిడ్డలు ఉన్నారని.. మహిళల పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్న వారిని ఎలా ప్రోత్సహిస్తారని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి తన అక్రమ సంపాదనతో సాక్షిని స్థాపించి ఇలా మహిళలపై నీచ వ్యాఖ్యలు చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి మీద కక్షతోనే సాక్షి మొదటి నుంచి వార్తలు రాస్తోందని ఇప్పుడు మరింత బరితెగించి మహిళలను కించపరిచేలా జర్నలిస్టులతో వ్యాఖ్యలు చేయించారన్నారు. యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు, జర్నలిస్టు కృష్ణంరాజుపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటం చాలా ఉధృతంగా ఉంటుందని హెచ్చరించారు. అనంతరం నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ నందు వైయస్ భారతి, కొమ్మినేని శ్రీనివాస్, జర్నలిస్ట్ కృష్ణంరాజులపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు సుమలత, మహేశ్వరి, చరిత, మాధవి, అయేషా, వెంకటలక్ష్మి, వరాలమ్మ, ఫరీద, సరోజమ్మ, సద్దల శకుంతల, పావురాల రమాదేవి, తెలుగుమహిళలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మెదడులో కణితుల కల్లోలం అంతర్జాతీయ బ్రెయిన్ ట్యూమర్ డే

బ్రెయిన్ ట్యూమర్లపై అవగాహన పెంచుకుందాం

డా. సి. అనిల్

కన్సల్టెంట్ న్యూరోసర్జన్

కిమ్స్ సేవీరా, అనంతపురం



అనంతపురం, **(కదిలించే వార్త) జూన్ 08:** ప్రతి సంవత్సరం జూన్ 8న అంతర్జాతీయ మెదడు కణితుల (బ్రెయిన్ ట్యూమర్) దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ దినోత్సవం లక్ష్యం మెదడులోని కణితులపై అవగాహన కల్పించడం, తొందరగా గుర్తించడాన్ని ప్రోత్సహించడం, మరియు బాధితులకు మద్దతుగా నిలవడం. బ్రెయిన్ ట్యూమర్ బాధితులు మరియు వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తు చేస్తూ, మెరుగైన ఫలితాల కోసం సమిష్టిగా చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉంది.

### బ్రెయిన్ ట్యూమర్ అంటే ఏమిటి?

బ్రెయిన్ ట్యూమర్లు అంటే మెదడులో ఏర్పడే అసాధారణ సెల్ పెరుగుదల. ఇవి మాలిగ్నెంట్ (క్యాన్సర్) లేదా బెనైన్ (క్యాన్సర్ కానివి) కావచ్చు. కానీ బెనైన్ ట్యూమర్లు కూడా మెదడులోని సున్నితమైన భాగాలపై ఒత్తిడి తేవడంతో ప్రాణాలకు ముప్పుగా మారవచ్చు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది దాదాపు 3 లక్షల మందిలో కొత్త బ్రెయిన్ మరియు సెంట్రల్ నర్వస్ సిస్టమ్ ట్యూమర్లు గుర్తించబడుతున్నాయి. ఇవి అన్ని వయసులవారిలో, ముఖ్యంగా పిల్లలలో కూడా కనిపించవచ్చు. ముందస్తు గుర్తింపు ఎంతో కీలకం బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలను తొందరగా గుర్తించడం ద్వారా చికిత్స విజయవంతంగా ఉండే అవకాశాలు పెరుగుతాయి. కొన్ని సాధారణ

### లక్షణాలు ఇవే:

తీవ్రమైన తలనొప్పులు, ముఖ్యంగా ఉదయం తీవ్రంగా ఉండటం అసాధారణంగా వాంతులు రావడం, చూపులో సమస్యలు (బ్లర్, డబుల్, లేదా పక్కదిశ చూపు కోల్పోవడం), ఫిట్స్ రావడం, చెయ్యి లేదా కాళ్లలో చలనం కోల్పోవడం, సమతుల్యత లోపించటం, మాటలలో తడబాటు, ప్రవర్తనలో మార్పులు, వినికిలో సమస్యలు, జ్ఞాపకశక్తి లేదా ఆలోచనా సామర్థ్యంలో మార్పులు, ఈ లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా ముందస్తుగా నిర్ధారణ జరుగుతుంది. దీని ద్వారా మనం చికిత్స చేయించుకోవడానికి అవకాశం ఉంటుంది.

### ప్రత్యేక చర్యల పిలుపు:

ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవం సందర్భంగా, మనందరం ఈ క్రింది చర్యల పట్ల చురుగ్గా వ్యవహిద్దాం: అవగాహన పెంచడం: బ్రెయిన్ ట్యూమర్లపై మనం ఇతరులకు సమాచారం అందించడం బాధితులకు మద్దతు: వారిని అర్థం చేసుకొని మానసికంగా, శారీరకంగా ఆదుకోవడం పరిశోధనలకు మద్దతు: కొత్త చికిత్సలు అభివృద్ధి చెందేలా పరిశోధనలకు మద్దతు ఇవ్వడం ఆరోగ్యవంతమైన జీవనశైలి: అన్ని సందర్భాలలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో అవసరం కిమ్స్ సవీరలో న్యూరోసర్జరీ విభాగం కిమ్స్ సవీర హాస్పిటల్‌లో న్యూరోసర్జరీ విభాగం ఆధునిక పరికరాలతో సమీకృతంగా పనిచేస్తోంది. బ్రెయిన్ ట్యూమర్లను గుర్తించేందుకు, అత్యుత్తమ చికిత్స అందించేందుకు న్యూరోసర్జన్, ఆంకాలజిస్టు, న్యూరోరేడియాలజిస్టు కలిసిన మల్టీ–డిసిప్లినరీ టీమ్ ద్వారా సమగ్ర వైద్యం అందిస్తున్నారు.

## సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో గోమాతకు అంతిమ సంస్కారాలు





అనంతపురం అర్బన్, **(కదిలించే వార్త) జూన్ 08:** ప్రస్తుత పరిస్థితుల్లో మనుషులే కాదు నోరులేని జీవాలు కూడా ఆహారం లేకుండా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. బాబా అనుగ్రహంతో వివిధ ప్రాంతాల్లో మనుషులకు ప్రతినిత్యం దాదాపు 18 సంవత్సరాలుగా మూడు పూటలా ఆహారనందిస్తున్నాను కానీ గో వులు ఎన్నో చోట్ల రోడ్లమీద సంచరిస్తున్నాయి. వాటి యజమానులు అవి పాలు ఇచ్చినంత వరకు జాగ్రత్తగా కాపాడుకొని ఆ తర్వాత వదిలేస్తున్నారు. ఇటువంటి గోవులు కొన్ని వందల సంఖ్యలో ప్రతిరోజు మనకు వివిధ ప్రాంతాల్లో దర్శనమిస్తున్నాయి వీటి సంరక్షణ కొన్ని గో శాలను చేస్తున్నప్పటికీ ఇంకా చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా యజమానులు వాటిని సంరక్షించి బాధ్యత తీసుకోవాలనిలేని ఎడల మున్సిపాలిటీ వారు వారి మీద చర్యలు తీసుకోవాలని రోడ్లమీద సంచరించకుండా చూడాలని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ కోరారు. ఈ దినం లక్ష్మీ నగర్ బైపాస్ సమీపంలో ఒక గోవు కొన్ని గాయాలతో బాధపడుతూ మృతి చెందగా స్థానిక సమాచారం మేరకు అక్కడికి చేరుకుని ఆ గోమాతకు పూజలు నిర్వహించి వడి బియ్యం పెట్టి ప్రత్యేకంగా ఒక వాహనాన్ని ఏర్పాటు చేసి అంతిమ సంస్కారాలు పూర్తి చేశామని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ విజయ సాయికుమార్ తెలిపారు. మొదట టుజర్ సహాయం తో గోవును ట్రాక్టర్ లోకి ఎక్కించి రాచాని పల్లి వద్దకల నదిలో జెసిబి సహకారంతో గుంతను తీసి అక్కడే ప్రత్యేక పూజలు నిర్వహించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈరోజు ద్వాదశి ఘడియలు ఉండటంతో భగవంతుడు గోవుకు ఈ విధంగా సేవ చేసే అవకాశం ఇచ్చారని ఈ యొక్క అంతిమ సంస్కారాలు నిర్వహించుటకు మాతృమూర్తి రుక్మని ఆర్థిక సాయం అందించారని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ తెలిపారు. ఇప్పటివరకు సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో 1679 మంది ఆత్మ బంధువులకు 10 గోవులకు 16 వానరాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించామని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ సాయికుమార్ తెలిపారు.

# రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిరచండి




అనంతపురం అర్బన్,(కదిలించే వార్త) జూన్ 08: రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చే విధంగా కార్మిక చట్టాలలో మార్పులు చేసింది, ఆ మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు అనంతపురం జిల్లా కమిటి ఆధ్వర్యంలో గనే నాయక్ భవన్ నందు కార్మిక చట్టాల కార్మిక చట్టాల సవరణ, నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై జులై 9 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా సదస్సు సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ కార్మికులకు వేతనాలు సవరించలేదని, కార్మిక సంక్షేమ బోర్డుకు ఛైర్మన్, కమిటీ సభ్యులను నియమించలేదని, మరోప్రక్క పని గంటలు 8 గంటలను 12 గంటలకు పెంచటం, మహిళా కార్మికులతో పని చేయించుకునేవిధంగా మార్పు చేయటం, ఓవర్ టైమ్‌ను పెంచటం వంటి మార్పులను కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని విమర్శించారు. దీనినిబట్టే ఇది కార్మిక అనుకూల ప్రభుత్వామో, కార్మిక వ్యతిరేక ప్రభుత్వమో అర్థం అవుతుందని విమర్శించారు. ఇప్పటికే మహిళలపై లైంగిక వేధింపులు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, అలాంటిది రాత్రిపూట పనులు చేయిస్తే మహిళలకు రక్షణ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలలో చేసిన మార్పులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకపోతే కార్మికవర్గం వీధిపోరాటాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని విమర్శించారు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, ఎల్ అండ్ టి సీఈవో సుబ్రమణ్యన్‌లు కార్మికుల శ్రమను దోపిడీ చేసి లాభాలు గడించేందుకు మాట్లాడుతున్నారని, దానిని నిజం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెస్తున్న లేబర్ కోడ్స్‌కు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలలో మార్పులు చేసిందని అన్నారు. వెంటనే మార్పు చేసిన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని, కార్మికవర్గం కన్నెర్ర చేస్తే ప్రభుత్వం పతనం తప్పదని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్మిక అనుకూల విధానాలు తెస్తామని చెప్పి ఇప్పుడు పెట్టుబడిదారులకు అనుకూల విధనాలు అనుసరిస్తున్నారని, కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనం కూడా సాధించలేదని అన్నారు. శ్రామిక మహిళా కన్వీనర్ రమాదేవి మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో మహిళలపై హత్యలు, అత్యాచారాలు ఎక్కువయ్యాయని, ఇప్పుడు రాత్రిపూట మహిళా కార్మికులతో పని చేయించటం అంటే వారికి మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా చేయటమేనన్నారు. వెంటనే కార్మిక చట్టాలలో మార్పులు ఉపసంహరించుకోకపోతే మహిళలు ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుందని అన్నారు రాష్ట్రవ్యాపితంగా మహిళలు పని చేసే చోట లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాల్సి ఉందని, ఇప్పటికీ ఆ కమిటీలు ఎక్కడ వేశారో ప్రభుత్వ పరిశీలన కూడా లేదని అన్నారు. అలాంటిది ఇప్పుడు ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా మహిళలను రాత్రులు పని చేయించటం ఏమిటని, వెంటనే కార్మిక చట్టాలలో చేసిన మార్పులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి గోపాల్ అనంతపురం నగర అధ్యక్ష కార్యదర్శులు వెంకట్ నారాయణ, ముత్తుజ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మన్నెల రామాంజనేయులు, అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు శకుంతల, నిర్మల, మేరీ గోవిందమ్మ, లక్ష్మీ నరసమ్మ,పాతక్క రామాంజనమ్మ మెడికల్ రేప్ సీన్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, త్రాగునీటి కార్మికులు రాము, అశోక్ సంజప్ప,మున్సిపల్ యూనియన్ నాయకులు బత్తల ఆది, ఎర్రి స్వామి,తిరుమలష్, ఆటో యూనియన్ నాయకులు ఆది,ఆశా కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నారాయణ నమః శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి

### నిత్య అన్న ప్రసాద వితరణకు

### 25 వేల రూపాయలు విరాళం ఇచ్చిన భానుమతి



కసాపురం,(కదిలించే వార్త) జూన్ 08: కసాపురం ఓం నమో: శ్రీ లక్ష్మీ నారాయణ నమః శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి నిత్య అన్న ప్రసాద వితరణకు 25 వేల రూపాయలు విరాళం ఇచ్చిన భానుమతి ఈరోజు లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం లో పట్టణానికి చెందిన 70 సం. వృద్ధురాళ్లు భానుమతి 25 వేల రూపాయలు నగదు అన్న ప్రసాద వితరణకు ఆలయ ధర్మకర్తలు తలారి పరశురాముడు శకుంతల అమ్మకు ఇవ్వడం జరిగింది అనంతరం వారికి శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం స్వామివారిపట్టు వస్త్రము తో సన్మానించి తీర్థ ప్రసాదాలు ఇవ్వడం జరిగినది మరియు



పట్టణానికి చెందిన ప్రభావతి ఆమె పుట్టినరోజు

వీరి కూతురు భాను%ఁ

% తేజ్ కుమార్ పెళ్లిరోజు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నిత్య అన్న ప్రసాద వితరణకు 5116 రూపాయలు తమ వంతు విరాళంగా ఇవ్వడం జరిగింది సన్మానించడం స్వామివారి తీర్థప్రసాదాలు ఇవ్వడం జరిగినది

భానుమతి మాట్లాడుతూ నేను శ్రీ లక్ష్మీనారాయణ స్వామిని దర్శించడం గత కొన్ని సంవత్సరాలుగా పొదుపు చేసిన నగదును స్వామివారి సేవకులు ఇవ్వాలని నా జన్మ ధన్యమవుతుందని నాకు నా కుటుంబానికి స్వామి అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని ప్రతి ఒక్కరూ ఆలయంలో నిత్య అన్నదానంలో భాగస్వామి కావాలని కోరుచున్నాను ఇంత పెద్ద దేవాలయం ఒక వ్యక్తి కుటుంబం జరిపేది కాదని ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి నగదు ధాన్యాన్ని సహాయ సహకారాలు అందించాలన్నారు మనం భూమి మీదికి వచ్చేటప్పుడు ఏమి తీసుకొని రాలేదు మనము ఎంత సంపాదించినా మన వెనక ఏమీ రాదని ఉన్నదానిలో కొంతైనా దైవ సేవ చెయ్యండి అది మన కుటుంబం పిల్లలకు మంచి జరుగుతుందని దైవ సేవకు100 పెడితే 1000 రూపాయలు మనకు దేవుడు ఇస్తాడని అన్నారు మనం ఎంత సంపాదించిన ఎప్పుడో ఒకరోజు దొంగల చేతుకు



వెళితే మనం ఆరోజు బాధపడి మా కర్మ అనుకుంటాం కాకుండా ఉన్నప్పుడే దైవ పుణ్య సేవలు చేయండి భానుతేజ్ కుమార్ మాట్లాడుతూ ఎంతో సంతోషంగా ఉందని స్వామి అమ్మవార్ల దర్శనం ఎత్తి అన్న ప్రసాద వితరణలో మా చేతులు మీదుగా అన్న ప్రసాదం భక్తులకు వడ్డించడం ఎప్పుడు మర్చిపోలేని ఏ దేవస్థానానికి వెళ్లిన ఇలాంటి అనుభూతి మాకు కలగలేదని ఇట్లాంటి హ్యాపీనెస్ స్వీట్ మెమోరీస్ మాకు గుర్తుంటాయని ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కరూ మీ పిల్లల పుట్టినరోజు పెళ్లిరోజులు తల్లిదండ్రుల షష్టిపూర్తి ఏదైనా శుభకార్యాలు ఇక్కడ జరుపుకోవడం మంచిదన్నారు తలారి పరశు రాముడు మాట్లాడుతూ భక్తులు స్వామి అమ్మవారి సేవకు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందని ప్రతి రోజు ఎంతోమంది భక్తులు స్వామి అమ్మవారి దివ్య ఆశీస్సులు పొంది కోరిన కోరికలు తీర్చుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు ఈ కార్యక్రమంలో రాకేష్ స్వామి ఝాన్సీ శ్రీ కనక రత్న స్వాత్విక శశివర్ధన్ శివరత్న మురళి తరుణ్ వెంకటేష్ మల్లికార్జున స్వామి మరియు భక్తులు పాల్గొనడం జరిగినది

## మీ ఇళ్లలో మహిళలు లేరా..?

# ఏంటి ఈ సంస్కార హీనమైన మాటలు



### అమరావతి మహిళలకు జగన్ రెడ్డి, భారతి రెడ్డిలు క్షమాపణ చెప్పాలి

### ఆ జర్నలిస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలన్న ఎమ్మెల్యే పరిటాల సునీత

### రామగిరి మండలంలో అత్యాచారానికి గురైన బాలికకు ఎమ్మెల్యే సునీత పరామర్శ

### ధర్మవరంలో మహిళలపై అఘాయిత్యాలను అడ్డుకున్న వ్యక్తి పరిటాల రవి

### మీ ఇంట్లో మహిళల్ని అయితే ఇలా రోడ్డుకు లాగుతావా ప్రకాష్ రెడ్డి

రాప్తాడు నియోజకవర్గం, (కదిలించే వార్త) జూన్ 08: సాక్షి ఛానల్ డిబేట్ లో జర్నలిస్టుల ముసుగులో ఉన్న సంస్కారహీనులు చేసిన వ్యాఖ్యలకు జగన్ రెడ్డి, భారతి రెడ్డిలు క్షమాపణ చెప్పాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత డిమాండ్ చేశారు. గత శనివారం రోజు సాక్షి ఛానల్ డిబేట్ లో రాజధాని అమరావతిపై జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవతల రాజధానిగా ఉన్న అమరావతిపై ఏవరూ కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయరని చెప్పారు. గతంలో తమ భూముల్ని ఇచ్చి త్యాగం చేసిన గొప్ప మనుసున్న వారు అక్కడి మహిళలన్నారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి రాజధానిలో విధ్వంసం సృష్టిస్తుంటే... అమరావతి ప్రాంత మహిళలు 1630 రోజులు ఉద్యమం చేశారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు దేవతల రాజధాని అంటే.. కృష్ణంరాజు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఖండించాల్సిన కొమ్మినేని శ్రీనివాసరావు కనీస విజ్ఞత లేకుండా నవ్వుతున్నారన్నారు. మహిళలపై ఇంత నీచంగా మాట్లాడితే చర్యలు తీసుకోవడంలో ఆలస్యం ఎందుకని ప్రశ్నించారు. కొమ్మినేని, కృష్ణంరాజు ఇళ్లల్లో ఆడవాళ్లు ఉంటారనే విషయాన్ని వారు మరచిపోయారా అని నిలదీశారు. వెంటనే వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుంభకోణాలపై ప్రజాదృష్టి మళ్లించడానికే అమరావతిపై ఈ దుర్మార్గపు దాడి చేయించారని సునీత అన్నారు.

### ప్రకాష్ రెడ్డి మీ ఇంట్లో మహిళల్ని అయితే ఇలాగే రోడ్డుకు లాగుతారా...?

రామగిరి మండలంలో ఒక మైనర్ బాలికపై అఘాయిత్యం జరిగితే.. ఆ విషయాన్ని రోడ్డుకెక్కేలా చేస్తున్నారని ఎమ్మెల్యే సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత బాలికకు ఫోన్ లో పరామర్శించి.. ధైర్యం చెప్పారు. బాధిత బాలిక తల్లితో కూడా ఎమ్మెల్యే సునీత మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ బిడ్డకు జరిగిన సంఘటన అత్యంత బాధాకరమన్నారు. వెనుకబాటు తనం, సరైన పర్యవేక్షణ లేకపోవడం.. బాలిక అమాయకత్వం వంటి అంశాలను ఆసరాగా చేసుకున్న కొందరు దుర్మార్గులు చేసిన సంఘటన ఇది అన్నారు. అయితే ఆ విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తూ.. పార్టీలకు ఆపాదిస్తూ ప్రకాష్ రెడ్డితో పాటు వైసీపీ నాయకులు రాక్షసానందం పొందుతున్నారన్నారు. బాలిక ఎవరు.. సంఘటన ఎలా జరిగిందన్నది పదే పదే మీడియా ముందు ప్రస్తావిస్తూ రాజకీయం చేస్తున్నారన్నారు. పైగా దళిత ఎమ్మెల్యేలు ఎందుకు స్పందించడం లేదంటూ కులాలను కూడా లాగే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఈ దుర్మార్గానికి పాల్పడిన వారిని అరెస్టులు చేస్తున్నారని.. ఇందులో వైసీపీ వారు కూడా ఉన్నారని దానికి ప్రకాష్ రెడ్డి ఏం సమాధానం చెబుతారన్నారు. అదే మీ ఇళ్లలో అమ్మాయిలకు ఇలా జరిగితే.. ఇంత బహిరంగంగా మాట్లాడుతారా అంటూ నిలదీశారు. ఆ రోజుల్లో ధర్మవరంలో మహిళలు ఒక భయానక పరిస్థితుల్లో ఉంటే.. ధైర్యంగా నిలబడింది పరిటాల కుటుంబమని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ఈ బాలిక విషయాన్ని ప్రభుత్వం, పోలీసులు చాలా సీరియస్ గా తీసుకున్నారని వివరించారు. బాలికకు ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా అండగా ఉంటామని.. దోషులను కఠినంగా శిక్షిస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు నీచ రాజకీయాలు మాని.. ఆబాలికకు అండగా నిలబడాలని.. అందరం ఆ కుటుంబానికి ధైర్యం చెప్పాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సునీత అన్నారు.

## ఇది మామూలు 'మ్యాటర్' కాదు..
# ఆ ఈవీ బైక్‌పై అదిరే ఎక్స్ఛేంజ్ ఆఫర్



దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల డిమాండ్ అమాంతం పెరిగింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు ఈవీ స్కూటర్లను వాడేందుకు ముందుకు రావడంతో అమ్మకాలు మరింత పెరిగాయి. అయితే ఇటీవల కాలంలో ఈవీ బైక్‌లను కూడా మార్కెట్లో రిలీజ్ చేస్తున్నారు. ప్రముఖ ఈవీ స్టార్టప్ కంపెనీ మ్యాటర్ తన ఈవీ బైక్ అదిరే ఎక్స్ఛేంజ్ ఆఫర్‌ను ప్రకటించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారతీయ ఎలక్ట్రిక్ వాహన స్టార్టప్, మ్యాటర్ తన తొలి ఉత్పత్తి ఏరాపై అద్భుత ప్రయోజనాలను ప్రకటించింది. మ్యాటర్ ఏరా ఈవీ బైక్ 5000, 5000ం అనే రెండు వేరియంట్లలో లభిస్తుంది. వీటి ధర రూ.1.74 లక్షలు, రూ.1.84 లక్షలుగా ఉన్నాయి. 'మిషన్ ఎక్స్ఛేంజ్ అంటే స్మోక్ టు క్లీన్ ఫ్యూచర్, ఫ్యూయల్ టు ఛార్జ్' పథకం కింద కస్టమర్లు తమ ప్రస్తుత పెట్రోల్ 2 వీలర్ లేదా 4 వీలర్‌కు ఎక్స్ఛేంజ్ విలువను క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా లేదా సందర్శించడం ద్వారా తక్షణమే తనిఖీ చేయవచ్చని ద్విచక్ర వాహన తయారీదారు పేర్కొన్నారు. అదనంగా మ్యాటర్ 5000పై అదనపు ఎక్స్ఛేంజ్ బోనస్‌తో పాటు రూ.10,000 విలువైన బీమా, రిజిస్ట్రేషన్ ప్రయోజనాలను కూడా అందిస్తోంది. మిషన్ ఎక్స్ఛేంజ్ పథకంతో ద్వారా భారతదేశంలో పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సాయం చేయడమే లక్ష్యమని మ్యాటర్ వ్యవస్థాపకుడు, సీఈఓ మోహల్ లాల్భాయ్ పేర్కొన్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో కంపెనీ తన ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్కు జీవితకాల బ్యాటరీ వారంటీని ప్రవేశ పెట్టింది. మ్యాటర్ ఏరా ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ సెగ్మెంట్‌కు మాన్యువల్ గేర్‌బాక్స్‌ను పరిచయం చేసింది. ఇందులో ఎకో, సిటీ మరియు స్పోర్ట్ అనే మూడు రైడింగ్ మోడ్లతో యాడ్ చేయబడిన 4-స్పీడ్ ట్రాన్స్మిషన్ ఉంటుంది. ఈ సెటప్ వైవిధ్యమైన రైడ్ కాంబినేషన్లను అనుమతిస్తుంది. సాధారణంగా సాంప్రదాయ ఈవీలు అందించే దానికంటే ఎక్కువ డైనమిక్ అనుభవాన్ని కోరుకునే రైడర్లను ఆకర్షించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఏరా బైక్‌లు లిక్విడ్-కూల్డ్ పవర్ ట్రెయిన్‌తో వస్తాయి. అందువల్ల వేడి పరిస్థితులలో మోటారు మరియు బ్యాటరీ పనితీరును కొనసాగించడానికి అనుమతిస్తుంది. ఏరా 5 కేడబ్ల్యూహెచ్, ఐపీ67-రేటెడ్ బ్యాటరీతో కూడా వస్తుంది. ఇది ఒకే ఛార్జ్ పై 172 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇస్తుంది. ఈ బైక్ 2.8 సెకన్లలోపు 0 నుండి 40 కి.మీ వేగాన్ని అందుకుంటుంది. మ్యాటర్ ఏరాలో నావిగేషన్, మీడియా, కాల్స్, ఓవర్-ది-ఎయిర్ అప్‌డేట్స్‌కు మద్దతు ఇచ్చే ఏడు అంగుళాల టచ్ స్క్రీన్ డ్యాష్ బోర్డ్ ఉంది. ఈ బైక్లో హెరిమ్ ఛార్జింగ్ కోసం 5 ఎంపీ సాకెట్లకు అనుకూలమైన స్టాండర్డ్ ఆఫ్బోర్డ్ ఛార్జర్ కూడా ఉంది. రియల్ టైమ్ డేటా యాక్సెస్, రిమోట్ లాకింగ్, జియో-ఫెన్సింగ్, మెయిటెనెన్స్ అలెర్ట్‌ను అందించే మొబైల్ యాప్ ఈ బైక్ ప్రత్యేకతలుగా ఉన్నాయి.

## వావ్.. ఉద్యోగం పోగొట్టుకున్న తర్వాత కూడా ప్రభుత్వం జీతం చెల్లిస్తుంది!




ప్రపంచంలోని అత్యంత సంతోషకరమైన దేశాలలో ఒకటిగా పరిగణిస్తారు. దీనికి ప్రధాన కారణం దాని సామాజిక భద్రతా వ్యవస్థ. ప్రభుత్వం దాని పౌరుల అవసరాలను పూర్తిగా చూసుకుంటుంది. అది ఆరోగ్యం, విద్య లేదా నిరుద్యోగం కావచ్చు. దీని కారణంగా ప్రజలు మానసిక ఒత్తిడి లేకుండా ముందుకు.. ప్రపంచంలోని అనేక దేశాల విధానాలు వారి పౌరులకు చాలా ప్రయోజనకరంగా ఉన్నాయి. నార్వేలో అలాంటి ఒక ప్రత్యేకమైన వ్యవస్థ అమలు అవుతోంది. ఒక వ్యక్తి తన ఉద్యోగాన్ని కోల్పోతే, అతను ఖాళీగా కూర్చోవలసిన అవసరం లేదు. నార్వే ప్రభుత్వం అటువంటి నిరుద్యోగులకు ఆర్థిక సహాయం అందిస్తుంది. తద్వారా వారు ఎటువంటి ఒత్తిడి లేకుండా వారి తదుపరి ఉద్యోగాన్ని వెతుక్కోవచ్చు.

**ఉద్యోగం పోయినా ఆదాయం వస్తుంది:**

నివేదికల ప్రకారం.. నార్వేజియన్ ప్రభుత్వం తన పౌరులకు 'నిరుద్యోగ భత్యం', అంటే నిరుద్యోగ భృతిని అందిస్తుంది. దీని అర్థం ఒక వ్యక్తి తన ఉద్యోగాన్ని కోల్పోతే వారు ప్రతి నెలా ప్రభుత్వం నుండి నిర్ణీత మొత్తంలో డబ్బును అందుకుంటూనే ఉంటారు. ఆ వ్యక్తికి మరొక ఉద్యోగం దొరికే వరకు లేదా ఒక నిర్దిష్ట కాలపరిమితి పూర్తయ్యే వరకు ప్రభుత్వం ఈ సహాయం అందిస్తుంది.

**ఎంత జీతం వస్తుంది?**

ఈ పథకం కింద నిరుద్యోగికి అతని మునుపటి జీతం ఆధారంగా 62.4% వరకు మొత్తం లభిస్తుంది. అంటే, మీరు మీ మునుపటి ఉద్యోగంలో రూ. లక్ష పొందుతూ ఉంటే నిరుద్యోగంలో కూడా మీరు ప్రభుత్వం నుండి దాదాపు రూ. 62,000 పొందవచ్చు. అయితే, దీనికి కొన్ని షరతులు ఉన్నాయి.

**పరిస్థితులు ఏమిటి?**

ఆ వ్యక్తి గత 12 నెలల్లో కనీసం స్థిర ఆదాయాన్ని సంపాదించి ఉండాలి. అతను తన స్వంత ఇష్టానుసారం తన ఉద్యోగాన్ని వదిలి వెళ్ళకూడదు. ఆ వ్యక్తి నిరంతరం కొత్త ఉద్యోగం కోసం వెతుకుతూ ఉండాలి. ఈ ప్రయోజనం ఎంతకాలం అందుబాటులో ఉంటుంది? నార్వే ప్రభుత్వం ఈ ప్రయోజనాన్ని 2 సంవత్సరాల పాటు అందిస్తుంది. కానీ అది ఆ వ్యక్తి ఉద్యోగం కోల్పోయే ముందు ఎంత కాలం, ఎంత ఆదాయం సంపాదించాడనే దానిపై ఆధారపడి ఉంటుంది. అలాగే, నిరుద్యోగ భృతి పొందుతున్న వ్యక్తి కొత్త ఉద్యోగం కోసం నిజంగా ప్రయత్నిస్తున్నారని నిరూపించడానికి ఉద్యోగ కోసం వెతుకున్న ఆధారాలు, ఇంటర్వ్యూల గురించి సమాచారాన్ని కాలానుగుణంగా అందించాల్సి ఉంటుంది.

**నార్వేజియన్ వ్యవస్థ ఎందుకు ప్రత్యేకమైనది?**

నార్వే ప్రపంచంలోని అత్యంత సంతోషకరమైన దేశాలలో ఒకటిగా పరిగణిస్తారు. దీనికి ప్రధాన కారణం దాని సామాజిక భద్రతా వ్యవస్థ. ప్రభుత్వం దాని పౌరుల అవసరాలను పూర్తిగా చూసుకుంటుంది. అది ఆరోగ్యం, విద్య లేదా నిరుద్యోగం కావచ్చు. దీని కారణంగా ప్రజలు మానసిక ఒత్తిడి లేకుండా ముందుకు సాగడానికి ప్రయత్నిస్తారు. అలాగే వ్యవస్థపై వారి నమ్మకం చెక్కుచెదరకుండా ఉంటుంది.

## రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు
# మెరుగైన వైద్య సేవలు అందించాలి
### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్



అనంతపురం, (కదిలించే వార్త) జూన్ 08: రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. ఆదివారం రాత్రి అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఆప్తో వార్డు, సర్జరీ వార్డులో గార్లదిన్నె మండలం తిమ్మంపేట గ్రామం సమీపంలో శనివారం రాత్రి లారీ, బొలెరో వాహనం ఢీకొని గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులు, వారి కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు అండగా ఉంటామని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, ఆప్తో హెచ్.ఓ.డి డా.ఆత్మరాం, ఆర్ఎంఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు మీడియా రంగంలో రామోజీరావు ఒక శిఖరం

### తెలుగు రాష్ట్రాలపై ఆయన ప్రభావం ఎప్పటికీ ఉంటుంది

### రామోజీరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత



రాప్తాడు నియోజకవర్గం, (కదిలించే వార్త) జూన్ 08: తెలుగు మీడియా రంగంలో ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు గారు ఒక శిఖరం లాంటి వ్యక్తి అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామోజీరావు గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో రామోజీరావు గారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రామోజీరావు గారి మరణం పత్రికా రంగానికి తీరని లోటు అన్నారు. విలువలతో కూడిన జర్నలిజానికి నిలువెత్తు రూపం రామోజీరావు గారు అన్నారు. ఆయన ప్రభావం తెలుగు రాష్ట్రాల పై ఎప్పటికీ ఉంటుందన్నారు. తమ కుటుంబానికి ఆయనతో ఎంతో అవినాభావ సంబంధం ఉందని.. ఆయన మరణం మాకు ఎప్పటికీ లోటుగానే ఉంటుందని ఎమ్మెల్యే సునీత అన్నారు...

# పల్లకిలో పెళ్లికూతురు



నాకు ఎనిమిదేళ్లు ఉన్నప్పుడు ఒకేసారి మా దగ్గరి బంధువుల పెళ్లిళ్లు రెండు వచ్చాయి. అయితే.. రాయపర్తి పెళ్లి సందర్భంగా.. అమ్మ సందూక పోవడం, మళ్లీ దొరకడం గురించి చెప్పుకొన్నాం కదా! ఇప్పుడు మా మేనత్త కూతురి పెళ్లి ముచ్చట్లు.. మేం రాయపర్తి నుంచి వచ్చేసరికే ఇక్కడ ఇందిర వదిన పెళ్లి పనులు మొదలయ్యాయి. ఆడబిడ్డ కూతురి పెళ్లి కదా! మా అమ్మ కొంగు నడుముకు చుట్టి.. వెంటనే పెళ్లి పనుల్లో దిగింది. నాన్న అప్పటికే పూర్తి బిజీగా ఉన్నాడు. అత్తయ్య వాళ్లది బెంగుళూరు టైల్స్ ఇల్లే! అయినా అందంగా ఉండేది. ఇంటి ముందే పందిరి. ఓ పక్క జాజి తీగె, మరోపక్క మల్లె తీగె పాకి.. గుత్తులు గుత్తులుగా పూలుపూసి అందంగా ఉండేది. వదిన పెళ్లికోసం నాన్నే దగ్గరుండి తాటికమ్మలు కొట్టించి.. వాకిలంతా పందిళ్లు వేయించాడు. ఇంటి వెనుకకూడా మొత్తం పందిళ్లే వేసి.. కంది పొరకతో చుట్టూ గోడల్లాగా కట్టారు. వంటలకు వేరే దళ్లు కట్టించారు. వాగులోంచి ఇసుక తెప్పించి ఆ పందిళ్ల కిందే ఓ మూలగా పరిచి.. దాంట్లో వడ్ల గింజలు చల్లారు. రోజూ నీళ్లు చిలకరించడంతో ఆకుపచ్చని వరి మొలకలు వచ్చి.. అక్కడంతా చిన్న వరిచేనులాగా ఉండేది. ఆ ఇసుకలో పొడవునా పెద్ద మట్టికుండలు కొత్తవి తెప్పించి.. అందులో మంచినీళ్లు పోసి, పైన మట్టి కంచుళ్లు (మూతలు) పెట్టారు. అందులో నీళ్లు చల్లగా, తియ్యగా ఉండేవి. ఆ నీళ్లు తాగితే.. మళ్లీ దాహమే వేసేది కాదెందుకో!? ఆ నీళ్లలో ఎవరూ చేతులు పెట్టకుండా ఓ పొడవాటి అల్యూమినియం గంటెతో పోసుకునే ఏర్పాటు ఉండేది. మేము ఎవరమైనా వాటి దగ్గరగా వెళ్లామో.. “ఏయ్ పిల్లగాండ్లూ! ఆ నీళ్లల్ల చేతులు పెట్టి పాడు చెయ్యకుండి” అంటూ వంటచేసే అమ్మగారు పరిగెత్తుకొచ్చేది. విడిదింటికి పెళ్లివాళ్లు రాగానే.. ఆ నీళ్లతోనే నిమ్మకాయలతో షర్బత్ చేసి ఇచ్చారు. ఆ షర్బత్ రుచికి.. అబ్బో! ఇప్పటి ఏ కూల్ డ్రింకూ సరిపోదు.

ఇక ఒకాయన నాలుగు రోజుల ముందే గులాబీ, పసుపు, లేత నీలం, తెలుపు, ఎరుపు, లేత ఆకుపచ్చ రంగు కాగితాలు తెచ్చి ఓ పెద్ద కత్తెరతో అందమైన డిజైన్లు కట్ చేసేవాడు. గోధుమపిండి ఉడకపెట్టి చేసిన లైతో.. దూలాలకూ, వాసాలకూ, చేరేడులకూ (గుమ్మాలకు) అతికించేవాడు. ఆయన కత్తెరను చకచకా తిప్పుతూ హంసలూ, నెమళ్లూ, ఏనుగులూ, ఆకులూ, పువ్వులూ.. ఇలా రకరకాల డిజైన్లు కత్తిరిస్తుంటే, మా క్రాఫ్ట్ సారు కంటే ఈయనే పెద్ద ఆర్టిస్టు అనిపించేది. పిల్లలమంతా ఆయన చుట్టూ కూర్చొని ఏది తెమ్మంటే అది తెచ్చిస్తూ ఉండేవాళ్లం. ఆ పెళ్లిలో ఒక సంఘటన నాకు బాగా గుర్తుంది. పల్లకీకి రకరకాల పూసల హారాలు వేలాడదీసి అందంగా తయారుచేశారు. పెళ్లి అయ్యాక పెళ్లికొడుకు అలిగి విడిదింటికి వెళ్లాడని చెప్పారు. మా వదినను ఫొటోలో గోదాదేవిలా బాగా తయారుచేసి, ఆ పల్లకిలో కూర్చోబెట్టి మోస్తూ తీసుకెళ్లారు. బోలెడు మంది ఆడవాళ్లు, మగవాళ్లు ఊరేగింపుగా బయల్దేరి విడిదింటికి వెళ్లారు. బ్యాండు వాళ్లు దసరా బుల్లోడు పాటలు వాయిస్తుంటే.. పిల్లలమంతా ఆ గుంపులోనే ఎలాగూ ఉంటాం కదా! అక్కడికి వెళ్లాక పెద్దవాళ్లు ఏవో జోకులు వేసుకుని నవ్వుకున్నారు. పెళ్లికొడుకు లేచి మాతోబాటు వచ్చేయబోతుంటే.. వాళ్ల వాళ్లంతా “లేదు.. లేదు.. అమ్మాయి ఒక పాట పాడాల్సిందే! అందాక లేచేదే లేదు” అన్నారు. ఇక పెళ్లికూతుర్ని కూచోబెట్టి అందరూ చుట్టూ చేరారు. “పాడు పాడు” అంటుంటే ఏం పాడుతుంది పాపం!

అయితే.. కావాలనే పాడిందో, ఆ టైంకి ఏమీ గుర్తురాలేదో గానీ.. అందర్నీ ఆశ్చర్యపరుస్తూ ఓ పాటైతే పాడింది. “చీకటిలో.. కారు చీకటిలో.. కాలమనే కడలిలో.. శోకమనే పడవలో.. ఏ దరికో.. ఏ దెసకో..” అంటూ సాగిందా పాట. విన్నవాళ్లంతా ఏమనాలో తెలియక.. అలాగే చూస్తుండిపోయారు. పెళ్లికొడుకు నవ్వుతూ చూస్తుంటే వాళ్ల వాళ్లెవరో.. “ఉంకో పాట పాడమ్మా! పెండ్లి కదా.. అటువంటి పాటలు పాడొద్దు. కొంచెం సంతోషపడే పాటపాడితే బాగుంటది” అన్నారు. దాంతో వదిన గొంతు సవరించుకుని.. “రాజశేఖరా నీపై మోజు తీరలేదురా! రాజసాన ఏలరా!” అని పాడగానే అందరూ ముసిముసి నవ్వులు నవ్వుతూ మురిసిపోయారు. తరువాత మళ్లీ అందరూ పెళ్లికొడుకునూ, పెళ్లికూతురునూ పల్లకిలో కూర్చోబెట్టి ఊరేగింపుతో పెళ్లింటికి తీసుకొచ్చాక భోజనాలు చేశారు. సాయంత్రం అప్పగింతలయ్యాక.. వదిన వెళ్లిపోతుంటే ఆడవాళ్లంతా బాగా ఏడ్చారు. ప్రతివాళ్లూ పెళ్లి కూతురు దగ్గరికి రావడం, ఆమెను కౌగలించుకుని.. “అత్తగారింటికి పోతున్నవా బిడ్డా!” అని ముక్కులు చీదుకుంటూ, కొంగుతో కళ్లు తుడుచుకుంటూ బిగ్గరగా ఏడవడం, పెళ్లి కూతురు కూడా వాళ్లతోబాటు ఏడవడం, ఇదంతా పెళ్లికొడుకు బిత్తరపోయి చూడటం. ఇప్పట్లా వధూవరులు పెళ్లిలోనే మాట్లాడుకోవడం అప్పుడుండేది కాదేమో మరి.. ఆయన కూడా పెళ్లికూతుర్ని ఊరుకుంచే ప్రయత్నమేదీ చేసినట్టు కనిపించలేదు. ఏదో విధంగా పెళ్లి కూతురు తనంత తానే దుఃఖాన్ని ఆపుకొని కొంచెం తేరుకునేసరికి.. పక్కింటి వాళ్లో, పాలు పోసేవాళ్లో, పిండిగిర్నీ వాళ్లో, కిరాణా కొట్టు వాళ్లో ఎవరో ఒకరు వచ్చి.. “పోతున్నవా తల్లీ!” అని మళ్లీ ఏడిపించడం.. పెళ్లి కూతురు ఏడ్చేసరికి “ఊకో అమ్మా.. ఆడిపుటుక పుట్టినాక తప్పుతదా! అత్తగారింటికి పోవలసిందే! ఇగ నీ చిన్నప్పటి ఆటలు, పాటలు అన్నీ బంద్. గా వాళ్లు ఎట్ల జెబితే గట్ల ఇనాలె!” అంటూ మళ్లీ రెచ్చగొట్టి ఏడిపించేది. మొత్తానికి పెళ్లి బృందం బస్సు ఎక్కి వెళ్లిపోయేటప్పుడు బ్యాండ్ వాళ్లు దసరా బుల్లోడులోని ‘చేతిలో చెయ్యేసి చెప్పు బావా!’ పాట పాడటం మాత్రం మర్చిపోలేదు.

# సొమ్ముల పెట్టె దొరికెరా..



నేను ఎనిమిదేళ్ల పిల్లగా ఉన్నప్పుడు మా కజిన్ పెళ్లికోసం రాయపర్తి వెళ్లాం. ఆ ప్రయాణంలోమా అమ్మ సందూక మిస్ అయ్యింది. బస్సు దిగేటప్పుడు అమ్మ బ్యాగు పట్టుకుని దిగితే.. పైనున్న పెట్టెను నర్సి తీసుకొచ్చాడట. ఇంటికి వచ్చాక తెలిసింది.. అది మనది కాదని. ఇక అందరూ నర్సిని.. “ఏంది పిలగా! గది తెల్వలేదా?! పదహారేండ్ల పిలగానివి. ఎందుకొచ్చినట్టు? పెట్టె సరిగ్గ దింపుకోవద్దా? గిప్పుడు చూడు, అండ్ల ఉన్నవి ఎవరు తెచ్చిస్తరు? నువ్వు తెస్తవా?” అని నేరం అతనిదేనని నిర్ధారించారు. “వాడెవడో వానిపెట్టె మీరు దింపుకోని ఇటు రాంగనే.. వాడుకూడా మజ్జల ఎక్కడ్నో దిగిపోతె అయిపాయె! మీరు ఎతికినా వాణ్ని ఎక్కడ దొరుకబడ్తరు?!” అని మరో అపశకున పక్షి అనడం.. ఇలా ఎవరికి తోచింది వాళ్లు మొదలుపెట్టారు. దాంతో అమ్మకు బాగా ఏడుపు వచ్చింది. ఆ పెట్టెలోనే అమ్మ పట్టుచీరలు, మా కొత్త బట్టలతోబాటు నగలన్నీ ఉన్నాయి మరి. అంత నిస్సహాయతలోనూ.. “నర్సిగాడినేం అనకండి. వాణి తప్పేమున్నది. నేనే చూసుకుంటే అయిపోయేది” అన్నది. మా అత్తమ్మ వచ్చి కూడా ఏం చేయాలో ఏం చెప్పాలో తోచక.. “ఏం కాదులేవే శకుంతలా! నా బట్టలు కట్టుకుందువు. నువ్వు ముందుగాల మొహం కడుక్కోని చాయ్ తాగు” అన్నది. అక్కడున్న వాళ్లందరికీ మంచి టాపిక్ దొరికినట్టయి.. తమ తెలివితేటలతో రకరకాల ఊహాగానాలు చేసి చక్కటి స్క్రీన్‌ప్లేతో వివరించడం, చర్చించడం చేశారు. కాసేపటికి పెళ్లి కూతురు తండ్రి భద్రాద్రి మామయ్య (మేము ఆయన్ని రాయపర్తి మామయ్య అనేవాళ్లం) పెళ్లి పనుల్లో ఉన్నవాడల్లా వచ్చి.. “ఏం గాదు! నేను పొయ్యి ఎట్లనన్న వాణ్ని పట్టుకొని.. నీ పెట్టె నీకు తెచ్చిస్త! నువ్వు భయపడకు చెల్లే!” అని.. అందరితోటి “మీరంత చుట్టుచేరి దాన్ని ఏడిపిస్తున్నరా! ఏం గాదు, రేపు పొద్దున సూర్యుడు పొడిచే లోపల నేను తేకుంటె.. నా పేరు తీసి వేరే పేరు పెట్టుకుంట” అని అందర్నీ నవ్వించాడు.

వెంటనే తన పరపతిని ఉపయోగించి ఖమ్మంకు ట్రంక్‌కాల్ బుక్‌చేసి బస్టాండుకు ఆ బస్సులో పెట్టె సంగతి సమాచారం అందించాడు. పోలీసులకు కూడా చెప్పి ఉంచాడు. ఆ పెట్టెలో ఏమేం ఉన్నాయో అమ్మను అడిగితే.. అమ్మ ఆ బాధలో, కంగారులో వెంటనే ఏమీ చెప్పలేక పోయింది. దాంతో సూర్యం చిన్నాన్న (మా అమ్మకు మేనమామ కొడుకు.. కానీ, అక్కా %-% తమ్ముళ్లలా పెరిగారు) తనకు గుర్తున్నవన్నీ చెప్పాడు. మొత్తానికి మామయ్య తన కూతురు పెళ్లి ఆ మర్నాడు ఉన్నా, కొన్ని పనులు వేరేవాళ్లకు అప్పజెప్పి వెంటనే.. వీళ్లు తెచ్చిన సందూక తీసుకొని జీపులో బయల్దేరి ఖమ్మం వెళ్లాడు. అప్పటికే బస్సు ఖమ్మంలో ఆగగానే కంట్రోలర్ బస్సు దగ్గర రెడీగా ఉన్నాడట. మా పెట్టె తీసుకుని అతనెవరో దిగబోతుంటే ఆపి.. “ఈ పెట్టె గురించి తారుమారైందని కంప్లయింట్ ఒచ్చింది. మీరు కొంచెం సేపు ఆగండి” అన్నాడట. “ఎందుకైతది? ఈ సందూక నాదే!” అన్నాడట అతను. “అయితే అండ్ల ఏమున్నయో చెప్పండి! వేరేవాళ్లు గూడ ఒస్తున్రు. వాళ్లు ఒచ్చినంక వాండ్లనుగూడ అడుగుతం. మీ ఇద్దరి ముంగటనే పెట్టె పలగ్గొట్టి చూద్దాం. ఎవరు చెప్పింది కరెక్ట్ అయితె వాళ్లకు ఇచ్చేస్తం!” అన్నాడట కంట్రోలర్. ఆ ప్రయాణికుడు కొంచెంసేపు గునిసి.. “మొదలు వాళ్లు చెప్పనియ్యండి” అన్నాడట. ఈలోగా మామయ్య వెళ్లడం.. తను పట్టుకెళ్లిన లిస్టు ఇవ్వడం చేసేసరికి ఇద్దరు పోలీసులు కూడా వచ్చారట. అతడు మొదట తన దాంట్లో డబ్బు ఉందని అన్నాడు గానీ.. పోలీసులను చూసి మారు మాట్లాడకుండా తన పెట్టె తీసుకుని వెళ్లిపోయాడు. సహాయం చేసినందుకు వాళ్లకు మామయ్య దావత్ (ఇప్పటి రోజుల్లో ట్రీట్) ఇచ్చి.. ఆ మధ్యరాత్రి పెట్టె తీసుకుని విజయవంతంగా ఇంటికి వచ్చాడు. ఆ మర్నాడు మామయ్య.. “చూసిన్రా.. ఏడు సముద్రాల అవతల ఉన్నా సరే, సూర్యోదయం లోపల సందూక పట్టుకొని ఒస్తానన్నానా లేదా?! ఏం లాభం.. ఈ దేశపు మహారాజు అర్ధరాజ్యం, అందమైన రాజకుమారిని ఇస్తానని ఇంకా ఒస్తులేడేంది?!” అని తన సహజ ధోరణిలో అందర్నీ నవ్వించాడు. “చాలు.. సంబడం! బిడ్డ పెండ్లి చేసుకుంట అవ్వేం మాటలు?!” అని జానకి అత్తమ్మ చురచురా చూసింది. “లేకపోతే.. మా చెల్లెలి ఆభరణముల పేటిక పోవుటయా?! అదియునూ నేనుండగానే ?!” అని మామయ్య ఇంకా నవ్వాడు. పెళ్లిలో కూడా ఎవరో ఒకరు.. “నీ పెట్టె పోయిందటగద !” అని అమ్మను అడుగుతూనే ఉన్నారు. అమ్మ ఓపిగ్గా.. “అవును! పోయి భద్రాద్రి అన్నయ్య వల్ల దొరికింది” అని చెబుతూనే ఉంది. ఆ పెళ్లి మహా వైభవంగా జరిగింది. మధ్యాహ్నం భోజనాల తాలూకూ ఆఖరి బంతి అయ్యేసరికి రాత్రి భోజనాల వేళయ్యి వండేవాళ్లు, వడ్డించేవాళ్లు తీరిక లేకుండా పని చేస్తూనే ఉన్నారని చెప్పుకొన్నారు. పిల్లలమంతా పెళ్లి కూతురైన మా వదిననూ, పెళ్లి కొడుకునూ, ఆ పెళ్లి తంతునూ చూస్తూనే ఉన్నాం తప్ప.. ఆటలాడుకోవడానికి కూడా వెళ్లలేదు. ఆ పెళ్లిలోనూ, ఆ తరువాత వారం రోజులకే మా ఊళ్లో జరిగిన మా మేనత్త కూతురి పెళ్లిలోనూ బ్యాండ్ వాళ్లు మొత్తం ‘దసరా బుల్లోడు’ పాటలే వాయిస్తూ హోరెత్తిస్తుంటే.. వింతగా అనిపించింది.

# కాళేశ్వరాన్ని పునరుద్ధరిస్తేనే మనకు భవిష్యత్తు



మానవ మనుగడకు కావాల్సినవి ప్రధానంగా గాలి, నీరు.సకల జీవకోటికి ప్రాణాధారమైన నీటి కోసం దేశాలు, రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య యుద్ధాలూ జరుగుతున్నాయి. ఆ నీటి కోసం జరిగిన ఉద్యమ ఫలితంగానే తెలంగాణ ఏర్పడింది. తెలంగాణ చరిత్రను ఒకసారి పరికించి చూస్తే నాడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దుర్భరంగా ఉండే ది. ఒకవైపు కులవృత్తులు కనుమరుగైపోయి, మరోవైపు నీటి వసతి లేక రైతులు కరువు కోరల్లో చిక్కుకున్నారు. ఆకలి కేకలతో తెలంగాణలో బతుకలేక, చావలేక ఎన్నో కుటుంబాలు వలసెల్లిపోయాయి. కొంతమంది రైతులు ఉన్న ఊరిని, కన్న తల్లిని విడిచిపోలేక ఎడాపెడా బోర్లు వేసి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఒకప్పుడు తెలంగాణ అంటేనే కరువు.. రైతు ఆత్మహత్యలు.. వలసలకు కేరాఫ్ అడ్రస్. అలాంటి తెలంగాణ రూపురేఖలు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో పూర్తిగా మారిపోయాయి. నేడు చెరువులు మత్తళ్లు దుంకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భూగర్భ జలాలు పెరిగాయి. ఇదంతా కాళేశ్వరం పుణ్యం కాదా! తెలంగాణలో నేటికీ మెజారిటీ ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయానికి మూలమైన నీటి కోసం ఒక భారీ ప్రాజెక్టు నిర్మించడం తప్పా? అయినా తెలంగాణ ఉద్యమ నేపథ్యమే నీళ్లు, నిధులు, నియామకాలు. ఈ నీళ్ల సమస్య స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి తెలంగాణకు జీవన్మరణ సమస్యలా తయారైంది. అలాంటి సమస్యను కేసీఆర్ తరిమికొట్టారు. తెలంగాణ ఏర్పాటుతో మన నిధులు మనకు దక్కాయి. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో నీళ్లూ దక్కాయి. అయితే, ఈ ప్రాజెక్టుపై మొదటినుంచీ కొందరు విష ప్రచారం చేస్తుండటం హేయం. సాధారణంగా నీరు ఎక్కువగా ఎక్కడైతే లభ్యమవుతుందో అక్కడే ప్రాజెక్టులు నిర్మిస్తారు. నది జన్మస్థానం నుంచి ఎంత కిందికి వెళ్తే అంత నీటి లభ్యత ఉంటుందనేది జగమెరిగిన సత్యం. జన్మస్థానం నుంచి నది కిందికి పయనించే కొద్దీ ప్రవాహ మార్గంలో ఉపనదులు, వాగులు, వంకలు, కాలువలు, పాయలు కలుస్తుంటాయి. అందుకే డిజైన్‌ను మార్చి, ప్రస్తుత ప్రాంతంలో ప్రాజెక్టును కట్టాల్సి వచ్చింది. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు కాస్ట్ బెనిఫిట్ రేషియో గురించి చూద్దాం. ఈ కాస్ట్ బెనిఫిట్ రేషియోను అసలు ఎలా చూడాలి? అసలు ఏ రంగంలో చూడాలి? మానవాళికి తాగునీరు అందించే విషయంలో చూడాలా? లేదా మానవ మనుగడకు అవసరమైన ఆహారాన్ని అందించే వ్యవసాయరంగానికి కావలసిన నీళ్లను ఇవ్వడంలో చూడాలా? పారిశ్రామికరంగానికి నీళ్లను అందించి, ఉద్యోగాలు కల్పించినందుకు చూడాలా? అసలు ఏ రంగంలో చూడాలి? ఈ విషయమై మేధావులకు అవగాహన లేకపోతే ఎలా? ఇంకా నేడు కొంతమంది కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారు. అదేమిటంటే.. ఒకవేళ కాళేశ్వరం ప్రాజెక్టు లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చినట్టయితే నేడు పంపుసెట్లు ఎందుకు పెరిగాయని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణలో పంపుసెట్లు గతంలో కంటే పెరిగాయనేది వాస్తవం. దానికి ప్రధాన కారణం భూగర్భజలాల పెరుగుదల, నాణ్యమైన విద్యుత్తు సరఫరా. భూగర్భజలాలు పెరగడానికి ప్రధాన కారణం కాళేశ్వరం. మరొక ప్రశ్న ఏమంటే.. గత ఖరీఫ్ సీజన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లు వాడకపోయినా రికార్డు స్థాయిలో వడ్లు పండాయని చెప్తున్నారు. అదే రికార్డు పంట గత రబీ సీజన్‌లో ఎందుకు పండలేదు. ఎందుకంటే, కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లను ఖరీఫ్ కంటే రబీ సీజన్‌లో ఎక్కువగా వాడుతాం. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే.. ఖరీఫ్‌లో వరి మాత్రమే ఎక్కువగా పండిస్తాం. అదే రబీ సీజన్‌లో వరితో పాటు అన్ని రకాల పంటలు పండిస్తాం. ఈ వాస్తవాలను గ్రహించాలి. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, మేధావులు కాళేశ్వరం ప్రాజెక్టు మీద అవాకులు చెవాకులు పేలడం మానుకోవాలి. అర్ధసత్యాలు వల్లె వేయడం మాని కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణకు సమాయత్తం కావాలి. అప్పుడే తెలంగాణ రైతాంగానికి భవిష్యత్తు ఉంటుంది.

# పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు‘



పట్టుగొమ్మలు‘పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు’ అని మహాత్మాగాంధీ అన్నారు. పల్లెలు అభివృద్ధి సాధిస్తేనే దేశాభివృద్ధి సాధ్యం. అక్షరాస్యత, పరిశుభ్రత, స్వచ్ఛత, మద్యానికి దూరంగా ఉండటం, మౌలిక వసతులు కల్పన ద్వారా గ్రామాలు త్వరగా అభివృద్ధి సాధిస్తాయి. ఈ గ్రామానికి మూడు వైపుల నుంచి రెండు లైన్ల రోడ్లు, రోడ్లకిరువైపులా చెట్లతో గ్రామంలోకి స్వాగతం పలుకుతున్నట్టుగా ఉంటుంది. గత ఎనిమిదేండ్లుగా నా పరిశోధనలో ఈ గ్రామం అన్నిరంగాల్లో స్వయం సమృద్ధి సాధించి మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. ఈ గ్రామం మత సామరస్యానికి పుట్టినిల్లు. ఈ గ్రామ జనాభా సుమారు 5,000, ఓటర్ల సంఖ్య సరిగ్గా 2400. సామాజిక వర్గాల వారీగా కుటుంబాలు ఎస్టీ: 5, ఎస్సీ: 230, బీసీ: 630, ఓసీ: 65, ముస్లిం మైనారిటీ: 40. ఈ గ్రామ రెవెన్యూ రికార్డుల ప్రకారం భూమి విస్తీర్ణం 4,192 ఎకరాలు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 3,300 ఎకరాల భూమి ఉన్నది. ఒక కుమ్మరి సామాజిక వర్గం తప్ప అన్ని కులాల వారు, అన్ని మతాల వారున్నారు. ఇదీ స్థూలంగా ఆ గ్రామ స్వరూపం. ఆ ఊరి పేరు తునికి ఖల్సా, మండలం వర్గల్, జిల్లా సిద్దిపేట. 1950, మే 21 వరకు ఈ గ్రామాన్ని తునికి అనే పేరుతో పిలిచేవారు. ఈ ప్రాంతంలో తునికి ఆకు (బీడీలు చేసే ఆకు) ఎక్కువగా లభించడంతో తునికి అనే పేరు వచ్చినట్టు చెప్తారు. ఖల్సా అనగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్షంగా కలిగి ఉన్న భూములని అర్థం. ఈ గ్రామంలో ఇప్పటికి దాదాపు 500 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. (ఖల్సా అంటే స్వచ్ఛమైనది.) 1950, మే 22 నుంచి ఈ గ్రామాన్ని తునికి ఖల్సాగా ప్రభుత్వం పేరు మార్చింది. ఈ గ్రామం చుట్టుపక్కల తునికి పేరుతో తునికి మక్త, తునికి బొల్లారం గ్రామాలున్నాయి. ఈ గ్రామం నెహ్రూ ఓఆర్‌ఆర్‌కు 20 కిలోమీటర్ల దూరంలో, రాజీవ్ రహదారికి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఇక్కడ అన్నిరకాల రాజకీయ పార్టీలున్నాయి. ఇక్కడి వ్యవసాయ భూములు స్థానికులకు 1,113 ఎకరాలు, స్థానికేతరులకు 1,203 ఎకరాలున్నాయి. భూమి ఉన్న కుటుంబాల సంఖ్య 534, భూమి లేని కుటుంబాల సంఖ్య 396. సామాజిక వర్గాల వారీగా భూమి ఉన్న కుటుంబాల వివరాలు: ఎస్టీ: 0, ఎస్సీ: 135, బీసీ: 363, ఓసీ: 36, మైనారిటీ: 25. ఇక్కడి ప్రజలందరూ వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడికి వంటిమామిడి కూరగాయల మార్కెట్ దగ్గరగా ఉండటంతో ఆధునిక పద్ధతిలో కూరగాయలు సాగుచేస్తారు. కూరగాయలు, ఆకుకూరలు, వరి, ఆలుగడ్డ ఇక్కడి ప్రధాన పంటలు. ప్రధాన సాగునీటి వసతి బోర్లు, చెరువు కుంటలు. కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో ఇక్కడ భూగర్భ జలాలు పెరిగాయి. కూరగాయలు పండించడంతో ఇక్కడ రైతు, రైతు కూలీలకు నిత్యం పని దొరుకుతున్నది. రైతులకు, రైతు కూలీలకు చేతిలో ఎప్పుడూ డబ్బులుంటాయి. సుమారు 32 జతల ఎడ్లు, 46 ట్రాక్టర్లు, 19 ట్రాలీ ఆటోలు, 5 ప్యాసింజర్ ఆటోలు, 21 కార్లు, దాదాపు ప్రతి ఇంటికి ఒక సైకిల్ మోటార్ ఉన్నాయి. చాలామందికి పాలిచ్చే బర్రెలున్నాయి. 80 శాతం మంది అక్షరాస్యులే. ఇంత పెద్ద గ్రామంలో ఒక హోటల్, ఒక స్వీట్‌షాప్, ఐదు బెల్ట్ షాపులు మాత్రమే ఉన్నాయి. యువత కూడా వ్యవసాయం పనులు, రకరకాల కంపెనీలలో ఎవరి పనులకు వారు వెళ్లిపోవడం మూలంగా ఇక్కడ ఆరోగ్యకరమైన వాతావరణం ఉన్నది. ఇక్కడి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటున్నది. తక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. రెండు కుటుంబాలు మినహా దాదాపు అన్ని కుటుంబాలు వారి స్తోమతకు తగ్గట్టుగా అవసరాలు తీర్చుకునే స్థితిలో ఉన్నారు. ఇక్కడ పంచాయితీలు చాలా తక్కువ. చిన్న, చిన్న పంచాయితీలను కూడా గ్రామ పరిధిలో పరిష్కరించుకుంటారు. పోలీస్ స్టేషన్ వరకు ఈ గ్రామస్థులు పోరు అంటే అతిశయోక్తి కాదు. రాజకీయాలు, రాజకీయ పార్టీలు ఎన్నికల వరకే, ఎన్నికల తెల్లారి చాలా ఆత్మీయంగా కలిసి ఉంటారు. ఈ గ్రామం వర్గల్ మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ గ్రామ పంచాయతీలో 12 వార్డులున్నాయి. గ్రామ పంచాయతీలో 9 మంది సిబ్బంది పనిచేస్తారు. ఒక ట్రాక్టర్ ఉన్నది. గ్రామం ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంటుంది. ఐదు వాటర్ ట్యాంకులు, ప్రతి ఇంటికి మిషన్ భగీరథ, వంటగ్యాస్ కనెక్షన్ ఉన్నది. వ్యక్తిగత మరుగుదొడ్లున్నాయి. ఇక్కడ ఎక్కువగా ఆర్‌సీసీ ఇండ్లున్నాయి. ఈ ఊరు మాంసం విక్రయాలకు పేరుగాంచింది. గ్రామంలోని ప్రతి వీధికి సూచిక బోర్డులను ఏర్పాటుచేశారు. పార్కు, పార్కులో తెలంగాణ తల్లి, బతుకమ్మ విగ్రహాలు, జాతీయ జెండా ఉన్నది. గ్రామంలో చాలామంది జాతీయ నాయకుల విగ్రహాలున్నాయి. ఈ గ్రామంలో నూతన పంచాయతీ భవనం, జాతీయ బ్యాంకు, కరెంటు సబ్‌స్టేషన్, శ్మశానవాటిక, హైస్కూల్, ప్రైమరీ స్కూల్, అంగన్వాడీ కేంద్రం, ప్రైవేట్ పాఠశాల, రైతువేదిక, గ్రామ దేవతలు, అన్ని కులాలకు చెందిన పెద్ద పెద్ద దేవుని గుళ్లు, మసీదులున్నాయి. ఏటా ఏదో ఒక కులంవారు వారి వారి కులదేవతలకు పెద్ద ఎత్తున పండుగలు చేస్తారు. ఊరు నిండా సిమెంట్ రోడ్లు. గత ప్రభుత్వంలో 98 డబుల్ బెడ్‌రూంలు కట్టి అర్హులకు అందజేశారు. రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా/ చేయూత పింఛన్ల వంటి పథకాలతో పాటు వృద్ధాప్య పింఛన్లు 179, వితంతు పింఛన్లు 184, వికలాంగుల పింఛన్లు 36, బీడీ వర్కర్స్ పింఛన్ 18, ఒంటరి మహిళల పింఛన్లు 9 మందికి వస్తున్నది. అటు వ్యవసాయం, ఇటు కంపెనీలు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల మూలంగా ప్రజల చేతిలో డబ్బులాడుతున్నాయి. గత ఎనిమిదేండ్ల నా పరిశోధనలో ఈ గ్రామం స్వయం సమృద్ధి సాధించి ఆర్థికపరమైన ఇబ్బందులకు గురికాకుండా ఉన్నది. గత పదేండ్లుగా ఒక రైతు, ఇద్దరు రైతుకూలీలు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ గ్రామంలో ప్రస్తుతం ఒక ఎకరా భూమి ధర రూ. ఒక కోటి పైన పలుకుతున్నది. పనిలో, సమష్టి నిర్ణయాలలో, గ్రామాభివృద్ధిలో ఈ గ్రామం మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నది.

# ప్రజల ప్రాణాలతో ‘రసాయన’ చెలగాటం



బ్రెజిల్‌లో జూన్ 3వ తేదీన 11వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరంలో వాతావరణ సంక్షోభంపై జరిగిన సెమినార్‌లో భారత్ తరపున ఎంపీ బైరెడ్డి శబరి అద్భుతంగా ప్రసంగించారు. 1970లో చిప్కో ఉద్యమాన్ని ప్రపంచం ముందుంచి, పర్యావరణ పరిరక్షణ కోసం భారత్ చేస్తున్న కృషిని బ్రిక్స్ దేశాలకు వివరించారు. కానీ, ఆమె ప్రసంగానికి కొన్ని గంటల ముందు జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడలో తెలంగాణ ప్రభుత్వం పర్యావరణ విధ్వంసానికి పాల్పడింది. బహుశా ఈ ఘటన గురించి తెలిసి ఉంటే, ఆమె అలా ప్రసంగించేవారు కాదు. పర్యావరణం కాలుష్య భరితంగా మారుతున్న ప్రస్తుత కాలంలో వినాశనానికి దారితీస్తున్న అంశాలపై చర్చించుకోవాల్సిన బాధ్యత ఆరోగ్యవంతమైన జీవన మనుగడను కోరుకునేవారిపై ఉన్నది. చట్టాలను రూపొందించే స్థానాల్లోకి పారిశ్రామికవేత్తలు రావడంతో పర్యావరణ చట్టాలు వారికి చుట్టాలుగా మారిపోయాయి. అభివృద్ధి మాటున జరుగుతున్న పర్యావరణ విధ్వంసం గురించి తెలుసుకోకపోతే సకల జీవరాశుల భవిష్యత్తు తరాలను ప్రమాదంలోకి నెట్టినవారవుతాం. అభివృద్ధికి నోచుకోని,ఆర్థికంగా, విజ్ఞానపరంగా వెనుకబడిన ప్రాంతాలపై కార్పొరేట్ల కన్ను ఎప్పుడూ ఉంటుంది. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న తెలంగాణలోని ఉమ్మడి పాలమూరు, ఏపీలోని కర్నూల్ జిల్లాల పరిధిలో ఉన్న తుంగభద్ర, కృష్ణా నదుల తీరం వెంట ఫ్యాక్టరీలను నెలకొల్పుతూ పాలకులే పర్యావరణ పరిరక్షణ చట్టాలను తుంగలో తొక్కుతున్నారు. పారిశ్రామికవేత్తలు రాజకీయ నాయకుల అవతారమెత్తడంతో పర్యావరణం మరింత ప్రమాదంలోకి జారుకుంటున్నది. తమ అభిప్రాయాలనే ప్రజాభిప్రాయాలుగా పోలీసుల పహారాలో వారు తీర్మానాలు చేసుకుంటున్నారు. భవిష్యత్తు తరాలకు మేలైన సమాజం కోసం గొంతెత్తే వారిని అభివృద్ధి నిరోధకులుగా, సంఘ వ్యతిరేక శక్తులుగా పాలకులు చిత్రీకరిస్తున్నారు.

గద్వాల జిల్లాలో ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ కొన్ని నెలలుగా అక్కడి రైతులు ఆందోళనలు చేస్తున్నారు. కానీ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు అర్ధరాత్రి స్వరాష్ట్ర కలలను ఛిద్రం చేస్తూ ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి పూనుకున్నారు. మరోవైపు ప్రపంచ దేశాలు నిషేధించిన పీఎఫ్‌వోఏ రసాయనం ఉత్పత్తిని చేపట్టవద్దంటూ అభిప్రాయాన్ని చెప్పేందుకు వెళ్లిన ప్రజలపై, ప్రజాసంఘాల నాయకులపై కర్నూల్ జిల్లా తుంగభద్ర నది ఒడ్డున రాజకీయ నాయకుడిగా మారిన పారిశ్రామికవేత్త దాడి చేయించారు. పర్యావరణ పరిరక్షణకు కాపలా ఉండాల్సిన నాయకులే కాలుష్య సమాజం కోసం పాకులాడుతుండటం దురదృష్టకరం. ఫ్యాక్టరీల ఏర్పాటుతో కొంత మేర ఆస్తి నష్టం జరిగినా.. నీరు, వ్యవసాయ భూమి లభ్యత తగ్గినా పర్వాలేదు. కానీ, తమ మనుగడే ప్రమాదంలో పడితే, భవిష్యత్తు తరాల ఉనికే ప్రశ్నార్థకంగా మారితే ప్రజలు కచ్చితంగా ఆందోళనలు చేస్తారు, చేయాలి కూడా. గద్వాల జిల్లా, కర్నూల్ జిల్లాల్లో ఏర్పాటుచేసే లేదా విస్తరించే ఫ్యాక్టరీల మూలంగా ఆ ప్రాంతాలకే నష్టం జరుగుతుందని అనుకోవడం పొరపాటే. ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల వాయు కాలుష్యంతో పాటు నేల, నీటి కాలుష్యం జరుగుతుంది. శ్వాసకోశ, చర్మ సమస్యలు వచ్చే ప్రమాదం ఉన్నది. ముఖ్యంగా పంటల దిగుబడి తగ్గిపోతుంది. నాణ్యత దెబ్బతింటుంది.

పాలమూరు గ్రామాల్లో వ్యవసాయమే ప్రధాన వనరు. రైతుల జీవనాధారాన్ని దెబ్బతీస్తే పాలమూరు జిల్లా మళ్లీ వలసలమయం అవుతుంది. కర్నూల్ జిల్లా నది ఒడ్డున విస్తరించాలని చూస్తున్న ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే రసాయనాల మూలంగా పర్యావరణానికి తీరని నష్టం జరుగుతుందని నిపుణులు ఇప్పటికే ధ్రువీకరించారు. పీటీఎఫ్‌ఈ ఉత్పత్తిలో వాడే పీఎఫ్ఏఎస్(పర్- పాలీఫ్లోరోఅల్కైల్) రసాయనాలు పర్యావరణాన్ని కాలుష్యం చేస్తాయి. పీఎఫ్‌వోఏ వంటి హానికరమైన పదార్థాలను ఇవి విడుదల చేస్తాయి. పీఎఫ్‌వోఏ వాతావరణంలో సులభంగా కలిసిపోతుంది. అంతేకాదు, వాతావరణం నుంచి అంత త్వరగా తొలగిపోదని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ సంస్థ ఈ రసాయనాన్ని క్యాన్సర్ కారకంగా వర్గీకరించింది. ఫ్యాక్టరీ యాజమాని ప్రభుత్వంలో భాగస్వామి కావడంతో పర్యావరణ ఉల్లంఘనలు యథేచ్ఛగా జరిగే ఆస్కారం ఉంటుంది. వరదలు వచ్చినప్పుడు రసాయన వ్యర్థాలు నదిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే కర్నూల్ జిల్లాతోపాటు జోగులాంబ జిల్లాలోని అలంపూర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కొల్లాపూర్ ప్రాంతాలు భవిష్యత్తు లో క్యాన్సర్ ప్రభావిత ప్రాంతాలుగా మారుతాయి. ఈ ఫ్యాక్టరీ వల్ల తెలంగాణలోని నదీ తీర ప్రాంతాలకే ఎక్కువ నష్టం జరుగుతుంది.

పీఎఫ్‌వోఏ రసాయనం మూలంగా సంభవించే ఆరోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్యాన్ని గుర్తించిన చాలా దేశాలు దీన్ని నిషేధించాయి. 2014లో అమెరికా, 2020లో యురోపియన్ యూనియన్ దీన్ని పూర్తిగా నిషేధించాయి. కానీ, మన దేశంలో, మన రాష్ట్ర సరిహద్దులోని తుంగభద్ర తీరం వెంబడి మాత్రం ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా రసాయనాల ఉత్పత్తికి పూనుకున్నారు. మే 14న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో అక్కడి ప్రజాసంఘాల నాయకులపై దాడి జరిగింది. దీంతో కర్నూల్ జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఆందోళన బాటపట్టారు. కానీ, తెలంగాణ ప్రభుత్వంలో మాత్రం చలనం లేదు. అమయాక ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్య కారక రసాయనాలపై విచారణ చేపట్టాలి. అంతేకాదు గద్వాల జిల్లాలో ఏర్పాటు చేయాలనుకుంటున్న ఇథనాల్ ఫ్యాక్టరీ మూలంగా కలిగే నష్టాలపై రైతులు, ప్రజాభిప్రాయాలను

## మాకు కొలువులు ఇప్పించండి!

కొలువుల కోసం నిరుద్యోగ యువకులమైన మేము ఎవరేం చెప్పినా నమ్మినాం. అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను కూడా నమ్మినం. రాష్ట్రవ్యాప్తంగా ఊరూరా తిరిగి 'చేయి గుర్తుకు ఓటు వెయ్యి'మని రెండు చేతులెత్తి ప్రజలను వేడుకున్నాం, వారిని ప్రాధేయపడ్డాం. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందో, రాదో అన్న అనుమానం సొంత పార్టీ నేతల్లోనే ఉండేది. కానీ, ఆ సమయంలో నిరుద్యోగులంతా ఏకమై ఆ పార్టీకి మద్దతునిచ్చి అధికారంలోకి వచ్చేలా కృషిచేశాం. ఇది నిరుద్యోగుల ప్రభుత్వమని, మా ప్రజా ప్రభుత్వంలో నిరుద్యోగులదే పెద్ద చేయి అని సంబురపడ్డాం. ఇక మాక్కూడా కొలువులు దక్కుతాయనే నమ్మకం పెరిగింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా జాబ్ క్యాలెండర్ ప్రకటించి దాని ద్వారా ఏటా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసుకుందామని ప్రభుత్వం ప్రకటిస్తే మా ఆశలకు రెక్కలు తొడిగాయి. స్వయంగా రాహుల్ గాంధీ 'ఇది నా గ్యారెంటీ' అని హామీ ఇవ్వడం, 'ఈ హామీలు అమలు చేయకపోతే మాపై పోరాడండి' అని ప్రియాంక గాంధీ చెప్పడంతో మాకు కొండంత భరోసా కలిగింది.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా 'మా ప్రభుత్వం నిరుద్యోగుల ప్రభుత్వం' అని చెప్పడంతో కాంగ్రెస్ మాట తప్పని, మడమ తిప్పని ప్రభుత్వమనుకున్నాం. ఆ మాట నిరుద్యోగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచింది. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టుగా చట్టబద్ధమైన జాబ్ క్యాలెండర్ అమలుచేసి ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తుందనే నమ్మకం పెరిగింది. మేము అనుకున్నట్టుగానే పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను శరవేగంగా భర్తీచేసి కొత్త సంవత్సరంలో పకడ్బందీగా జాబ్ క్యాలెండర్ అమలుచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. టీజీపీఎస్సీ చైర్మన్ పదవీ కాలం పూర్తి కాకముందే కొత్త చైర్మన్‌ను నియమించడంతో నిరుద్యోగుల ఆశలకు రెక్కలు తొడిగాయి. కోచింగ్ సెంటర్ల దోపిడీ నుంచి గ్రామీణ పేద విద్యార్థులకు ఇక విముక్తి కలుగుతుందని సంతోషపడ్డాం. తల్లిదండ్రులకు లక్షల కోచింగ్ ఫీజు భారం తగ్గిందని ఊపిరి పీల్చుకున్నాం. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టు ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేస్తుందని ఎదురుచూస్తున్నాం. కానీ, ఆ హామీ ఇంకా అమలు కావడం లేదు. అంతేకాదు, అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత నాణ్యమైన కోచింగ్‌ను అందిస్తుందని ఆశపడ్డాం.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్వయంగా అశోక్‌నగర్ వచ్చి నిరుద్యోగుల బాధలను కండ్లారా చూసి చలించిపోయి, ఏడాది తిరిగేలోగా ఉద్యోగాల భర్తీ, చట్టబద్ధమైన జాబ్ క్యాలెండర్, 25 వేల టీచర్ ఉద్యోగాలతో మెగా డీఎస్సీ, రూ.4 వేల నిరుద్యోగభృతి, పరీక్ష ఫీజులు వసూలు చేయబోమని, లైబ్రరీలను అభివృద్ధి చేస్తామని, పరీక్ష పరీక్షకు తగినంత సమయం ఇస్తామంటూ అనేక హామీలు ఇవ్వడంతో మాకు మంచిరోజులు వచ్చాయనుకున్నాం. ఇగ కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది కాబట్టి మాకు కొలువుల పండుగే అనుకున్నాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన తర్వాత కేవలం 12 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసింది. ఇంకా 2 లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తుందో అర్థం కావడం లేదు.నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవడం కాంగ్రెస్ పార్టీకి సరికాదు. అంతేకాదు, ఈ ప్రజా ప్రభుత్వ గౌరవాన్ని పెంచదు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ప్రభుత్వం ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు పెంచబోతున్నదనే వార్తలు వస్తున్నాయి. దీంతో నిరుద్యోగుల్లో నిరాశ ఆవహించింది. ఒక వేళ ఆ నిర్ణయం అమల్లోకి వస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్టే. నిరుద్యోగులంటే నిరక్షరాస్యులు కాదనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఖాళీ అయ్యే ప్రతి ఉద్యోగాన్ని, మరుసటి నాడే భర్తీ చేసేలా కృషిచేయాలి. ప్రభుత్వం ఇచ్చే వందల ఉద్యోగాలకు లక్షలమంది నిరుద్యోగులు పోటీ పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు కూడా పరిమితంగానే ఉంటాయి. కాబట్టి, ప్రైవేట్ ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు ఇచ్చే కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలి. ప్రోత్సాహకాలను అందించాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే నియామకాల కోసం కాబట్టి, ప్రైవేటు ఉద్యోగాల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు దక్కేలా ప్రభుత్వం చట్టం తీసుకురావాలి.పరిశ్రమలకు కావాల్సింది నైపుణ్యం ఉన్న మానవ వనరులే కాబట్టి, నిరుద్యోగులకు సాంకేతిక నైపుణ్యాలను అందివ్వాలి. అందుకు తగ్గట్టుగా ప్రతి మండలంలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేయాలి. పరిశ్రమలు కోరుకుంటున్నట్టు, పారిశ్రామిక అవసరాలు తీర్చేలా విద్యావ్యవస్థను సమూలంగా మార్చాలి. ముఖ్యమంత్రి ప్రతి నెల ఏదో ఒక యూనివర్సిటీని తప్పకుండా సందర్శించాలి. 30 లక్షల నిరుద్యోగుల జీవితాలను దృష్టిలో పెట్టుకొని ఏటా బడ్జెట్‌లో 3 శాతం నిధులను ప్రత్యేకంగా కేటాయించాలి. నిరుద్యోగ యువతీ, యువకులకు వ్యాపారం చేసుకునేందుకుగాను ప్రభుత్వం ఉదారంగా రుణాలను అందించినప్పుడే కొలువుల తెలంగాణ అవతరిస్తుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

# రాబడిపై దాడి, మళ్లీ అదే గారడీ!




గవర్నమెంటే గండమయ్యాక, దాని నెత్తి మీదున్న గంపలో ఏముంటుందో ప్రజలకు తెలియదా? అందుకే, నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు మొదలవుతున్నా, మొహం అటువైపు పెట్టేవారే లేరెవ్వరు. నిజానికి బడ్జెట్ సమావేశాలకు మూడు, నాలుగు నెలల ముందునుంచే వివిధ వర్గాలు నిధుల కేటాయింపుల కోసం మంత్రి మండలికి దరఖాస్తుల దండలేసేవి.కానీ, 'ఉండబట్టలేక ఓటేస్తే/ ఉన్న బట్టా లాక్కున్నట్టు' అని అలిశెట్టి ప్రభాకర్ అన్నట్టుగా, ఏడాదిన్నర నుంచి హస్తం సర్కార్ అన్నీ లాగేసుకున్నాక, సర్కారు వారి వరాల కోసం ఆశపడే వెర్రివాళ్లు ఇంకా ఉంటారా? అందుకే, ఇందిరమ్మ సర్కార్ బీరువాలోకి కన్నేసే ఆలోచన కలలో కూడా ఎవరికీ లేకుండా పోయింది.వాస్తవానికి ఏడాదిన్నర కిందటి దాకా కేవలం అవగాహనపరులే కాదు, ఆశా జీవులందరికీ మార్చి నెలపై ఎంతో ఆసక్తి ఉండేది. వర్షాకాల, శీతకాల శాసనసభ, మండలి సమావేశాల కంటే, పద్దును ప్రజల ముందుంచే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపైనే కొన్నిరోజుల ముందు నుంచే జనంలో జోరైన చర్చలు నడిచేవి. మీడియా కూడా గత బడ్జెట్‌లో వివిధ రంగాలకు జరిపిన కేటాయింపులు, వాస్తవ ఖర్చులు, అంచనాలు, ఖర్చులకు మధ్య ఫలితాలు, తదితర వాస్తవాలపై లోతైన కథనాలను ప్రసారం చేసేది. నిజానికి గతంలో ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ దురంధరులు, ఘనాపాటీలెందరో చట్టసభ సభ్యులుగా ఉన్నప్పటికీ, మిగతా సభాసమావేశాలు ఆకర్షించినంతగా బడ్జెట్ సెషన్‌లు సామాన్యుల దృష్టిని ఆకట్టుకోకపోయేటివి. ప్రజల అనుభవంలో ప్రతిఫలించని, అసలు వారికి అర్థమే కానీ అంకెల విన్యాసాలుగా బడ్జెట్ సమావేశాలుండేవి. సర్కార్ వారి ఆదాయ, వ్యయాల ప్రణాళికలు బేతాళ మాంత్రికుడి చిక్కు ప్రశ్నల్లా అందరినీ బెదరగొట్టేవి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల బడ్జెట్‌ల విశ్లేషణ ఆర్థికరంగ నిపుణుల సంబంధిత వ్యవహారంగా అందరూ భావించేవారు.కానీ, 2001లో టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత అసెంబ్లీ సమావేశాల నిర్వహణలో బడ్జెట్ సెషన్స్ ప్రాధాన్యమే పూర్తిగా మారిపోయింది. ఊకదంపుడు ఉపన్యాసాలు, స్వోత్కర్షలు, పాండిత్య ప్రదర్శనలు, కొటేషన్లు, కొర్రీలు, వేళాకోళాల వాదోపవాదాల స్థానంలో, వివేకవంతమైన విశ్లేషణ, వివక్షపై లోతైన అన్వేషణ మొదలైంది. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాల్లో పాలకుల పక్షపాతం, రాబడి, వ్యయాల వ్యత్యాసం వెనుక రాజకీయ కనికట్టును కేసీఆర్ కుండబద్దలు కొటినట్టుగా తేటతెల్లం చేయడంతో, విత్త విధానంపై తెలంగాణ తన చూపును తిప్పింది. ఆనాటి సమైక్యాంధ్ర సర్కార్‌లు నిధుల కేటాయింపులో తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని, చాట్లో నిప్పులు పోసి చెరిగినట్టు కేసీఆర్ సభ లోపల, వెలుపల చీల్చి చెండాడటంతో, జరుగుతున్న మోసం జనాల చెవికెక్కడం మొదలైంది. పద్దులో పస్తులు తెలంగాణకు, పండుగను సీమాంధ్రకు పంచే పక్షపాత పూరిత బడ్జెట్ ప్రసంగాలను బట్టలిప్పేసి, నగ్నంగా నిలబెట్టగలిగింది గులాబీ పార్టీ. దాంతో నాలుగున్నర దశాబ్దాల తర్వాత బడ్జెట్‌లో వడ్డిస్తున్న దగా మొత్తం దర్పణంలో చూసినట్టుగా రాష్ట్ర ప్రజలందరి ముందు ఆవిష్కృతమైపోయింది. అప్పటిదాకా పడుతూ లేస్తూ, పనైపోయిందని అందరూ భావించిన ప్రత్యేక రాష్ట్ర పోరాటానికి బడ్జెట్‌ను భాస్వరంలా వాడి మండించింది బీఆర్ఎస్ పార్టీ. దానివల్ల ఆదాయ, వ్యయాల అంచనాల్లో సర్కార్ల అంకెల గారడీ అందరినోటా చర్చనీయాంశంగా మారింది.1956 నుంచి 2014 మధ్య కాలంలో ఉద్దేశపూర్వకంగా అమలుచేసిన ఆర్థిక విధ్వంసక నమూనా, తెలంగాణ నుంచి సర్వస్వం లాగేసుకొని ఈ ప్రాంతాన్ని నిస్సహాయమైన నేలగా మార్చివేసింది. జీవితాలను జైళ్లు, బెయిల్లుగా మార్చి, ఊర్లను వలసలు, స్మశానాలుగా పెంచిన వికృత వృద్ధి నమూనాకు వ్యతిరేకంగా చీమల దండుకు మర్మం నేర్పినట్టు, మేకల మందను యుద్ధానికి సిద్ధం చేసినట్టు తెలంగాణ జనాన్ని తిరగబడేలా తీర్చిదిద్దింది కేసీఆర్ అనుచరదళం. ఉపరితలంలో సల్పుతున్న నొప్పులకు పునాదిలో తిష్టవేసుకొని ఉన్న సుదీర్ఘ మౌలిక రుగ్మతలపై స్పష్టమైన అవగాహనను ఉద్యమ అనుభవంలోంచి అవగాహన చేసుకున్న బాధ్యతాయుత రాజకీయ శక్తి బీఆర్ఎస్. అందువల్లనే ఉద్యమ కాలంలో బడ్జెట్‌లో వివక్షా గోడలను శాసనసభ లోపలే ఎలా బద్దలు కొట్టిందో, అధికార పార్టీగా సైతం విత్త నిర్వహణను సమగ్రాభివృద్ధి విప్లవానికి ఆదెరువుగా రూపొందించింది. దానివల్లనే ప్రగతిలో ఫీనిక్స్ పక్షిలా తెలంగాణ రాష్ట్రం స్వల్పకాలంలోనే ఆరోగ్యకర అభివృద్ధిని సాధించింది. పర్యాటకం, పోలీస్ బాధ్యతలకు మాత్రమే సర్కార్‌లు అనే ప్రపంచ బ్యాంకు విధానాన్ని విసిరి, పదేండ్ల పద్దుల్లో ఆర్థికశాస్త్రం, సామాజిక శాస్త్రంకు పొత్తు కుదుర్చి నవీన వృద్ధి నమూనా జెండా ఎగరేసింది గులాబీ సర్కార్.పేదల కన్నీరు తుడువని ఆర్థిక ప్రగతి అస్థిరమైనది మాత్రమే కాదు, అన్యాయమైనది కూడా అనే కేసీఆర్ ఉదాత్తమైన భావనల వెలుగులో 2014-15 నుంచి 2023-24 దాకా రాష్ట్ర బడ్జెట్‌లు రూపొందించబడ్డాయి. 2,90,396 కోట్లతో నాటి ఆర్థికమంత్రి హరీష్ రావు బీఆర్ఎస్ ప్రభుత్వ చివరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే నాటికే తెలంగాణ విపణి మార్పులను సంధానం చేసుకొని సౌభాగ్య రాష్ట్రంగా నిలదొక్కుకుంది.పదేండ్ల కిందట, తొలి నాటే కేసీఆర్ సర్కార్ ప్రతి ఇంటి కన్నీటినీ గుర్తించి, కారణాలు శోధించి, పరిష్కారాలకు ప్రతి పద్దులో చోటు కల్పించబట్టే తెలంగాణ అన్ని రంగాల్లో రారాజుగా ఎదిగింది. తలసరి ఆదాయం, పంటల దిగుబడి, వ్యవసాయ అనుబంధ రంగాల రాబడి, ఐటీ, పారిశ్రామిక ఉత్పత్తుల్లో దేశంలోనే తొలి ర్యాంకింగ్ రాష్ట్రంగా తెలంగాణ నిలవడం వెనుక అన్నివర్గాల ఆకాంక్షలు నెరవేర్చే శాస్త్రీయ ఆదాయ, వ్యయాల ప్రగతి ప్రణాళికలను ప్రతి ఏటా కేసీఆర్ ప్రభుత్వం రూపొందించింది.కానీ, ఏడాది కిందట లంకె బిందెలు కల గని కుర్చీనెక్కిన కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ విజయగాథను తలకిందులుగా తిప్పేసింది. ఆడలేక మద్దెల ఓడన్నట్టు సీఎం రేవంత్ రెడ్డి పని చేతకాక సాకులు వల్లె వేస్తున్నాడు. లేకపోతే పంటలెండిపోతే నేను కారణమంటున్నారని వాపోయిన రేవంత్ లాంటి ముఖ్యమంత్రిని గతంలో చూశామా? భవిష్యత్తులో చూడగలమా? రైతులు రాలుతున్నా, విద్యార్థులు ఒరుగుతున్నా, ఆటో డ్రైవర్లు ఊపిరి విడుస్తున్నా.. ఒట్లూ, తిట్లూ, ఓట్ల జపం చేస్తూ కాలక్షేపం చేస్తున్న రేవంత్ రెడ్డిని ఏమన్నా పాపం లేదు. అందుకే జనం చెప్పలేని రీతిలో హస్తం సర్కార్‌పై బూతులతో దుమ్మెత్తి పోస్తున్నారు.ప్రభుత్వ నిర్వహణ చేతగాక, ప్రజా పట్టింపే లేక మంత్రి మండలి మొత్తం చేతివాటం కళా ప్రదర్శన చేయడంలో తలమునకలై ఉన్నారు. ఈ ప్రభుత్వ పనితనం పూర్తిగా అర్థమయ్యే, హస్తం సర్కార్ ఆర్థిక పద్దుపై ప్రజలు ఏ ఆశలూ వ్యక్తం చేయడం లేదు. 2024-25 వార్షిక బడ్జెట్‌లోనే 70 పేజీల్లో కుడి ఎడమల దగా సినిమా చూపించారు. పదేండ్ల ప్రగతి పంటపై పడిన బుల్డోజర్‌లా గతేడాది బడ్జెట్ కూల్చివేతను మిగిల్చింది. ఎక్కడైనా ఎద్దు పొడిచి ఎల్లిపోయిన వారుంటారు కానీ, తెలంగాణలోనే పద్దు పొడిచి ప్రాణాలు వదిలిన ప్రజలున్నారు. మళ్లీ అదే గారడీతో జనం రాబడిపై దాడే తప్ప, రేవంత్ రెడ్డి సర్కార్ బడ్జెట్‌తో వొరిగేదేముంటుందనేదే అన్ని వర్గాల భావన.

# ధర్మ సూక్ష్మమా, సూక్ష్మ ధర్మమా



కాంగ్రెస్ పాలన అంటేనే ధృతరాష్ట్ర కౌగిలి అని ప్రతీతి. ధృతరాష్ట్రుని కొడుకు దుర్యోధనుడు. దుర్యోధనుని జాతకం చూసింది విదురుడు.విదురుడు కురు సామ్రాజ్యంలో తెలివైన మంత్రి. దుర్యోధనుడి చేతిలో అధికారం పెడితే ఎప్పటికైనా రాజ్యం నాశనమవుతుందని ధృతరాష్ట్రునికి విడమరిచి వివరిస్తాడు. కానీ, ధృతరాష్ట్రునికి ఇవేమి పట్టవు. పుత్ర వాత్సల్యంతో దుర్యోధనుడికే రాజ్య పరిపాలన అప్పగిస్తాడు. అయినా ధర్మ ప్రభువులు ఏ నిర్ణయం తీసుకున్నా.. హీన జనోద్ధరణకే అంటూ విదురుడు ధృతరాష్ట్ర నిర్ణయాన్ని సమర్థిస్తాడు. తర్వాత జరిగిన కురుక్షేత్ర యుద్ధం మనకు తెలిసిందే.యుద్ధం జరుగుతున్నప్పుడు తీర్థయాత్రలతో కాలక్షేపం చేస్తాడు. ధర్మాధర్మ విచక్షణ, వివేచన శక్తి సంపన్నుడైన ధర్మాగ్రేసరుని అంతర్వాణియైన విదుర మహామంత్రికి ఈ కపటమేల అని అడిగితే..! అదే ధర్మసూక్ష్మం అంటారు పండితోత్తములు. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం మూడు యుగాలు సంపూర్ణమయ్యాయి. కలియుగంలోనూ ఈ ధర్మసూక్ష్మ అస్తిత్వ మనుగడ దినదిన ప్రవర్ధ మర్మం పండితులకే గానీ, పామర జనుల పుర్రెలకు జొర్రదు.ఉత్తరాది రాజనీతి పండితురాలు, న్యాయశాస్త్రంలో పట్టాభిషక్తురాలు, తెలంగాణలో ఢిల్లీ కాంగ్రెస్ దూత మీనాక్షి నటరాజన్ కూడా ధర్మసూక్ష్మ జపకార్యమే ముందేసుకున్నరు. మహాభారతం కథల సారం తీసి కాచి వడబోసి 'అప్నే అప్నే కురుక్షేత్ర' నవల రాసి, విదురుని పాత్రలోనే ఒదిగిపోయిన రచయిత్రి. భూదానోద్యమానికి 75 ఏండ్లు పూర్తయినప్పుడు తెలంగాణలో ఆమె పర్యటించారు. ఇక్కడి రాజకీయ పరిస్థితులు, జనజాతుల జీవన విధానాన్ని పరిశీలించి అర్థం చేసుకున్నారు.2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకురాలిగా బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల్లో గెలవటం కోసం తెలంగాణ కాంగ్రెస్ నాయకులు తొక్కుతున్న అడ్డదారులు.. అప్పటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి గుప్పిస్తున్న బూటకపు హామీలు, ప్రకటిస్తున్న కపట గ్యారెంటీలు.. మోసపుటెత్తులు చూసి ఆమె కంగుతిన్నట్టు గాంధీభవన్‌లోనే చర్చ జరిగింది. 'ఆరు గ్యారెంటీలు ఆచరణ సాధ్యం కాదు. ఇంత ఆర్థికభారాన్ని మోయగలిగే శక్తి తెలంగాణ రాష్ట్ర ఖజానాకు లేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రజల్లో పార్టీ పట్ల వ్యతిరేక భావజాలం నెలకొంటుంది. పీసీసీ అధ్యక్షునికి పార్టీ కంటే పదవి మీదనే వ్యామోహం ఉన్నది. ఆయనకు రాజ్యాధికారం కట్టబెడితే కాంగ్రెస్ పతనం, వ్యవస్థల నాశనం తప్పదు' అని రాహుల్‌గాంధీకి వివరించినట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. కానీ, రాహుల్‌గాంధీ తెలంగాణలో అధికారంలోకి రావడమే మొదటి ప్రాధాన్యం అని తెగేసి చెప్పటంతో నటరాజన్ విదుర పాత్రలోకి ఒదిగిపోయారు. అప్పటినుంచి అబ్జర్వర్ డ్యూటీల్లో అంటీముట్టనట్టున్న మీనాక్షి, కురుక్షేత్ర యుద్ధం జరుగుతున్నప్పుడు విదురుడు పుణ్యక్షేత్ర దర్శనానికి వెళ్లినట్టు, తెలంగాణ గడ్డ మీద శాసనసభ సంగ్రామం జరుగుతున్న వేళ తెలంగాణను వదిలేసి ఉత్తరాదికి వెళ్లిపోయారు.రాష్ట్రం సంపూర్ణంగా ధృతరాష్ట్ర కౌగిట్లోకి కూరుకపోయాక ఢిల్లీ దూతగా మళ్లీ వచ్చారు. ఆమె ప్రయాణం ఆకాశయానం అనుకొని కాంగ్రెస్ నేతలు పూలగుచ్ఛాలు పట్టుకొని నింగి వంక చూస్తుంటే.. రైలుబండి మీద జంక్షన్‌లో దిగి కాంగ్రెస్ కార్యకర్తల దృష్టిని తన వైపునకు తిప్పుకున్నారు. గాంధీభవన్‌లో రాట్నం పెట్టి నూలు వడికే దృశ్య రూపంతో మీడియా వీడియో లెన్స్‌లు గిర్రున ఆమె దిక్కే తిరిగాయి. రాహుల్‌గాంధీ హార్డ్‌కోర్ టీం మెంబర్.. నిజాయితీ పరురాలు.. పైరవీలు చేయరు.. లాబీయింగ్‌లు లేవు.. అతి సాధారణ జీవనం.. ఇలా ఎవరికి తోచిన టాగ్‌లైన్ వారు తగిలించి మెయిన్ స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియా కథనాలు కథలు కథలుగా ప్రచారం చేశాయి.. చేస్తున్నాయి. నిజానికి ఆమె ప్రవర్తన కూడా అలాగే ఉన్నది. గతంలో ఇక్కడ పనిచేసిన ఢిల్లీ దూత ప్రదర్శించిన రాజదర్పం ఈమెలో లేదనే చెప్పవచ్చు.. కానీ కపటం మాటేమిటి? తెలంగాణలో ఫిరాయింపు రాజకీయాలకు ఆమె వత్తాసు ఏమిటి? కాంగ్రెస్ పార్టీ కోసం చెమట తీసిన ఆడబిడ్డలను వదిలేసి విజయశాంతికి ఎమ్మెల్సీ గ్లామర్ తొడుగులేమిటి? ఇవి ఆమె కండ్ల ముందు జరిగాయా? కళ్లు మూసుకుంటే జరిగాయా? అనేది మీమాంస.ఎమ్మెల్యే కోటాలో శాసనమండలికి ఐదు స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీలో 65 మంది ఎమ్మెల్యేల బలం ఉన్నది. దాని మిత్రపక్షం సీపీఐ పార్టీకి ఒక్క సీటున్నది. ఈ బలంతో కాంగ్రెస్ పార్టీ 3 స్థానాలు మాత్రమే గెలుచుకునే అవకాశం ఉన్నది. నాలుగో అభ్యర్థి గెలుపునకు అవసరమైనంత బలం కాంగ్రెస్ పార్టీకి లేనే లేదు. ఎంఐఎంను పార్టీని మిత్రపక్షంగా కలుపుకొని పోయినా, నాలుగో స్థానం గెలిచే అవకాశమే లేదు. అయినా నాలుగో అభ్యర్థిని నిలబెట్టారు అంటే ఫిరాయింపుదార్లను ఓటు వేయమని ఉసిగొల్పటమే కదా? ఇంకా రాజకీయ నిజాయతీ ఎక్కడిది? బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి, గోడదూకి కాంగ్రెస్‌లోకి వచ్చిచేరిన 10 మంది ఎమ్మెల్యేల తీరు సుప్రీంకోర్టు తీవ్రంగానే ఆక్షేపించింది. ఫిరాయింపుదారుల మీద వైఖరి ఏమిటో చెప్పండంటూ సుప్రీంకోర్టు ఇప్పటికే మూడు దఫాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగింది.అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకునేందుకు రీజినబుల్ సమయం అంటే ఎంతో చెప్పాలని కీలక వాఖ్యలు చేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి, ఎన్నికల సంఘానికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రీ ద్వారా నోటీసులు జారీచేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది.ఒక పక్క అనుగుచెడిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని మీనాక్షి మెకానిజం చేస్తుంటే.. మరోపక్క నుంచి రాములమ్మ తోసుకొని వచ్చింది. బీజేపీకి చెందిన రాములమ్మ ఎన్నికల ముందు పార్టీ మారాను అనే ప్రకటన మినహాయిస్తే.. కాంగ్రెస్ పార్టీకి ఆమె చేసిందేముంది?. 15 నెలలుగా పార్టీ కార్యకలాపాలకు దూరంగానే ఉంటున్నారు. కానీ, వరంగల్ జిల్లాలో ఎర్రబెల్లి స్వర్ణ, ఖమ్మం జిల్లాలో విజయాబాయి, అదిలాబాద్ జిల్లా మంచికంటి ఆశమ్మ, సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో తిరుమలప్రగడ అనూరాధ లాంటివాళ్లు పార్టీ కోసం టికెట్లు త్యాగం చేశారు. అనూరాధ అయితే ఆస్తులు అమ్ముకొని, కేసులకు తట్టుకొని పార్టీ అభ్యర్థిని గెలిపించారు. సునీతా ముదిరాజ్, సరితా యాదవ్, ఆకుల లలిత లాంటివాళ్లు ఉన్నారు. 'ఆడబిడ్డగా వారికి న్యాయం చేయని మీరు తెలంగాణ కాంగ్రెస్‌ను ఇంకేం సంస్కరిస్తారు?' అని మీనాక్షిని తెలంగాణ ప్రజలు అడుగుతున్నారు.ఇక్కడో సందర్భాన్ని గుర్తుచేసుకోవాలి. భారతీయ జనతా పార్టీ రాజకీయ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నదని రాహుల్‌గాంధీ బాధపడ్డారు. 2022లో గోవా రాష్ట్రంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోనే ఉండాలని ప్రమా ణం చేయించారు. హర్యానాలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీజేపీలోకి వెళ్తే, హిమాచల్‌ప్రదేశ్‌లో ఒక రాజ్యసభ సభ్యుడు బీజేపీలోకి వెళ్లినప్పుడు వారి ని డిస్‌క్వాలిఫై చేయాలని పోరాటం చేశారు. మణిపూర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే బీజేపీలో చేరితే ఇదే కాంగ్రెస్ పార్టీ న్యాయపోరాటం చేసింది. అప్పుడే పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ మూ డు నెలల్లోనే నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం కీలకమైన తీర్పునిచ్చింది.అంతెందుకు రాహుల్‌గాంధీ పార్లమెంటులో ఫిరాయింపుదార్లను నిరోధించి రాజ్యాంగస్ఫూర్తిని కాపాడుతామని రాజ్యాంగం పట్టుకొని ప్రకటించారు. రాహుల్‌గాంధీ ఆలోచనలకు భిన్నంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తున్నది. ఫిరాయింపుదార్లకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతునిచ్చి సుప్రీంకోర్టు బోనుదాక వెళ్లకుండా కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాహుల్‌గాంధీ రాజకీయ ఆంతరంగిక సభ్యురాలిగా ఆయన స్ఫూర్తిని ఆమె తెలంగాణలో కొనసాగిస్తారా? లేదా ఎప్పటిలాగే రాట్నం తిప్పి నూలు వడికే తన్మయంలో మునిగిపోయి, తనకు ధర్మసూక్ష్మమే శరణ్యం అంటారో?.. లేదా న్యాయశాస్త్ర సూక్ష్మధర్మ విజ్ఞతతో 10 మంది ఎమ్మెల్యేలపై సుప్రీం తీర్పు కంటే ముందే అనర్హత వేటు వేయిస్తారో? ఆలోచించుకోవాలి.రాహుల్‌గాంధీ పార్లమెంటులో ఫిరాయింపుదార్లను నిరోధించి రాజ్యాంగస్ఫూర్తిని కాపాడుతామని రాజ్యాంగం పట్టుకొని ప్రకటించారు. రాహుల్‌గాంధీ ఆలోచనలకు భిన్నంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తున్నది. ఫిరాయింపుదార్లకు ప్రభుత్వం సంపూర్ణ మద్దతునిచ్చి సుప్రీంకోర్టు బోనుదాక వెళ్లకుండా కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాహుల్‌గాంధీ రాజకీయ ఆంతరంగిక సభ్యురాలిగా ఆయన స్ఫూర్తిని ఆమె తెలంగాణలో కొనసాగిస్తారా?

# కన్నడపై కమల్ వ్యాఖ్యలు సబబేనా







సినీ నటుడు కమల్ హాసన్ ఇటీవల చెన్నైలో ఒక సినిమా వేడుకలో మాట్లాడుతూ కన్నడకు తమిళ భాష జన్మనిచ్చిందని చేసిన వ్యాఖ్య కన్నడనాట ఆగ్రహావేశాలు రేకెత్తించింది. ఈ వ్యాఖ్యలపై కర్ణాటకలోని పలు పోలీస్ స్టేషన్లలో కమల్‌పై కేసులు నమోదైనాయి. కన్నడ భాషకు 2,500 ఏళ్ల చరిత్ర ఉందనీ, తమిళభాష కన్నడానికి జన్మనివ్వటం ఏమిటని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మొదలు అంతా ఆగ్రహించారు. జూన్ 5న విడుదల కానున్న కమల్ హాసన్ తాజాచిత్రం 'థగ్ లైఫ్ 'ప్రదర్శనలకు కర్ణాటకలో ఆటంకం ఏర్పడింది. ఇందుకు స్పందనగా కమల్ మాట్లాడుతూ చరిత్రకారుల ద్వారా తాను తెలుసుకున్న చరిత్రనే ప్రేమతో చెప్పాను తప్ప తనకు వేరే ఉద్దేశమే లేదన్నారు. తన వ్యాఖ్యను ఉపసంహరించుకోవడంగానీ క్షమాపణలు చెప్పడం కానీ చేయబోనని, ఈ విషయాన్ని చరిత్రకారులు, భాషా శాస్త్రవేత్తలకు వదిలేద్దామనీ కమల్ అన్నారు.

కమల్ వ్యాఖ్య బాగోగులేమిటో చూద్దాం. దక్షిణాది భాషలైన తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ, తుళు, తొద మొదలైన భాషలను ద్రావిడ భాషా కుటుంబంగా వ్యవహరిస్తారు. అతి ప్రాచీనమైన ఈ ద్రావిడ భాషలలో ఏది అత్యంత ప్రాచీన భాష అనే విషయం పరిశీలించే ముందు అసలు ద్రావిడులు అంటే ఎవరు? వారు ఎక్కడి నుంచి వచ్చారు? అనేది చూడాలి. ద్రావిడులు ఆర్యులకన్నా ముందు అప్పటి భారతదేశంలో నివసించినవారు. వారు నవీన శిలాయుగంలో నెగ్రిటో, ప్రోటో ఆస్ట్రలాయిడ్ జాతుల తరువాత భారతదేశానికి వచ్చి స్థిరపడిన మెడిటరేనియన్ జాతివారని చరిత్ర పరిశోధకుల నిర్ధారణ. ఈ జాతివారు మధ్యధరా సముద్ర ప్రాంతం నుంచి వాయవ్య భారతదేశం మీదుగా నాటి భారతదేశంలో ప్రవేశించారని కొందరు పరిశోధకులు భావించారు. ఇందుకు ఆధారంగా వారు నేటి పాకిస్థాన్‌లో ఉన్న బలూచిస్థాన్‌లోని బ్రాహుయిస్థాన్ ప్రజలు బ్రాహుయి అనే ద్రావిడ భాషను మాట్లాడుతూ ఉండటాన్ని పేర్కొన్నారు. ద్రావిడ భాషలు మాట్లాడే మిగతా దక్షిణ భారతదేశం నుంచి 1500 కిలోమీటర్ల దూరాన ఉన్న ఈ ప్రజలు ద్రావిడ భాష అయినట్టి బ్రాహుయిని నేటికీ మాట్లాడుతూ ఉండటాన్ని బట్టి, సామాన్య శకపూర్వం (అంటే ) 3,000 సంవత్సరానికి పూర్వమే మధ్యధరా సముద్ర ప్రాంతంనుంచి వలస వస్తూ కొందరు ద్రావిడ జాతీయులు అక్కడ స్థిరపడి ఉంటారనే నిర్ధారణకు వచ్చారు. దక్షిణ ఆసియా భాషలపై విశేష పరిశోధనలు చేసిన ఎలీనా బషీర్, భద్రిరాజు కృష్ణమూర్తి వంటి వారి గ్రంథాలు ఈ అభిప్రాయాన్ని బలపరిచాయి. మధ్యధరా సముద్ర ప్రాంతం నుంచి ద్రావిడులు సముద్రమార్గాన దక్షిణ భారతదేశానికి వచ్చి స్థిరపడి, ఆ తరువాత క్రమంగా ఉత్తర భారతదేశానికి కూడా వ్యాపించి ఉంటారని ఇంకొందరి భావన. ఏది ఏమైనా ద్రావిడులంతా మౌలికంగా నవీన శిలాయుగంలో %దీజజు% 3,000 ప్రాంతంలో మధ్యధరా సముద్రం, పశ్చిమ ఆసియాలోని ఇరాన్ ప్రాంతం నుంచి వలస వచ్చిన వ్యవసాయ సంస్కృతి నిర్మాతలనే విషయాన్ని దాదాపుగా చరిత్రకారులందరూ అంగీకరిస్తున్నారు. పశ్చిమాసియా ప్రాంతపు తవ్వకాలలో ప్రత్యేకించి క్రీటు దీవిలో లభించిన క్రీటన్ జ్యూస్ విగ్రహాలు ద్రావిడులు పూజించే పిళ్ళార్ (వినాయక) విగ్రహాలకు మూలరూపాలని పరిశోధకులు తేల్చారు. నేటి టర్కీలో అంతర్భాగమైన అనటోలియాలోని లికియా లోని దిర్మిల్ ప్రాంతాన్ని అనాదిగా లికియన్లు త్రిమిలి అని పిలుస్తారనీ, దానినే బాబిలోనియన్లు తర్మిలా (%ఖుతీఎఱశ్రీఖ%) అనీ, గ్రీకులు తర్మిలే అనీ పిలుస్తారనీ 'త్రిమిలి' శబ్దమే తమిళ, ద్రవిడ శబ్దాలకు మూలమని భాషావేత్తల నిర్ధారణ.

ప్రతి భాష ఏదో ఒక చారిత్రక దశలో తప్పక ఏదో మరొక భాష నుంచి వేరై ఉంటుంది. ఏ భాషా వేరుగా పుట్టింది మాత్రం కాదనేది గమనార్హం. అసలు ద్రావిడ భాషలేవీ ఏర్పడక ముందుదైన ప్రాగ్ద్రావిడ భాష నుంచి ఈ ద్రావిడ భాషలన్నీ రూపొందాయని భాషావేత్తల అభిప్రాయం. అయితే ద్రావిడ భాషలన్నిట్లోకీ తమిళం అతి ప్రాచీనమైన భాష అనేదానికి ఎన్నో ఆధారాలున్నాయి. ఒక వాడుక భాషగా తమిళం సంస్కృతం కంటే కూడా ప్రాచీనమైనది. ఇక సాహిత్యాధారాల విషయం చూస్తే తమిళ సాహిత్యం %దీజాజు% మూడవ శతాబ్ది నుంచి లభిస్తూ ఉండగా సంస్కృత సాహిత్యం %దీజజు% రెండవ శతాబ్ది నుంచి మాత్రమే లభిస్తున్నది. తమిళం నేటికీ ప్రజల వాడుక భాషగా కొనసాగుతూ ఉండగా, సంస్కృతం సామాన్య శక పూర్వం ఆరవ శతాబ్దిలోనే ప్రజల వాడుక నుంచి తప్పుకుని, కేవలం పండిత భాషగా మిగిలిపోయింది. సామాన్య శకం 850లకు చెందిన 'కవిరాజమార్గ' అనే గ్రంథం కన్నడ భాషలో ఇప్పటికి లభిస్తున్న అతి ప్రాచీన సాహిత్యం. రాష్ట్రకూట పాలకుడైన మొదటి అమోఘవర్షుడు ఈ గ్రంథాన్ని తాను ఒక్కడే కానీ వేరొకరితో కలిసి గానీ రాసివుంటాడని పరిశోధకుల అభిప్రాయం. కన్నడ కవిత్వం, ఛందస్సు, వ్యాకరణం గురించి రాయబడిన అతి ప్రాచీన గ్రంథం ఇదే. 'కావ్యాదర్శమ్' అనే సంస్కృత గ్రంథానికి ఇది అనుకరణ అని పరిశీలకులు భావిస్తారు. ప్రాచీన కర్ణాటక చరిత్ర, నాటి ప్రజల భాషా సంస్కృతులు తెలుసుకోవాలంటే 'కవిరాజమార్గ' చదవాలి. జైన కవులు రాసిన కవితలే కన్నడ భాషలోని తొట్టతొలి కవితలు. పదవ శతాబ్దానికి చెందిన కన్నడ ఆదికవి పంప కన్నడ కవులలో ఆద్యుడు. ఆ జైన కవులు రాసిన రచనలన్నీ యథాతథంగా నేటికీ నిలిచివున్న కారణంగా అవి కన్నడ భాష ప్రాచీనతకు స్పష్టమైన ఆధారాలుగా ఉన్నాయి.

అలా తమిళ సాహిత్యం, కన్నడనాట జైన కవుల రచనలు నేటికీ యథాతథంగా లభిస్తున్న కారణంగా ఆ భాషల ప్రాచీనతకు అవి తిరుగులేని ఆధారాలుగా నిలుస్తున్నాయి. మన తెలుగునాట కడప జిల్లాలో లభించిన సామాన్యశకం 575 నాటి రేనాటి చోడ పాలకుడు ధనంజయుడి పూర్తి తెలుగు శాసనమే అతి ప్రాచీనమైనది. గుంటూరు జిల్లా భట్టిప్రోలులోని బౌద్ధ క్షేత్రంలో లభించిన సామాన్యశక పూర్వం 400 నాటి శాసనంలో కొన్ని తెలుగు పదాలు ఉన్నాయి. అలాగే ఏలూరు సమీపంలోని గుంటుపల్లి దగ్గర ఉన్న కంఠంనేనివారి గూడెం, కృష్ణాజిల్లా నందిగామ సమీపంలోని గుమ్మడిదుర్రు, కృష్ణా జిల్లా దివిసీమలోని ఘంటసాల గ్రామంలోని బౌద్ధ క్షేత్రాలలో లభించిన శాసనాలలోనూ పలు తెలుగు పదాలున్నాయి. అయితే సంస్కృత మహాభారతాన్ని ఆంధ్రీకరించిన %జజు% 11వ శతాబ్దానికి చెందిన నన్నయభట్టు తెలుగులో ఆదికవిగా భావించబడ్డాడు. అంతకు పూర్వపు సాహిత్యమేదీ తెలుగులో లభించకపోవడమే ఇందుకు కారణం. ప్రాచీన ఆంధ్రదేశం బౌద్ధ మతానికి పట్టుగొమ్మ. బౌద్ధులు తమ ధర్మ ప్రచారాన్ని స్థానిక భాషలలోనే చేసేవారు. ఆ కారణంగా బౌద్ధ ధర్మానికి సంబంధించిన ఎన్నో తెలుగు గ్రంథాలు ఒకప్పుడు ఉండే ఉంటాయి. అయితే ఆంధ్ర దేశంలో బౌద్ధం బలహీనపడిన దశలో మహాయాన తాంత్రిక శాఖ అయినట్టి వజ్రయానం పలు దురాచారాలకు లోనై ప్రజాభిమానం కోల్పోయింది. ఆ దశలో హైందవ పునరుజ్జీవనోద్యమంలో భాగంగా బౌద్ధ స్తూపాలు, చైత్యాలు విధ్వంసం చేయబడటమే కాదు, బౌద్ధ సాహిత్యం తగులబెట్టబడి ఉంటుందని చరిత్రకారుల అంచనా. అలా తెలుగు భాష ప్రాచీనతకు సాహిత్యాధారాలు లేకుండా పోయాయి. ఏమైనా తెలుగు భాష తమిళం కంటే ప్రాచీనమైనదని ఎవ్వరూ అనటం లేదు. కమల్ హాసన్ కన్నడ భాషను నిందించలేదు. కించపరచలేదు. కమల్ అభిప్రాయం నచ్చనివారు దానిని తగు ఆధారాలతో తిప్పికొట్టవచ్చు. అంతేకాని, రాజకీయ ప్రయోజనాలు ఆశించి, రెండు రాష్ట్రాలలో భావోద్వేగాలు రెచ్చగొట్టేవారి దుశ్చర్యలు కూడనివి.

మరో ముఖ్యమైన విషయం. త్రిమిలి శబ్దం నుంచే తమిళ, ద్రమిల, ద్రవిడ శబ్దాలు రూపొందాయని పరిశోధనలు రుజువుపరచాయి. మధ్యధరా సముద్రంలోని క్రీటు దీవి, త్రిమిలి ప్రాంతం నుంచి వలసవచ్చి భారతదేశంలో స్థిరపడిన మెడిటరేనియన్లను అందుకే ద్రావిడులు అన్నారు. ద్రావిడ శబ్దం తమిళ శబ్దానికి పర్యాయపదంగా స్థిరపడింది. తమిళుల అభ్యున్నతి కోసం పనిచేసే పార్టీల పేరులో ద్రావిడ శబ్దం అందుకే ఉంది. ద్రావిడ భాషా కుటుంబంగా ఉన్న తమిళ, కన్నడ, తెలుగు, మలయాళ, తుళు, తొద వంటి భాషలలో తమిళ భాష అత్యంత ప్రాచీనమైనదని ఇప్పటికి లభించిన సాహిత్య, శాసనాధారాలవల్ల రుజువైంది. తమిళ భాష నుంచే మిగిలిన ద్రావిడ భాషలు ఉద్భవించాయా? లేదా? అవి మొదటి నుంచీ వేరే భాషలుగానే ఉంటూ వచ్చాయా? అనే విషయం తగు శాస్త్రీయ ఆధారాలతో చేయాల్సిన విద్యావిషయకమైన చర్చ. అంతేగానీ, భాషా జాతుల మధ్య ద్వేషాలకు దారితీసేందుకు ఎవరు ప్రయత్నించినా వారు దేశ సమగ్రతకూ, సామరస్యానికీ హాని కలిగించినట్లే, అది రాజ్యాంగ విరుద్ధమైన చర్యే.

# ఈ ఏడాది నినాదం ప్లాస్టిక్‌ను అంతం చేద్దాం

ప్లాస్టిక్‌తో కాలుష్యం అంతకంతకూ పెరిగిపోతోంది. నేల, చెరువులు, నదులు, సముద్రాలన్నింటినీ ఇది కమ్మేస్తోంది. కాలువలు, నదుల ద్వారానే ఏటా 1.1 కోట్ల మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాల్లోకి చేరుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2040 కల్లా 2.9 కోట్ల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు సముద్రంలోకి చేరే ప్రమాదముంది. కోయంబత్తూరు దగ్గర్లోని భారతీయార్ యూనివర్సిటీకి సమీపంలో 'మరుదామలై' అటవీప్రాంతం ఉంది. ఆ అటవీప్రాంతంలో ఇటీవల ఓ ఏనుగు మృతి చెందింది. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఆ ఏనుగు కడుపులో 15 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలున్నట్లు గుర్తించారు! సందర్శకుల ద్వారా అటవీప్రాంతంలోకి కూడా ప్లాస్టిక్ భూతం ఇంతగా చేరిపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఏనుగులే కాదు నిత్యం ఎన్నో జీవరాసులు ఈ ప్లాస్టిక్ భూతానికి బలవుతూనే ఉన్నాయి. భవిష్యత్తులో వాటిల్లబోయే ప్రమాదాలకు ఈ ఘటనలను ముందస్తు హెచ్చరికగా భావించాలి. ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోంది. కొన్నేళ్ల క్రితం ప్లాస్టిక్ ఉత్పత్తి ఏడాదికి 20లక్షల టన్నులు ఉండగా 2019లో ఇది 45 కోట్ల టన్నులకు పెరిగింది. దీనికి అడ్డుకట్ట వేయకపోతే 2060 నాటికి మూడింతలు పెరిగే ప్రమాదముంది. ఈ కాలుష్య కట్టడికి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండళ్లతో పాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు ఇలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆలోచించాలి. ఆ వ్యర్థాలను పునర్వినియోగించే దిశగా అడుగులు వేయాలి. ప్రస్తుతం పది శాతం కంటే తక్కువగానే ప్లాస్టిక్ పునర్వినియోగం జరుగుతోంది. దీన్ని భారీగా పెంచాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఇప్పటికే భూమ్మీద 600 కోట్ల టన్నుల మేర ప్లాస్టిక్ వ్యర్థాలు పోగుపడ్డాయని లాన్సెట్ పత్రిక ఓ అధ్యయనంలో వెల్లడించింది. ఆ ప్లాస్టిక్ వ్యర్థాలు చాలా వరకు జల వనరుల్లో చేరుతుండడం అతి పెద్ద సమస్యగా మారింది. అక్కడ అవి సూక్ష్మ రేణువులుగా విచ్ఛిన్నమవుతున్నాయి. వాటిలోని రసాయనాలు పర్యావరణానికి, సకల జీవులకూ హాని కలిగిస్తున్నాయి. ప్రధానంగా మానవ శరీరంలోని హార్మోన్ వ్యవస్థను అస్తవ్యస్తం చేయడంతో పాటు క్యాన్సర్, మధుమేహం, సంతానలేమి వంటి ఇతర సమస్యలకు దారి తీస్తున్నాయంటున్నారు వైద్య నిపుణులు. ప్రపంచంలో ఏటా ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్‌లో 5.2 కోట్ల టన్నులకు పైగా బహిరంగ ప్రదేశాలలో కాల్చివేస్తున్నారు. ఆ సమయంలో విడుదలయ్యే విష వాయువులు గాలిలో కలుస్తున్నాయి. ఇవి జీవుల్లో అనేక రుగ్మతలకు కారణమవుతున్నాయి. ఓ సర్వే ప్రకారం గాలి ద్వారా మనం నిత్యం 11.3 ప్లాస్టిక్ సూక్ష్మ రేణువులని పీలుస్తున్నాం. ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా కొన్ని దేశాల్లోని కార్పొరేట్ సంస్థలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. 'ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండకూడదు అనుకుంటే.. దాని జోలికి వెళ్లకపోవడమే ఉత్తమం' అనే నినాదంతో అడుగులు వేస్తున్నాయి. యూకేలో ఇప్పటికే పలు సూపర్ మార్కెట్లు కూల్‌డ్రింక్ టిన్స్, గ్రీటింగ్ కార్డ్స్, బెడ్‌షీట్స్ వంటి వాటిని ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయడం మానేశాయి. ఉత్తర అమెరికాలోని వాల్‌మార్ట్ షాపింగ్‌మాల్లో కూడా ప్లాస్టిక్ వాడకం తగ్గించారు. స్వీడన్‌కు చెందిన ఐసీఏ రిటైల్ సంస్థ పండ్లు, కూరగాయలపై బ్రాండ్ల పేర్లను లేజర్‌తో ముద్రించే ప్రయత్నం చేస్తోంది. యూనీలీవర్, జాన్సన్ వంటి సంస్థలు టూత్‌పేస్ట్, డిటర్జెంట్లను మందుబిళ్ళల రూపంలో తయారుచేసి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నాయి. అమెరికాలో పాల పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో కాకుండా సీసాలు, జగ్గుల్లో విక్రయించే విధానం ఇప్పటికే మొదలైంది. ఇది అన్ని దేశాలూ ఆచరించదగిన శు భపరిణామం. అందుకే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మేము సైతం అంటూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించే మార్గాలను అన్వేషించి ఆచరణలో పెట్టాలి. ఇటీవలి కాలంలో అందుబాటులోకి వస్తున్న బయో ప్లాస్టిక్ వస్తువులతోపాటు సంప్రదాయ గుడ్డ సంచులు, జనపనార బ్యాగులు, విస్తళ్లు, పేపర్ గ్లాసులు తదితర ప్రత్యామ్నాయాలు వాడాలి. చాలా వరకు పట్టణ ప్రాంతాల్లో ఇంటిలో



చెత్తను- తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందిస్తున్నారు. గ్రామస్థాయిలో కూడా మార్పు రావాలి. ఇళ్లలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోవాలి. తప్పని పరిస్థితుల్లో వాడిన ప్లాస్టిక్ వ్యర్థాలను క్రమపద్ధతిలో వేరు చేసి రీసైక్లింగ్‌కు ప్రోత్సహించాలి. పిల్లలకు ప్లాస్టిక్ డబ్బాల్లో భోజనం పంపకుండా స్టీల్ బాక్సుల్లో పెట్టడం అలవర్చుకుంటే అటు పిల్లలకీ ఆరోగ్యం, ఇటు పర్యావరణ హితం కూడా. ఇలాంటి సామాజిక అంశాల పట్ల పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులకు అవగాహన కల్పించాలి. యువత కూడా రీసైక్లింగ్ రంగంలోకి అడుగుపెట్టాలి. ప్రభుత్వాలు ఆ దిశగా అంకుర పరిశ్రమలను నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కులగణన ఎలా జరగాలి




కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయం వెనుకబడిన కులాలకు సామాజిక న్యాయాన్ని అందించడంలో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించనుంది. 2011లో జనగణనలో కులగణన చేస్తామని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా ప్రకటించి, మరుసటి రోజే మళ్లీ అలా చేయబోమని, ప్రత్యేకించి సామాజిక, ఆర్థిక, కులగణన చేస్తామనీ చెప్పి, ఆ సోషల్ ఎకానమిక్ క్యాస్ట్ సెన్సెస్ రిపోర్టు కూడా బయటపెట్టలేదు. తర్వాత ఆ సెన్సెస్‌లో తప్పులున్నాయని చేతులు దులుపుకుని, రిపోర్ట్‌ను బుట్టదాఖలు చేసింది. అలా ఐదువేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. ఈసారైనా కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణనను చిత్తశుద్ధితో చేయాలి. వీరికి ఆ వృత్తి నైపుణ్యం లేక ఆ సెన్సెస్ తప్పుల తడకగా మారింది. 2) కులగణన జనగణనలో అంతర్భాగం కావాలి. దీని కొరకు సెపరేట్ ఫారం ఉండకూడదు. ఉంటే కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. 3) ఈ సెన్సెస్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల లెక్కలు మాత్రమే గాక, అన్ని కులాల లెక్కలు తీయాలి. అదే విధంగా ముస్లింలలో, క్రిస్టియన్స్‌లో ఉన్న కులాల లెక్కలు కూడా గణించాలి. 4) ప్రతి కులానికి ఒక కోడ్ నంబర్ ఇవ్వాలి. లేదంటే అనేక కులాలు పుట్టుకు వచ్చి డాటా స్వచ్ఛత దెబ్బ తింటుంది. ఉదాహరణకు ఒకే కులాన్ని ఒకే రాష్ట్రంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలుస్తారు. ఉదాహరణకు చాకలి వారిని కొన్ని ప్రాంతాల్లో రజక అంటారు, కొన్ని ప్రాంతాల్లో ధోబి అంటారు. ముస్లిం, క్రిస్టియన్ మతాలలోని కులాల క్రోడీకరణ జరగాలి. 5) ప్రస్తుతమున్న సెన్సెస్ ఫారంలో కాలం నెంబర్ 8లో కులాల వివరాలు తెలియపరచవలసి ఉంటుంది. కాలం నెంబర్ 8లో ఎస్సీ అయితే ఎస్సీ అని టిక్ చేసి కింద 8%లో ఏ కులమో తెలియచేయాలి. అదేవిధంగా ఎస్టీ అయితే ఎస్టీ అని టిక్ చేసి క్రింద 8%లో తెగ వివరాలు చెప్పాలి. ఇక్కడ బీసీ లేదా ఓబీసీ అనే కాలమ్ సృష్టించాలి.రాజ్యాంగ రీత్యా ఆర్టికల్ 3421 ప్రకారం కేంద్రం తన స్వంత ఓబీసీ లిస్ట్‌ను కలిగి ఉండవచ్చును. అదేవిధంగా రాష్ట్రాలు ఆర్టికల్ 3423 ప్రకారం తమ స్వంత లిస్ట్ కలిగి వుండవచ్చు. అందువలన ఈ రెండు కాలమ్స్ ఉండటం శ్రేయస్కరం. అయితే మొదట ఈ లిస్టులు పత్రికలలో ప్రకటించాలి. అలాగే ఓసీ కాలమ్ కూడా సృష్టించాలి. అక్కడ కూడా కింద కులాల లిస్ట్ కోడ్ నంబర్లతో ఉండాలి. ముస్లిం, క్రిస్టియన్ ఇతర మతాలకు కూడా కాలమ్స్ సృష్టించాలి. వారి కులాలను కూడా క్రోడీకరించి కోడ్ నంబర్స్ ఇవ్వాలి. 6) ప్రస్తుత సెన్సెస్ ఫార్మేట్‌లో 29 కాలమ్స్ మాత్రమే ఉన్నాయి. ఇందులో ఆర్థికపరమైన డాటా పెద్దగా సేకరించడం లేదు. కేవలం కుల డాటా సేకరించి భూమి, ఆర్థిక వివరాల డాటా సేకరించకపోతే బీసీల సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం తేటతెల్లం కాదు. కాబట్టి సెన్సెస్ కాలమ్స్ కొన్ని పెంచాలి. అదేవిధంగా ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఓటర్ ఐడి కార్డ్స్ సమాచారాన్ని కూడా సేకరించాలి. 7) ఈ సెన్సెస్‌ను జాతీయ జనాభా రిజిస్టర్‌కు లింక్ చేయకుండా ఉంటే మంచిది. లేనట్టయితే అనవసర రాజకీయాలకు దారితీసి డాటా సమగ్రత దెబ్బతినే అవకాశం ఉంది. 8) సెన్సెస్‌లో డాటా సేకరణ డిజిటల్‌గాను, మాన్యువల్‌గాను కూడా జరగాలి. కొండ ప్రాంతాలలో సెల్ ఫోన్ సిగ్నల్స్ తక్కువ కాబట్టి మాన్యువల్ సెన్సెస్ ఉపయుక్తం. 9) సేకరించిన సమాచారం గోప్యంగా ఉంచాలి. అది వ్యక్తి ప్రైవసీకి భంగం కలగకుండా భద్రపరచాలి. 10) సెన్సెస్ ఆఫ్ ఇండియా ఆక్ట్ 1948 ద్వారా సెన్సెస్ జరుగుతుంది. ఇప్పుడు అన్ని మతాలలోని కులాల జనగణన జరుగుతుంది కాబట్టి ఆ సెన్సెస్ చట్టాన్ని కూడా అవసరమైన మేరకు సవరించాలి. అదేవిధంగా ఒక స్వతంత్ర సెన్సెస్ కమిషన్ వేసి ప్రజాభిప్రాయం ద్వారా ఫార్మేట్స్‌ను రూపొందించి చట్టంలో కావాల్సిన మార్పులు చేర్పులు చేసి ఈ కులగణనను చేయాలి. 11) భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే అన్ని సర్వేలలో కూడా ఓబీసీ కాలమ్స్ చేర్చి వివరాలు సేకరించాలి. 12) కేంద్ర ప్రభుత్వం కులగణన షెడ్యూల్‌కు ఎంతోముందునుంచే తగు ప్రచారాన్ని కల్పించాలి, ప్రజలను సమాయత్త పరచాలి. కులం అనేది భారతదేశంలో ఒక వాస్తవికత. కులం ఎక్కడ ఉందో అక్కడ వివక్ష కూడా ఉంటుంది. అందుకే ఈ కులగణన ఒక రోగ నిర్ధారణ పరికరం. రోగం సరిగా తేలితే అప్పుడు చికిత్స సులభం. కాబట్టి ఈ ప్రక్రియ మొత్తం పారదర్శక విధానాలతో జరగాలి. భారతదేశం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా, మానవ అభివృద్ధి సూచీలో 130వ ర్యాంకులోనే మిగిలిపోయింది. ఈ కులగణన ద్వారా సామాజిక, ఆర్థిక, అవసరమైతే రాజకీయ అంశాలను లెక్కించి రాబోయే కాలంలో తగు విధాన నిర్ణయాలు, ప్రణాళికలు రచించి మానవాభివృద్ధి సూచికలలో, ముఖ్యంగా విద్యా ఆరోగ్యాలలో మన స్థానాన్ని మెరుగుపరుచుకోవచ్చు.

# కనీస మద్దతు ధరలో రైతులకు ద్రోహం




రాబోయే ఖరీఫ్ సీజన్ కోసం ఇటీవల కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర -ను గమనిస్తే రైతాంగాన్ని మోసం చేసినట్లుగా అర్థం చేసుకోవాలి. 2025-26 ఖరీఫ్ సీజన్ కోసం రూ. 2.07 లక్షల కోట్ల ఎంఎస్పీ ప్యాకేజీని ఆమోదించడం ద్వారా రైతులకు ఎంతో ఉపశమనం కలిగించామని బీజేపీ ప్రభుత్వం భారీగా ప్రచారం చేసింది. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుపై కొత్త ఎంఎస్పీ కనీసం 50 శాతం లాభాన్ని నిర్ధారిస్తుందనే వాదనను కార్పొరేట్ మీడియా వెంటనే ప్రచారం చేయడం మొదలుపెట్టింది. ఎం.ఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని 'జాతీయ రైతుల కమిషన్ 2006' నివేదికలో రైతులకు వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించడానికి సమగ్ర సాగు వ్యయం (సి2) కంటే కనీసం 50 శాతం ఎక్కువ గిట్టుబాటు ధర ఇవ్వాలని స్పష్టంగా పేర్కొంది. అయితే రెండు దశాబ్దాల తర్వాత కూడా ఈ సిఫారసులు అమలు కావడం లేదు. రైతులు పొందే ధరకు, ఎంఎస్పీకి మధ్య భారీగా వ్యత్యాసం ఉంది. సాగు ఖర్చు సర్వే ప్రకారం వరి రైతులు అందుకున్న సగటు ధర 2021%-%22లో ఎంఎస్పీ ఎ2ంఎఫ్ఎల్ (ప్రాథమిక ఖర్చు, కుటుంబ శ్రమ) కంటే 36శాతం తక్కువగా ఉంది. అదే ఏడాది తెలంగాణలో కంది పంటకు ఎంఎస్పీ 11 శాతం తక్కువగా ఉంది. వ్యవసాయ మంత్రిత్వశాఖ విడుదల చేసిన ఎంఎస్పీపై దాదాపు అన్ని పంటలకు, ముఖ్యంగా వరికి నిజమైన ఎంఎస్పీ వృద్ధిలో మందగమనాన్ని చూపిస్తోంది. ఖరీఫ్ పంటల్లో వరిపై ప్రస్తుతం ఎంఎస్పీ క్వింటాలుకు కేవలం రూ. 69 పెరిగింది. సీఏసీపీ అంచనా వేసిన జాతీయ సగటు ధర ప్రకారం వరికి సి2ం50శాతం ధర క్వింటాలుకు రూ.3,135, కానీ ప్రకటించిన ఎంఎస్పీ కేవలం రూ. 2,369. అంటే క్వింటాలుకు రూ. 766 నష్టం. తెలంగాణ సహా చాలా రాష్ట్రాల్లో ఎంఎస్పీ ఇలాగే ఉంది. రాగులకు రూ. 596, పత్తికి రూ. 589, నువ్వులకు రూ. 579, నైజర్ సీడ్ ఎంఎస్పీని క్వింటాల్‌కు రూ. 820 పెంచినట్లు ప్రభుత్వం ప్రచారం చేసింది. కానీ ఈ పెరిగిన ధరలు కూడా సి2ం50 శాతం స్థాయి కంటే చాలా తక్కువగా ఉన్నాయి. దీని ద్వారా రైతులకు ఒరిగే ప్రయోజనం కంటే నష్టాలే ఎక్కువ. జొన్న పంటకు ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్పీతో పోలిస్తే రైతుకు రూ.1,110 నష్టం. సజ్జలు, మొక్కజొన్నల ఎమ్మెస్పీ కూడా అలాగే ఉంది. సీఏసీపీ అంచనా వేసిన ఖర్చు కంటే వాస్తవ ఉత్పత్తి వ్యయం చాలా ఎక్కువ. నిత్యం పెరుగుతున్న ఇన్‌పుట్ వ్యయం రైతుల ఖర్చులను ఇంకా పెంచుతోంది. కానీ వారు తమ ఉత్పత్తులకు న్యాయమైన ధరను పొందడం లేదు. దేశంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యలకు ఇదే కారణం. రైతులను తప్పుదోవ పట్టించకుండా పంటలకు న్యాయమైన ధర కల్పించేందుకు బీజేపీ చిత్తశుద్ధితో సంకల్పించాలి.

# ఒక ప్రజాస్వామ్యవాది ఆకాంక్ష






భారత్‌లో ప్రజాస్వామిక ప్రక్రియ కొత్త చైతన్యంతో ద్విగుణీకృతమవడం ఎలా? 2009 సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఢిల్లీ మ్యాగజైన్ నొకదానికి రాసిన వ్యాసంలో నేను నాలుగు ప్రతిపాదనలు చేశాను. అవి: 'గాంధీ నెహ్రూ కుటుంబానికి గుడ్డిగా విధేయం కాని పార్టీగా కాంగ్రెస్ ప్రభవించాలిబీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు, దాని హిందూరాష్ట్ర స్థాపన లక్ష్యానికి భారతీయ జనతా పార్టీ తనకుతానుగా దూరమవ్వాలిబీ సమైక్య, సంస్కరణల ఆధారిత వామపక్షం ఆవిర్భవించాలి (హింసాత్మక పద్ధతులను పూర్తిగా త్యజించడంతో పాటు ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణ తప్పనిసరి అనే విశ్వాసాన్ని అది వదులుకోవాలి)బీ విస్తరిస్తున్న మధ్యతరగతి వర్గ ఆకాంక్షల ప్రాతిపదికన పూర్తిగా ఒక కొత్త రాజకీయ పక్షం ఉనికిలోకి రావాలి (ఇది, సకల కుల, మతాలకు సమ ప్రాధాన్యమిస్తూ, నిర్దిష్ట. సామాజిక వర్గాల ప్రయోజనాలకు మాత్రమే అనుకూలంగా ఉండే విధానాలను ప్రోత్సహించకూడదు). పదిహేను సంవత్సరాల నాటి నా ఆకాంక్షల జాబితా అది. మూడు సార్వత్రిక ఎన్నికల అనంతరం, అవి మన అనుభవంలోకి ఏ మేరకు వచ్చాయో నిశితంగా చూద్దాం. గాంధీ%-%నెహ్రూ కుటుంబానికి చెందని వ్యక్తి ఒకరు భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడు అయ్యారు. అయినా ఆ పార్టీ ఇప్పటికీ ఆ కుటుంబ నియంత్రణలోనే ఉన్నది. మల్లికార్జున్ ఖర్గే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిన వెన్వెంటనే రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్రను సందర్శించారు భారత్ తదుపరి ప్రధానమంత్రి రాహుల్ గాంధీయే అని ఖర్గే ప్రకటించారు. ఈ విషయమై పార్టీ శ్రేణుల్లో కొంత మందికి భిన్నాభిప్రాయాలు లేకపోలేదు. ప్రధానమంత్రి పదవికి ప్రత్యామ్నాయ అభ్యర్థిగా రాహుల్ సోదరి ప్రియాంక గాంధీని వారు సూచిస్తున్నారు. బీజేపీ విషయానికి వస్తే ఆరెస్సెస్‌కు దూరం జరగలేదు. హిందూత్వ భావజాలాన్ని త్యజించలేదు పైగా మరింతగా సంఘ్ ప్రభావంలోకి వెళ్లింది. లోక్‌సభలో బీజేపీకి చెందిన 300మందికి పైగా ఎంపీలలో ఒక్క ముస్లిం కూడా లేకపోవడం గమనార్హం. మైనారిటీల పట్ల, ముఖ్యంగా ముస్లింల పట్ల బీజేపీ విధానమేమిటో అది స్పష్టం చేసింది. హిందువుల వలే ముస్లింలను సమాన భారత పౌరులుగా బీజేపీ పరిగణించడం లేదన్నది స్పష్టం. పాఠ్య గ్రంథాలలో ముస్లింలకు సంబంధించిన కొన్ని పాఠాలను తీసివేయడం, జాతీయ విద్యా విధానం మొదలైనవన్నీ అధికారంలో ఉన్న పార్టీ మెజారిటీ వాద దృక్పథాన్ని స్పష్టం చేస్తున్నాయి. భారతీయ వామపక్షాలు, ఈ వ్యాసకర్త ఆశించిన విధంగా తమనుతాము సంస్కరించుకోలేదు. నక్సలైట్లు తమ అజ్ఞాతవాసాన్ని వీడి ప్రధాన స్రవంతిలోకి ప్రవేశించి, బహుళ పార్టీ వ్యవస్థలో భాగమవడానికి బదులు విచక్షణారహితంగా హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారు. పార్లమెంటరీ వామపక్షాలు ఇప్పుడు కేవలం ఒకే ఒక్క రాష్ట్రం అధికారంలో ఉన్నాయి. అక్కడ కూడా అవి పాలన పట్ల తమ దృక్పథాన్ని చెప్పుకోదగిన రీతిలో మార్చుకోనేలేదు. పదిహేనేళ్ల క్రితం నా ఆకాంక్షల జాబితాలో చివరిది కొత్త రాజకీయ పార్టీ సృష్టి. 2012లో భారత రాజకీయ రంగంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రవేశించడంతో ఆ నా కోరిక సైద్ధాంతికంగా నెరవేరింది. ఢిల్లీ ప్రజలకు ఉచిత విద్యా వైద్య సదుపాయాలు కల్పించడంలో ఆ పార్టీ ప్రభుత్వం ఒక ప్రశస్త రికార్డును నెలకొల్పినా పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కేంద్రంగా వ్యక్తి పూజను ప్రోత్సహిస్తున్నది. వివిధ వివక్షాపూరిత చట్టాలకు బాధితులు అయిన మైనారిటీల పక్షాన నిలబడేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ తిరస్కరిస్తోంది. భారతీయ పార్టీల వ్యవస్థను నాలుగు రీతుల్లో పునర్నిర్మించేందుకు పదిహేనేళ్ళ క్రితం నేను ఆ ప్రణాళికను ప్రతిపాదించాను. దరిమిలా మూడు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి 2009 నాటి నా ప్రణాళిక పూర్తిగా నెరవేరలేదు. కాలం కొన్ని పాఠాలు నేర్పింది. గాంధీ%-%నెహ్రూల నాయకత్వాన్ని వదిలివేయాలని కాంగ్రెస్‌ను కోరాలని నేను ఇప్పుడు అనుకోవడం లేదు. అలాగే బీజేపీ తనను తాను ఆరెస్సెస్ నుంచి వేరుపరచుకోవాలని, భారతీయ వామపక్షాలు మావో, లెనిన్ పంథాలను విడనాడాలని, దేశీయ గ్రీన్ పార్టీగా ఆమ్ ఆద్మీ పార్టీ రూపొందాలని నేను కోరదలుచుకోలేదు. అవి అలా పరిణమించగలవనే ఆశాభావమూ నాకు లేదు. సరే, ఏడాదిలోగా తదుపరి సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. దేశ రాజకీయాలలో నిర్ణయాత్మక ప్రభావాన్ని చూపే ఆ సంఘటనను దృష్టిలో ఉంచుకుని ఒక కొత్త కోరికల జాబితాను ప్రతిపాదిస్తున్నాను. ఇది, గత జాబితా కంటే తక్కువ అంచనాలతో రూపొందించినది. కొత్త లోక్‌సభలో ఏ ఒక్క పార్టీ మెజారిటీ సీట్లు గెలుచుకోకూడదని నేను ఆశిస్తున్నాను. ఆ మాటకొస్తే ఏకైక పెద్ద పార్టీగా ఆవిర్భవించిన పార్టీ కూడా, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అర్హమైన మెజారిటీ కంటే తక్కువ సీట్లు మాత్రమే సాధించుకోవాలని నేను భావిస్తున్నాను. మన ప్రధానమంత్రి స్వాభావికంగా నిరంకుశుడు. ఆయన వ్యక్తిత్వంలోని ఈ అనారోగ్యకర లక్షణం, గత రెండు సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ వరుసగా సాధించిన ఘన విజయాలతో, మరింతగా బలపడింది. మోదీకి ముందు ఇందిరాగాంధీ కూడా నిరంకుశంగా పరిపాలించారు. 1971 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మహా విజయంతో ఆమె నిర్భయంగా నియంతృత్వ బాటలో ముందుకు సాగారు. మోదీ, ఇందిర మధ్య కాలంలో రాజీవ్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ 1984 సార్వత్రిక ఎన్నికలలో చరిత్రాత్మక విజయాన్ని పొందింది. ఓటర్లు తమ వివేకంతో, లేదా అది కొరవడడం వల్లో, రాజీవ్ కాంగ్రెస్‌కు 400కి పైగా సీట్లు కట్టబెట్టారు. ఆ తీర్పు, రాజకీయాలలోనూ దేశ పాలనా వ్యవస్థలోనూ దురదృష్టకర పర్యవసానాలకు కారణమయింది. భౌగోళికంగా భారత్ ఒక సువిశాల దేశం. సమస్త జీవన రంగాలలో అపార వైవిధ్యమున్న జాతి. మరి ఈ పురా నవ దేశాన్ని విస్తృత సహకారం, సంప్రదింపులతో కాకుండా ఇతరేతర పద్ధతులలో పాలించడం ప్రజల శ్రేయస్సుకు, జాతి అభ్యున్నతికి కచ్చితంగా దోహదం చేయదు. అయితే పార్లమెంటులో అత్యధిక సంఖ్యాబలం కలిగివుండడం పాలక పక్షంలో దురహంకారాన్ని ప్రోత్సహిస్తుంది. అత్యధిక ఎంపీలను నియంత్రించగలిగే ప్రధాన మంత్రి తన కేబినెట్ సహచరులపై మొరటుగా పెత్తనం చెలాయించగలుగుతాడుబీ ప్రతిపక్షాలను గౌరవించడుబీ మీడియాను నయానో భయానో లొంగదీసుకుంటాడు రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తిని బలహీనపరుస్తాడుబీ రాష్ట్రాల హక్కులు, ప్రయోజనాలను ఉపేక్షిస్తాడుమరీ ముఖ్యంగా ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాలను అనాదరిస్తాడు. మొత్తం మీద ఇందిర, రాజీవ్, మోదీల కంటే పీవీ, వాజపేయి, మన్మోహన్ సింగ్‌లే మెరుగైన ప్రధానమంత్రులుగా భావి చరిత్రకారులు భావించే అవకాశమున్నది. అయితే రెండో త్రయం కంటే మొదటి ముగ్గురు వివేకశీలురు, మరింత సమర్థులు అని తప్పనిసరిగా భావించనవసరం లేదు. పీవీ, వాజపేయి, మన్మోహన్‌లు అధికారానికి వచ్చిన పరిస్థితులే, బహుశా, వారు తమ కేబినెట్ సహచరులకు ఎక్కువ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఇచ్చేందుకుబీ అలాగే వివిధ సామాజిక వర్గాలు, ప్రాంతాలు, ప్రజా ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంకీర్ణ భాగస్వామ్య పక్షాల మాటను మన్నించేందుకుబీ ప్రతిపక్షాలతో తరచు సంప్రదింపులు జరిపేందుకుబీ మీడియా స్వేచ్ఛకు ఆటంకాలు కలిగించకుండా ఉండేందుకుబీ న్యాయవ్యవస్థను ఒత్తిళ్లకు గురిచేయకుండా ఉండేందుకు, ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థల వ్యవహారాలలో జోక్యం చేసుకోకుండా ఉండేందుకుబీ రాష్ట్రాల హక్కులను గౌరవించేందుకు పురిగొలిపి ఉంటాయి. పీవీ, వాజపేయి, మన్మోహన్‌ల హయాంలో ఆర్థిక వ్యవస్థ గణనీయమైన పురోగతి సాధించింది, సమాఖ్య పాలనా విధానం వర్ధిల్లింది. మైనారిటీల హక్కులకు రక్షణ భించింది. స్వతంత్ర సంస్థలు విశేషంగా లబ్ధి పొందాయి. ఒక ఆధిపత్య పార్టీ లేకపోవడం, ప్రధానమంత్రులు గర్వాతిశయాలతో వ్యవహరించేవారు కాకపోవడం ఆ అభ్యున్నతికి కారణాలు అని మరి చెప్పనవసరం లేదు. రాష్ట్రాలు మునుపెన్నడూ లేని రీతిలో కేంద్రం ముందు దైన్యంగా మోకరిల్లవలసివస్తుంది అటువంటి పరిణామాలు అంతిమంగా ఆర్థిక వ్యవస్థ పురోగతినీ దెబ్బ తీస్తాయి. ఈ భయాలతో, వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఎలా ఉండాలని అభిలషిస్తున్నానో చెప్పుతాను. 18వ లోక్‌సభలో ఏ ఒక్క పార్టీ 250కి మించి సీట్లు గెలుచుకోకూడదు. అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించే పార్టీ సైతం కైవసం చేసుకునే సీట్లు 200 కంటే తక్కువగా ఉంటే మరీ మంచిది. ఇదే జరిగితే మన అధికార వ్యవస్థలో ఒకే ఒక పార్టీ ఆధిపత్యముండదు. ఏకైక వ్యక్తి ప్రాబల్యం అంతకన్నా ఉండదు. భారత్, మరింత వివేకవంతంగా కానప్పటికీ, కచ్చితంగా తక్కువ దురహంకారపూరిత పాలనకు నోచుకుంటుంది.

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt)APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur . ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell : 6303427710